# యేసును నమ్ముచున్నాము

ఐదవ పాఠము

## రాజు

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ........................................................................................ 1
పాత నిబంధన నేపథ్యం......................................................................................... 2
**అర్హతలు**.......................................................................................................... 2
మోషే ధర్మశాస్త్రము.................................................................................................. 2
దావీదుతో చేయబడిన నిబంధన ................................................................................. 5
**కార్యములు** ......................................................................................................... 6
న్యాయము................................................................................................................. 7
కనికరము ................................................................................................................... 9
నమ్మకత్వము ............................................................................................................ 11
**ఆకాంక్షలు**........................................................................................................ 12
చారిత్రిక అభివృద్ధి....................................................................................................... 13
విశేషమైన ప్రవచనములు.......................................................................................... 18
యేసులో నెరవేర్పు ................................................................................................. 21
**అర్హతలు**.......................................................................................................... 22
దేవునిచే యేర్పరచబడుట.......................................................................................... 22
ఇశ్రాయేలీయుడు...................................................................................................... 23
దేవుని మీద ఆధారపడుట.......................................................................................... 23
నిబంధనా నమ్మకత్వము.......................................................................................... 23
దావీదు కుమారుడు.................................................................................................. 25
**కార్యములు** ....................................................................................................... 26
న్యాయము................................................................................................................. 26
కనికరము ................................................................................................................. 27
నమ్మకత్వము ........................................................................................................... 31
**ఆకాంక్షలు**........................................................................................................ 33
దావీదు రాజవంశము ................................................................................................ 34
స్వాతంత్ర్యము మరియు జయము ............................................................................. 35
నిత్య రాజ్యము.......................................................................................................... 36
సార్వత్రిక రాజ్యము .................................................................................................. 38
ఆధునిక అనువర్తన ................................................................................................. 39
**ఆయన రాజ్యమును నిర్మించుట**........................................................................ 40
లక్ష్యము .................................................................................................................... 40
వ్యక్తీకరణ ................................................................................................................... 41
విధానములు............................................................................................................. 44
**తన ప్రజలను పాలిస్తాడు** ................................................................................... 46

పాలిస్తాడు ........................................................................................ 46
కాపాడతాడు ........................................................................................ 47
**తన విరోధులను జయిస్తాడు ........................................................................ 48**
**ముగింపు ........................................................................................ 51**



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# యేసును నమ్ముచున్నాము

ఐదవ పాఠము

రాజు

## ఉపోద్ఘాతము

చాలా సార్లు మానవ చరిత్ర బలమైన రాజుల పరిపాలన ఆధారంగా లిఖించబడుతుంది. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, మరియు ల్యాటిన్ అమెరికాలోని ఎక్కువ భాగములను పరిపాలించిన రాజులను గూర్చి మనమంతా వినే ఉంటాము. వీరిలో కొంత మంది ఎంత మంది శత్రువులను జయించారు అంటే, వారి సామ్రాజ్యములు భూదిగంతముల వరకు ప్రాకినట్లు అనిపిస్తుంది. మరియు వీరందరిలో ఒక విషయము మాత్రం సామాన్యముగా ఉంది. వారంతా వెళ్లిపోయారు; వారు మరణించారు; వారు ఇక పాలించుట లేదు. మహా సైన్యములు అంతరించిపోయాయి, మరియు వారి పరిపాలన కనుమరుగైపోయింది.

ఈ నియమమునకు ఒకే మినహాయింపు ఉంది. శక్తిని కోల్పోని, ఆయన రాజ్యము ఎన్నడును అంతరించని ఒక రాజు ఉన్నాడు. అవును, ఆ రాజు యేసే.

యేసును నమ్ముచున్నాము అను మన పాఠ్య క్రమములో ఇది ఐదవ పాఠం, మరియు దీనికి "రాజు" అని పేరు పెట్టాము. ఈ పాఠంలో, దేవుని యొక్క నమ్మకమైన సేవకునిగా మరియు కుమారునిగా పాలిస్తూ యేసు పాత నిబంధన స్థానమైన రాజు స్థానమును ఏ విధంగా నెరవేర్చాడో చూద్దాము. మునుపటి పాఠంలో మనం ప్రస్తావించినట్లు, దేవుడు పాత నిబంధనలో మూడు స్థానములను స్థాపించి, వాటి ద్వారా తన రాజ్యమును పాలించాడు: ప్రవక్త, యాజకుడు మరియు రాజు స్థానములు. మరియు దేవుని రాజ్యము యొక్క చివరి స్థాయిలో, దీనిని మనము సాధారణంగా క్రొత్త నిబంధన యుగము అని పిలుస్తాము, ఈ మూడు స్థానములు వాటి అంతిమ నెరవేర్పును క్రీస్తులో పొందుకుంటాయి. ఈ పాఠంలో, యేసు యొక్క రాజు స్థానము మీద దృష్టిపెడదాము.

మన ఉద్దేశముల కొరకు, రాజు స్థానమును ఈ విధముగా నిర్వచించుదాము:

> **దేవుని పక్షమున ఆయన రాజ్యమును పాలించుటకు దేవుడు నియమించిన మానవుడు.**

ఈ నిర్వచనము సూచించుచున్నట్లు, దేవుడు ఎల్లప్పుడూ సృష్టియంతటి మీద ఉన్నతమైన పరిపాలకుడైయున్నాడు మరియు పరిపాలకుడైయుంటాడు. అయితే తనకు రాజ ప్రతినిధులుగా పని చేయుటకు ఆయన మానవులను నియమించాడు. ఈ మానవ రాజులు ఆయన ఆధీనములో సేవిస్తారు, మరియు ఆయన రాజ్య ఉద్దేశములు మరియు లక్ష్యములను నెరవేర్చుటకు పని చేస్తారు. ఈ సామాన్య నిర్వచనమును మనస్సులో ఉంచుకొని, బైబిలు స్థానమైన రాజు స్థానమును గూర్చి అనేక మెళకువలను మనము నేర్చుకొని, యేసు ఈ స్థానమును ఎలా నెరవేర్చుతాడో చూడగలుగుతాము.

యేసు యొక్క ప్రవక్త మరియు యాజక స్థానములను గూర్చిన మన పాఠముల పద్ధతినే ఈ పాఠం కూడా అనుసరిస్తుంది. మొదటిగా, ఆయన రాజు స్థానమునకు పాత నిబంధన నేపథ్యమును పరీక్షిద్దాము. రెండవదిగా, యేసులో రాజు స్థానము యొక్క నెరవేర్పును చూద్దాము. మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మూడవదిగా, మన జీవితముల మీద యేసు రాజత్వము యొక్క ఆధునిక అనువర్తనను చూద్దాము. మొదటిగా యేసు యొక్క రాజు స్థానమునకు పాత నిబంధన నేపథ్యమును చూద్దాము.

## పాత నిబంధన నేపథ్యం

తాను వ్రాసిన *ది రిపబ్లిక్* అను పుస్తకములో, ప్రభుత్వములన్నిటిలో తత్వవేత్త రాజుగా ఉన్న పరిపాలన ఉత్తమైనది అని గ్రీకు తత్వవేత్తయైన ప్లాటో వ్రాశాడు. అతని అభిప్రాయములో, ఐశ్వర్యము మరియు అధికారము కంటే జ్ఞానమును నిజముగా ప్రేమించిన రాజులు తమ దేశములను ఎనలేని లాభములలోనికి నడిపిస్తారు. ఇదే విధముగా, ఇశ్రాయేలు రాజులు దేవునికి భయపడి ఆయన ఆజ్ఞలను పాటించినప్పుడు, తమ దేశములు దేవుని ఆశీర్వాదములలో వర్ధిల్లాయి అని లేఖనము చెబుతుంది. కాని దీనికి వ్యతిరేకము కూడా జరిగింది: వారు దేవుని మీద తిరుగుబాటు చేసినప్పుడు, దేశమంతా దేవుని తీర్పును అనుభవించింది. ఈ భావనలో, భూమి మీద దేవుని రాజ్యము క్షేమముగా ఉండుటకు ఇశ్రాయేలు దేశపు రాజులు కేంద్రమైయుండిరి.

రాజు స్థానము యొక్క పాత నిబంధన నేపథ్యమును మూడు అంశములలో పరిశీలిద్దాము: మొదటిగా, రాజు స్థానము యొక్క అర్హతలు; రెండవదిగా, రాజు యొక్క కార్యములు; మరియు మూడవదిగా, ఇశ్రాయేలులో రాబోవు రాజత్వమును గూర్చి పాత నిబంధన సృష్టించిన ఆకాంక్షలు. రాజు స్థానము కొరకు కావలసిన అర్హతలతో ఆరంభిద్దాము.

### అర్హతలు

పాత నిబంధనలో, రాజుల కొరకు అర్హతలను దేవుడు రెండు స్థాయిలలో బయలుపరచాడు. మొదటిగా, మోషే ధర్మశాస్త్రములో, ఇశ్రాయేలు దేశమునకు రాజు లేకమునుపే దేవుడు రాజత్వమునకు అర్హతలను బయలుపరచాడు. మరియు రెండవదిగా, రాజరికము స్థాపించబడిన తరువాత దావీదుతో దేవుడు చేసిన నిబంధన మరొక ప్రాముఖ్యమైన అర్హతను జోడించింది. మోషే ధర్మశాస్త్రములో ఇవ్వబడిన రాజత్వ నియమములను మొదట చూద్దాము.

#### మోషే ధర్మశాస్త్రము

> పాత నిబంధనను, ముఖ్యముగా మొదటి ఐదు పుస్తకములైన పంచకాండములను చదువునప్పుడు, అక్కడ రాజు యొక్క రాక కొరకు ఒక ఎదురుచూపు ఉండుట ఆసక్తికరమైన విషయము. రాజులు లేకమునుపే వారు ఎలా ఉండాలి మరియు ఏమి చెయ్యాలి అను సమాచారము ఉనికిలో ఉండినది. ఇలా ఎందుకు జరిగింది? రాజును గూర్చిన ఎదురుచూపు మరియు రాజు చేయవలసిన కార్యములను గూర్చి ఇవ్వబడిన ద్వితీ. 17 వంటి వాక్యభాగములను దేవుని ప్రణాళిక వెలుగులో మనము చూడాలని నా ఆలోచన. మీరు ఆదాము కాలము నుండి ఆలోచన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> చెయ్యాలి. ఆదాము ప్రవక్తగాను, యాజకునిగాను, రాజుగాను పని చేశాడు. భూమి మీద అతని అధికారము, ఆ పరిపాలన మరియు రాజత్వము, కొంత వరకు తరిగిపోయింది. అబ్రాహాము నిబంధన ద్వారా ఇశ్రాయేలు దేశములో అది మరలా ఆరంభమైయ్యింది. అబ్రాహాము సంతతిలో నుండి రాజులు వస్తారని ఆది. 17లో కూడా వాగ్దానములు ఉన్నాయి. తరువాత అది ఇశ్రాయేలులో మరియు ప్రత్యేకముగా రాజు ద్వారా నెరవేర్చబడుతుంది. మోషే ద్వారా ద్వితీ. 17 వంటి చోట్ల అనేక సంవత్సరముల క్రితమే ప్రకటించబడినప్పటికీ పాత నిబంధనలోని రాజులు లోకము మీద పాపము యొక్క ప్రభావమును తిరిగితెచ్చుటకు, రాజుల ద్వారా, ముఖ్యముగా దావీదు రాజుల ద్వారా వచ్చు పునరుద్ధరణ కొరకు మార్గమును సిద్ధము చేశారు. దీని కంటే ఎక్కువగా, ఈ పాత్రలను తీసుకున్న ప్రభువైన యేసు క్రీస్తు యొక్క రాకడ ద్వారా దావీదు యొక్క పాత్ర నెరవేర్చబడింది, ఇశ్రాయేలు యొక్క పాత్ర నెరవేర్చబడింది, ఆదాము యొక్క పాత్ర నెరవేర్చబడింది, మరియు మనము సృజించబడిన వాస్తవిక ఉద్దేశములలోనికి పునరుద్ధరించబడితిమి, మరియు ఇదంతా ఎదురుచూపులో ఉండినది. ఇదంతా వివృతమగు దేవుని ప్రణాళికల కొరకు మనలను సిద్ధపరిచింది మరియు మనలను "ఇది జరగబోతుంది. ఈయన రాబోవుచున్నాడు. రాజు ఈ విధముగా ఆ పాత్రలను నెరవేర్చుతాడు" అను మెస్సీయ ఆపేక్ష వైపుకు నడిపించింది. ఇందుమూలముగానే రాజులు లేకమునుపే మోషే దీనిని గూర్చి మాట్లాడుతున్నాడని నా ఆలోచన.
>
> — డా. స్టీఫెన్ వెల్లమ్

ఇశ్రాయేలు దేశమును వాగ్దాన భూమిలోనికి ప్రవేశించి స్వాధీనపరచుకొనుటకు మోషే సిద్ధపరచుచుండగా, దేవుడు తుదకు వారి మీద ఒక రాజును నియమిస్తాడని అతడు వివరించాడు. దేవుడు నియమించిన రాజును నడిపించవలసిన నాలుగు నియమాలను మోషే తెలియపరచాడు. ద్వితీ. 17:14-20లో మోషే వ్రాసిన మాటలను వినండి:

> నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమున నీవు ప్రవేశించి దాని స్వాధీనపరచుకొని అందులో నివసించి ... నీ దేవుడైన యెహోవా ఏర్పరచువానిని అవశ్యముగా నీమీద రాజుగా నియమించుకొనవలెను. నీ సహోదరులలోనే ఒకని నీమీద రాజుగా నియమించుకొనవలెను ... అతడు గుఱ్ఱములను విస్తారముగా సంపాదించుకొనవలదు; తాను గుఱ్ఱములను హెచ్చుగా సంపాదించుటకుగాను జనులను ఐగుప్తునకు తిరిగి వెళ్లనియ్యకూడదు ... ... అతడు అనేక స్త్రీలను వివాహము చేసికొనకూడదు ... వెండి బంగారములను అతడు తనకొరకు బహుగా విస్తరింపజేసికొనకూడదు. మరియు అతడు... ధర్మశాస్త్రమునకు ఒక ప్రతిని తనకొరకు వ్రాసికొనవలెను... తన దేవుడైన యెహోవాకు భయపడి యీ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిని యీ కట్టడలను అనుసరించి నడువ నేర్చుకొనుటకు అతడు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

**తాను బ్రదుకు దినములన్నిటను ఆ గ్రంథమును చదువుచుండవలెను (ద్వితీ. 17:14-20).**

రాజత్వమునకు అర్హతలుగా మోషే నాలుగు నియమాలను సూచించాడు. మొదటిగా, ఇశ్రాయేలు యొక్క రాజు దేవుని ద్వారా నియమించబడాలి. దేవుడు కోరిన మార్గములలో వారిని నడిపించుటకు ప్రజలు రాజును నియమించుకొనుటకు అర్హులు కారు. మరియు దేవుడు ఇచ్చు అధికారమును ఒక వ్యక్తికి ఇచ్చు హక్కు వారికి లేదు. కేవలం దేవుడు మాత్రమే తన అధికారమును ఇయ్యగలడు. మరియు తనకు నచ్చిన వ్యక్తికే దేవుడు దానిని ఇస్తాడు.

ద్వితీ. 17లో మోషే ప్రస్తావించిన రెండవ విషయము ఏమనగా, రాజు ఇశ్రాయేలీయుడైయుండవలెను. అనగా, అతడు దేవుడు ఎన్నుకొన్న దేశము యొక్క పౌరుడైయుండవలెను. ఇది ఆది. 17:1-8లో దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనా వాగ్దానమును నెరవేర్చుటకు ఇలా జరగవలసియుండినది, అక్కడ అబ్రాహాము వారసులు తమ ప్రజలకు రాజులుగా ఉంటారని ఆయన ప్రమాణం చేశాడు.

ద్వితీ. 17లో ఇవ్వబడిన మూడవ అర్హత ఏమనగా, దేశములో సమాధానమును ఐశ్వర్యమును కలిగించుటకు రాజు మానవ ప్రణాళికల కంటే ఎక్కువగా దేవుని మీద ఆధారపడాలి. దేవుని మీద ఆధారపడుట నుండి రాజులు దారి మళ్లుటకు మోషే నాలుగు మార్గములను సూచించాడు.

- తన సైన్యమునకు ప్రాముఖ్యమైనవి కాబట్టి రాజు ఎక్కువ సంఖ్యలో గుఱ్ఱములను కూడబెట్టుకొనుట నిషేధించబడినది. దేశమును భద్రపరచుటకు రాజు దేవుని యొక్క శక్తి మీద ఆధారపడియుండాలిగాని మానవ సామర్థ్యము మీద కాదు.
- ఐగుప్తుకు తిరిగి వెళ్లుట భద్రత మరియు అవసరతల కొరకు దేవుని ఆధీనములో ఉండకుండా, ఏదైనా పెద్ద రాజ్యము మీద ఆధారపడుటను సూచిస్తుంది.
- ఎక్కువ భార్యలపై నిషేధము రాజకీయ కూటముల కొరకు వివాహములను చేసుకొనుటకు సంబంధించినది కావచ్చు. ఇది ఇశ్రాయేలును దేవుని మీద గాక అన్య దేశముల మీద ఆధారపడునట్లు చేస్తుంది కాబట్టే సమస్య కాదుగాని, అన్య దేశ భార్యలు అన్య దేవతలను ఆరాధిస్తారు, మరియు రాజును కూడా ఆలా చేయునట్లు శోధిస్తారు కాబట్టి.
- వెండి బంగారములను అధికముగా సంపాదించుటకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞ అన్యాయముగా విధించు పన్నును సూచిస్తుంది. రాజు ధనవంతుడైయుండుట తప్పు కాదు. కాని దేవుని ప్రజలను అణగద్రొక్కి ధనవంతులగుట నేరము.

మొత్తం మీద, తన పరిపాలన విజయవంతమగుటకు మరియు దేశము యొక్క భద్రత కొరకు రాజు దేవుని మీద ఆధారపడునట్లు ఈ పరిమితులు సహాయం చేశాయి.

ద్వితీ. 17లో మోషే ఉద్ఘాటించిన నాల్గవ విషయం ఏమనగా, దేవుని నిబంధనా ధర్మశాస్త్రమును పొందుకొనుట, తిరిగి వ్రాయుట మరియు ధ్యానించుట ద్వారా రాజు దేవుని పట్ల నిబంధనా నమ్మకత్వము చూపవలసియుండినది. వ్యక్తిగత గౌరవము, తగిన నమ్రత మరియు నమ్మకమైన పరిపాలనను పెంపొందించుటకు ఈ కార్యములు రూపొందించబడినవి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> ఇశ్రాయేలు రాజులు మరియు యూదా రాజులు దేవుని ప్రజలకు ప్రతినిధులైయుండిరి, కాబట్టి భూమి మీద దేవుని ప్రతినిధులుగా మరియు దేవుని ప్రజల యొక్క ప్రతినిధులుగా అనేక విధాలుగా వారు సంస్కార సంబంధమైన సన్నిధిని కలిగియుండిరి. కాబట్టి, వారు కలిగియుండిన ఆ మార్పుచెందు స్థితి దేవుడు రాజుకు స్పందించిన విధానమునకు మరియు తుదకు అది దేశం అంతటి మీద చూపిన ప్రభావమునకు ప్రాముఖ్యమైనది. ఇశ్రాయేలు మరియు యూదాలో కూడా ఈ చరిత్ర అంతా జరిగింది అని నా ఆలోచన. ఇశ్రాయేలులో మంచి రాజులు లేరు. అందరు చెడ్డవారే. తరువాత, వారు క్రీ.పూ. 722లో మొదట పతనమైయ్యారు. కాని యూదాలోనే, ఈ విధమైన ఊగిసలాట కొనసాగింది, మంచి రాజు ఉన్నప్పుడు, అతడు దేవుని దృష్టిలో మంచి పని చేశాడు, తరువాత దుష్ట రాజు వచ్చి దేవుని దృష్టిలో దుష్టత్వమును చేశాడు. అయితే దుష్ట రాజులు దేవుని దృష్టిలో దుష్టత్వమును చేసినప్పుడు, దాని వలన తీవ్ర పరిణామాలు ఎదురయ్యాయి. ఈ సమయములోనే రాజు కొరకు మరియు ఆయన ప్రజల కొరకు దేవుని న్యాయములోని దైవికమైన "విసర్జన" వినిపించింది. మరియు దీని ప్రకారం రాజు యొక్క స్థితి మరియు ప్రజలు దానిని అనుసరించిన విధానము మధ్య కర్బన సంబంధమైన అనుబంధం ఉన్నట్లు అనిపిస్తుంది. రాజు ఉన్నత స్థలములను స్థాపించి అన్య దేవతలను ఆరాధిస్తే, ప్రజలు కూడా అలానే చేశారు. అదే విధముగా, పునరుద్ధరణలు జరిగినప్పుడు, యోషీయా కాలములో మనము చూసినట్లు, ప్రజలు దేవునికి మరియు ధర్మశాస్త్రమునకు స్పందించిన విధానములో అది బలమైన జాతీయ ప్రభావమును చూపింది. కాబట్టి, దేవునికి మరియు ప్రజలకు ప్రాతినిధ్యం వహించుటలో రాజు ముఖ్యమైన పాత్రను పోషించాడు.
>
> — డా. మార్క్ గిగ్నిల్లియట్

రాజత్వము కొరకు మోషే బయలుపరచిన అర్హతలను చూశాము కాబట్టి, దావీదుతో చేసిన నిబంధనలో దేవుడు స్థాపించిన అదనపు అర్హతను చూచుటకు సిద్ధముగా ఉన్నాము.

## దావీదుతో చేయబడిన నిబంధన

దేవుడు 2 సమూ. 7:8-16లో దావీదుతో నిబంధనను స్థాపించాడు, మరియు దాని యొక్క షరతులు 89 మరియు 132 కీర్తనలు వంటి చోట్ల ప్రస్తావించబడినవి. ఈ నిబంధన దావీదు సంతతివారిని ఇశ్రాయేలు యొక్క నిత్య రాజవంశముగా చేస్తుంది. దావీదు సంతతి వారు పరిపాలన చేస్తారని, మరియు ఇశ్రాయేలు రాజవంశము యొక్క స్థిరత్వమును అనుభవిస్తుంది అని వాగ్దానము చేసి, దేవుడు దావీదు పట్ల మరియు ఇశ్రాయేలు పట్ల గొప్ప దయను కనుపరచాడు. 2 సమూ. 7:8-16లో దేవుడు దావీదుతో చేసిన నిబంధనా వాగ్దానములను వినండి:

> … గొఱ్ఱల కాపులోనున్న నిన్ను గొఱ్ఱలదొడ్డిలోనుండి తీసి ఇశ్రాయేలీయులను నా జనులమీద అధిపతిగా నియమించితిని… లోకములోని ఘనులైన వారికి కలుగు పేరు నీకు కలుగజేసియున్నాను… ఇశ్రాయేలీయులను నా జనులు ఇకను కదిలింపబడకుండ తమ స్వస్థలమందు నివసించునట్లు దానియందు వారిని నాటి… నీ శత్రువుల మీద నీకు జయమిచ్చి నీకు నెమ్మది కలుగజేసియున్నాను… నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను… నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును (2 సమూ. 7:8-16).

ఈ దైవిక నిబంధన ప్రకారం, ఇశ్రాయేలులోని రాజుల కొరకు దేవుడు ఒక క్రొత్త అర్హతను జోడించాడు. ఈ కాలము మొదలుకొని, దేవుని ప్రజలు దావీదు కుమారుని ద్వారా నడిపింపబడవలసియుండినది. కేవలం అతని గృహము మాత్రమే దేశమంతటిని అధికారికముగా పాలించవలెను.

ఆదికాండములోనే, ఇశ్రాయేలు యొక్క రాజులుగా దేవుడు యూదా గోత్రమును ఆశీర్వదించాడు. "యూదా కాళ్ల మధ్య నుండి రాజదండము తొలగదు" అని ఆదికాండము 49లో యాకోబు సెలవిచ్చాడు. దావీదు యూదా గోత్రమునకు చెందినవాడు కాబట్టి, దావీదుతో దేవుడు చేసిన వాగ్దానము ఆదికాండములోని ఈ ఆశీర్వాదమునకు నెరవేర్పుగా ఉన్నది. ఇశ్రాయేలుకు ఒక దినమున యూదా గోత్రపు రాజు ఉంటాడు అని దేవుడు ఎల్లప్పుడు యోచించాడు. దేవుని పట్ల దావీదు చూపిన విధేయత మరియు భక్తి కారణంగా, ఇశ్రాయేలు యొక్క రాజ వంశము దావీదు వంశమునకు మాత్రమే చెందుతుంది అని ఆయన వాగ్దానము చేశాడు. దావీదు కుటుంబమునకు చెందని ఏ ఒక్కడు కూడా అధికారికముగా ఇశ్రాయేలు యొక్క రాజుగా ప్రకటించుకొనలేడు. ఇందును బట్టియే యేసు దేవుని ద్వారా పిలువబడుట మాత్రమే కాదుగాని, ఆయన దావీదు సింహాసనమునకు అధికారిక వారసత్వము కలిగిన దావీదు వంశము నుండి జన్మించినవాడని సువార్త రచయితలు రుజువు చేయుట చాలా ప్రాముఖ్యమైపోయింది.

రాజత్వమునకు కావలసిన అర్హతలను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి ఇప్పుడు మన రెండవ అంశమును చూద్దాము, పాత నిబంధనలో రాజుల యొక్క కార్యములు.

## కార్యములు

పాత నిబంధనలో, దేవుని ధర్మశాస్త్రమును ఉపయోగించుట ద్వారా మరియు అమలుపరచుట ద్వారా ఇశ్రాయేలు రాజులు దేవుని ప్రజల మీద నమ్మకమైన పరిపాలనను చేశారు. ఇంతకు ముందు పాఠములలో మనము చూసినట్లు, పురాతన పశ్చిమ ఆసియాలోని బలమైన చక్రవర్తులు లేక ప్రభువులు బలహీనమైన రాజ్యములను జయించి అదుపులోకి తీసుకొని, వారిని బానిసలుగా లేక సామంతులుగా చేసుకొనుట చాలా సహజముగా జరిగేది. ఈ ప్రభువులు సాధారణంగా ఒప్పందములు లేక నిబంధనల ద్వారా ఈ అనుబంధములను నియంత్రించేవారు, మరియు సామంత రాజ్యములు నియమములను పాటించుట ద్వారా జయించిన ప్రభువులను సేవించవలసి వచ్చేది. దేవునితో ఇశ్రాయేలు యొక్క

అనుబంధము విషయములో కూడా ఇదే వాస్తవమైయున్నది. దేవుని నిబంధనను పాటించవలసిన బాధ్యత దేశమంతటి మీద ఉండేది, మరియు వారు పాటించునట్లు చూసే బాధ్యత రాజుకు ఉండేది.

రాజులు తమ ప్రజలను అనేక విధాలుగా దేవుని నిబంధనా నియమాలకు బాధ్యులుగా ఎంచేవారు. కాని ఈ పాఠంలో మన ఉద్దేశముల కొరకు, ధర్మశాస్త్రములోని ప్రధానమైన విషయములని యేసు పిలచినవాటి మీద మనము దృష్టిపెడదాము. **మత్తయి 23:23**లో యేసు ఇలా సెలవిచ్చాడు:

> ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములను, అనగా న్యాయమును, కనికరమును, విశ్వాసమును … (మత్తయి 23:23).

యేసు మాటల ప్రకారం, ఆచారములు మరియు పరంపరల మీద దృష్టి పెట్టిన పరిసయ్యుల ఆలోచనలకు భిన్నముగా, ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములు న్యాయము, కనికరము మరియు విశ్వాసము లేక నమ్మకత్వము.

ఈ అత్యంత ముఖ్యమైన గుణములకు అనుగుణంగా పాత నిబంధన రాజులు దేవుని ధర్మశాస్త్రమును ఏ విధంగా ఉపయోగించారో మరియు ఆచరణలో పెట్టారో చూద్దాము. మొదటిగా, న్యాయమును జరిగించుటకు రాజుకు ఇవ్వబడిన బాధ్యతను చూద్దాము. రెండవదిగా, రాజు కనికరమును చూపాలని చూద్దాము. మరియు మూడవదిగా, రాజు నమ్మకత్వమును కలిగియుండాలి అను సత్యము మీద దృష్టిపెడదాము. న్యాయమును జరిగించు రాజు బాధ్యతను మొదటిగా చూద్దాము.

## న్యాయము

రాజు యొక్క బాధ్యతల సందర్భములో, న్యాయమును దేవుని ధర్మశాస్త్రానుసారముగా ఒకని యోగ్యత చొప్పున అతనికి న్యాయము తీర్చుట అని నిర్వచించవచ్చు.

> వ్యక్తులుగా లేక పరిపాలకులుగా, ఒక భద్రమైన మార్గమును లేక పాపభరితమైన మార్గమును ఎన్నుకునే హక్కు, స్వతంత్రత మనకు ఉంది. కడవరి దినమున దేవుని తీర్పు మనందరి మీదికి వస్తుంది. ఫలితముగా ఆ నాయకులకు కూడా తీర్పు తీర్చబడుతుంది. యేసు వచ్చినప్పుడు ఆయన సమస్త విషయములను వాటి స్థానములో పెడతాడు. అప్పటి వరకు మనము చేయవలసిన పని ఒకటి ఉంది. అదేమనగా దేవుని రాజ్యమునకు చెందిన వ్యక్తులుగా, మరియు పరలోక భూలోక పౌరులుగా జీవించుట. కొంత కాలం వరకు, మనము న్యాయమును ఐక్యతను అభ్యసిస్తాము, ఇతరులను గౌరవిస్తాము, బలహీనులను గౌరవిస్తాము, అన్యాయము చేయువారితో జాగ్రత్తగా వ్యవహరిస్తాము, మరియు పాప లోకములో, విరిగిన లోకములో, దేవుని ఉగ్రతలో ఉన్న లోకములో, భ్రష్టత్వము, క్రూరత్వము, అవివేకము, పేదరికము ఉన్న లోకములో మనము జీవిస్తున్నాము అని ఎరిగి కూడా న్యాయమును సాధించుటకు శ్రమపడతాము. మనము వెలుగునిచ్చు కొవ్వొత్తుల వలె ఉండి, పరలోకములో ప్రేమించు దేవుడు ఉన్నాడని, ఆయన అన్యాయమును చూస్తున్నాడని మరియు ఈ క్రూరత్వము, భ్రష్టత్వము, మరియు అహంకారము, భూమి మీద ఎంత కాలము నుండి ఉన్నా, అది



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తాత్కాలికమైనదని, మరియు ముగింపులో సమస్తమును సరిచేయు దేవుడు ఉన్నాడు కాబట్టి అది పరిమితమైనదని ఇతరులకు జ్ఞాపకము చేయుచున్నాము.

— డా. జోనాథన్ కుట్టబ్, అనువాదము

ఇశ్రాయేలు రాజులు దేవుని న్యాయమును కనీసం రెండు స్థాయిలలో కనుపరచవలసియుండెను. మొదటిగా, వారు దేవుని అంతర్జాతీయ న్యాయమును కనుపరచారు, మరియు ఇశ్రాయేలు, ఇతర దేశముల మధ్య దేవుని ధర్మశాస్త్రమును అమలుచేశారు.

అంతర్జాతీయ స్థాయిలో రాజులు న్యాయమును అమలుచేసిన ఒక మార్గము ఏమనగా, 1 రాజులు 5:1-12లో తూరు దేశపు రాజైన హీరాముతో సొలొమోను చేసినట్లు, ఇతర దేశములతో శాంతియుతమైన మంతనాలు చేయుట.

యుద్ధము ద్వారా కూడా రాజు అంతర్జాతీయ న్యాయమును అమలు చేశాడు. 1 సమ. 14:47-48లో సౌలు చేసినట్లు, మరియు 2 సమూ. 8:1-13లో దావీదు చేసినట్లు దుష్ట దేశములను శిక్షించుట ద్వారా వారు దీనిని చేశారు. 2 సమూ. 5:17-25లో దావీదు వలె, మరియు 2 రాజులు 19లో హిజ్కియా వలె ఇశ్రాయేలు మీద దాడి జరిగినప్పుడు రాజు దానిని కాపాడాడు. వారికి మరియు దేవునికి విరోధముగా లేచిన దేశములకు ఇశ్రాయేలు రాజులు చేయవలసిన న్యాయమును 2వ కీర్తన క్రోడీకరిస్తుంది. 6-12 వచనాలలో అది ఏమి చెబుతుందో వినండి:

> [యెహోవా నాతో సెలవిచ్చెను,] "నేను నా పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద నా రాజును ఆసీనునిగా చేసియున్నాను"... యెహోవా నాకీలాగు సెలవిచ్చెను నీవు నా కుమారుడవు నేడు నిన్ను కనియున్నాను. నన్ను అడుగుము, జనములను నీకు స్వాస్థ్యముగాను భూమిని దిగంతములవరకు సొత్తుగాను ఇచ్చెదను. ఇనుపదండముతో నీవు వారిని నలుగగొట్టెదవు కుండను పగులగొట్టినట్టు వారిని ముక్క చెక్కలుగా పగులగొట్టెదవు. కాబట్టి రాజులారా, వివేకులై యుండుడి భూపతులారా, బోధనొందుడి. భయభక్తులు కలిగి యెహోవాను సేవించుడి గడగడ వణకుచు సంతోషించుడి. ఆయన కోపము త్వరగా రగులుకొనును కుమారుని ముద్దుపెట్టుకొనుడి; లేనియెడల ఆయన కోపించును అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు. ఆయనను ఆశ్రయించువారందరు ధన్యులు (కీర్తనలు 2:6-12).

ఈ వచనములు, ప్రభువును తండ్రి అని పిలచు మరియు సామంత రాజును కుమారుడు అని పిలచు పురాతన పశ్చిమ ఆసియా పద్ధతిని అనుసరిస్తాయి. ఈ సందర్భములో, దేవుడు ప్రభువైయున్నాడు మరియు దావీదు వంశపు రాజు కుమారుడైయున్నాడు. దేశములు దావీదు వంశపు రాజును సేవించి విధేయులు కావాలని లోకము కొరకు దేవుని ప్రణాళికయైయున్నది. ఆయన లోకములో దేవుని న్యాయమునకు సాధనముగా ఉన్నాడు కాబట్టి వారు ఆయనకు భయపడాలి మరియు గౌరవించాలి.

రెండవ స్థానములో, జాతీయ స్థాయిలో, అనగా ఇశ్రాయేలు లోపల దేవుని న్యాయమును అమలు చేయు బాధ్యత కూడా రాజులకు ఇయ్యబడింది. దేవుని యొక్క విశేషమైన ప్రజలను ధర్మశాస్త్రమునకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విధేయులగునట్లు నడిపించుట ద్వారా రాజులు జాతీయ న్యాయమును అమలు చేశారు. దీనిలో మనము కీర్తనలు 29:14లో చూచునట్లు, బలహీనుల శ్రేయస్సు కొరకు సహాయం చేయుట; 2 సమూ. 4:9-12లో దావీదు వలె, దుష్టుల నుండి సంరక్షించుట; 2 రాజులు 14:5లో వలె, నేరస్తులకు శిక్ష విధించుట; కీర్తనలు 72 బోధిస్తున్నట్లు పౌరుల యొక్క ఎదుగుదల మరియు ఐశ్వర్యము కొరకు స్థిరత్వమును స్థాపించుట ఉన్నాయి. అంతేగాక, ధనిక దరిద్రులకు, బలవంతులు లేక బలహీనులకు పక్షపాతము చూపుటకు రాజులు న్యాయమును తారుమారు చేయకూడదు. రాజులకు ఇవ్వబడిన ఈ పాత్రను గూర్చి లేఖనము లేవీ. 19:15 మరియు యెషయా 11:1-5 వంటి అనేక చోట్ల మాట్లాడుతుంది.

యేసు గుర్తించిన ధర్మశాస్త్రములోని ప్రధానమైన విషయములలో నుండి, రాజులు దేవుని ధర్మశాస్త్రమును అనువర్తించవలసిన రెండవ మార్గము కనికరము.

### కనికరము

కనికరము అనగా తాను సృజించినవాటి మీద దేవుడు కలిగియున్న దయను అనుకరించుట. తాను సృజించిన సృష్టములు పాపము చేసినప్పుడు, దేవుడు వారి బలహీనతను అర్థము చేసుకొని వారి పట్ల దీర్ఘశాంతమును చూపుతాడు. తాను సృజించినవారి పట్ల దయను చూపుట ఆయనకు ఇష్టము కాబట్టి ఆయన వారికి జీవితములో మంచి యీవులను ఇచ్చి బాధ నుండి ఉపశమనమును కలిగిస్తాడు. లేఖనము దేవుని కనికరమును గూర్చి అనేక చోట్ల మాట్లాడుతుంది, ఉదాహరణకు కీర్తనలు ***40:11;*** కీర్తనలు ***103:8;*** మరియు యోనా ***4:2.***

న్యాయము వలెనె, రాజులు కనీసం రెండు స్థాయిలలో కనికరమును చూపవలసియుండెను అని చూద్దాము, అంతర్జాతీయ అనుబంధములతో ఆరంభిద్దాము. అంతర్జాతీయ స్థాయిలో, రాజులు ఇశ్రాయేలు దేవునికి సమర్పించుకున్న దేశములు మరియు ప్రజలకు కనికరమును చూపారు. ఉదాహరణకు, 2 సమూ. 10:19లో, ఇశ్రాయేలు విరోధులలో ఒకని అనేక సామంత రాజులు దావీదుతో సమాధాన పడినప్పుడు వారు దావీదు కనికరమును పొందుకున్నారు. మరియు 2 సమూ. 10:1-2లో, అమ్మోనీయుల రాజు పట్ల దావీదు కనికరమును చూపాడు.

అంతేగాక, అన్య దేశములు తుదకు యెరూషలేమునకు అప్పగించుకుంటాయని పాత నిబంధన ప్రవక్తలు ప్రవచించారు. వారు దేవుని రాజ్యము యొక్క రాజధానికి బహుమతులను తెస్తారు, మరియు దేవుని రాజు నుండి కనికరమును భద్రతను పొందుకుంటారు. ఈ విషయములు యెషయా 60:1-22 మరియు 66:18-23, మీకా 4:1-8, మరియు జెఫన్యా 2:11 వంటి చోట్ల ప్రవచించబడ్డాయి.

అవును, న్యాయమును గూర్చి మన సంభాషణలో చూసినట్లే, దేవుడు ఎల్లప్పుడూ కనికరమును చూపాలని కోరడు. మరియు కొన్నిసార్లు రాజు దుష్ట దేశములకు కనికరము చూపకూడదని ఆయన ఆజ్ఞాపించాడు. ఉదాహరణకు, 2 సమూ. 5:17-25లో, ఫిలిష్తీయులను నాశనము చేయమని దేవుడు దావీదుకు హెచ్చరించాడు, మరియు దావీదు కనికరము చూపక వారిని హతమార్చాడు. వారి దుష్టత్వము బహు గొప్పదైనది కాబట్టి వారిని విడిచిపెట్టకూడదు. కాబట్టి, దేవుడు కనికరమును ఎప్పుడు చూపమంటాడో, మరియు దేవుడు కనికరమును ఎప్పుడు చూపమనడో వివేచించుట రాజు యొక్క బాధ్యతయైయుండినది.

అంతర్జాతీయ అనుబంధాలలో కనికరమును చూపుటతో పాటుగా, జాతీయ స్థాయిలో కూడా కనికరమును చూపుతు దేవుని ధర్మశాస్త్రమును అమలు చేయు బాధ్యత రాజుకు ఇవ్వబడింది. రాజు దేవుని యొక్క సామంత రాజు కాబట్టి, దేవుడు వారితో వ్యవహరించు విధముగానే అతడు దేవుని ప్రజలతో వ్యవహరించవలసియుండెను. అనగా వారికి కనికరమును చూపుట. హోషేయా 6:6 వంటి చోట్ల మనము చదవునట్లు, ధర్మశాస్త్రములో నిర్ధారించబడిన బలులను అర్పించుట కంటే ఎక్కువగా దేవుడు తన ప్రజల నుండి కనికరమును చూపుటను కోరాడు. అంటే దేవుని ధర్మశాస్త్రము ప్రాముఖ్యమైనది కాదని కాదు, కాని ధర్మశాస్త్రములో కనికరము అత్యంత ప్రధానమైన విషయములలో ఒకటైయున్నది. ఈ కారణము చేత, కనికరముగల రాజు దేవుని సొంత సంరక్షణ పద్ధతిని అనుసరించు ఆదర్శవంతమైన నాయకుడైయున్నాడు. 2 సమూ. 19:18-23 వంటి చోట్ల దావీదు దీనిని ఉదాహరించాడు, మరియు తనకు సమర్పించుకున్న విరోధులకు కనికరమును చూపాడు.

> కనికరము పాత నిబంధన ధర్మశాస్త్రమంతటిలో ఉన్నది. ధర్మశాస్త్రము చెడ్డది అనే మన పక్షపాతమును ప్రక్కన పెట్టి, దేవుని కరుణకు వాహనముగా ధర్మశాస్త్రమును మనము చదివినట్లయితే, దానిని మనము అన్ని చోట్ల చూచుట ఆరంభిస్తాము. మనము పది ఆజ్ఞలను ఆరంభ బిందువుగా చూచుట ఆరంభించినా, విశ్రాంతి దినమును ఆచరించమని చెప్పే నాల్గవ ఆజ్ఞను మీరు చూడవచ్చు. ప్రభువు దినమందు లేక విశ్రాంతి దినమున మనము విశ్రాంతిని తీసుకొనుట మాత్రమే కాదుగాని, మన ఇంటిలోని దాసులు, పశువులు, మరియు మన ఆధీనములో ఉన్న సమస్తమునకు విశ్రాంతి ఇవ్వాలని ఆజ్ఞ యొక్క మొదటి భాగమును దాటి చదివినప్పుడు చూడగలుగుతాము. మన ఆధునిక లోకములో, వ్యాపారము కలిగియున్న దేవుని-భయంగల స్త్రీ లేక పురుషుడు అతని లేక ఆమె యొద్ద పని చేయువారి పట్ల కనికరమును చూపాలి, మరియు వారితో కొల్లగొట్టవలసిన నిధులుగా వ్యవహరించక, వారిని ప్రజల వలె చూడాలి. దేవుడు మన ఆధీనములో ఉంచిన ప్రజలను కాయువారిగా ఉండాలి. కాబట్టి ఇక్కడ ఒక కనికరముతో కూడిన మార్గము ఉంది. కనికరము చూపు పాత నిబంధనలోని వ్యక్తిగతమైన వివరింపబడిన నియమములు చాలా ఉన్నాయి. పొలములో పరిగెను విడిచిపెట్టమని ద్వితీయోపదేశకాండములో ఇవ్వబడిన ఆజ్ఞ, అవసరతలో ఉన్నవారు దానిని తీసుకొని తినుటకు, విడిచిపెట్టబడిన దానిని వారు ఎత్తుకొనుటకు ఇవ్వబడింది. తోటి పౌరుని యొద్ద వడ్డీ తీసుకొనరాదు అనునటువంటి ఇతర పాత నిబంధన నియమాలు ఉన్నాయి. ఆ లోకములో పెట్టుబడిదారులు లాభం కొరకు వెచ్చించు ఆర్థిక వ్యవస్థ ఉండక, వడ్డీ వసూలు చేయుట చాలాసార్లు ప్రజలను హింసించుట మరియు దోచుకొనుటగా భావించబడేది. అది దాతృత్వమునకు ప్రత్యామ్నాయము అవుతుంది. అవసరతలో ఉన్న ఒక తోటి ఇశ్రాయేలీయుని నుండి ఒకడు లాభము సంపాదించాలని చూస్తే, అతడు ధనవంతుడవుతాడుగాని, ఇతరులను బీదలను చేస్తాడు. కాబట్టి అలా చేయవద్దని ఆజ్ఞ చెబుతుంది. బదులుగా, వడ్డీ అడగకుండా దాతృత్వమును



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> చూపుము, మరియు అవసరతలో ఉన్నవారికి అప్పు ఇమ్ము. ఏడు సంవత్సరములకు ఒకసారి బానిసలను విడిచిపెట్టు నియమము లేక హిత వత్సరమున కొన్ని అనివార్య కారణముల వలన భూమిని కోల్పోయిన ప్రజలకు తిరిగి ఇచ్చు నియమము, ఇవి పునరుద్ధరణ నియమములైయున్నవి. దేవుడు తన ప్రజల పట్ల కనికరమును చూపాడు, తన సొంత స్వభావమును ప్రతిబింబించమని పాత నిబంధన నియమాలలో ఆయన వారిని ఆజ్ఞాపించాడు.
>
> — రెవ. మైఖేల్ గ్లోడో

న్యాయము మరియు కనికరముతో పాటుగా, రాజు దేవుని ధర్మశాస్త్రమును అమలుచేయవలసిన మూడవ మార్గము దేవునికి నమ్మకత్వమును చూపుట.

## నమ్మకత్వము

నమ్మకత్వమును హృదయపూర్వకమైన నమ్మకము మరియు విధేయతతో దేవుని పట్ల చూపు స్వామిభక్తి అని నిర్వచించవచ్చు. నమ్మకత్వములో దేవుడు తనను గూర్చి ఏమి చెబుతున్నాడో అది అయ్యున్నాడని నమ్మి, ఇతర దేవతలను గాక ఆయనను మాత్రమే స్వామిభక్తితో సేవిస్తూ, ఆయనకు ప్రేమగల విధేయతను చూపుట ఇమిడియున్నాయి.

న్యాయము మరియు కనికరము విషయములో మనము చూసినట్లు, నమ్మకత్వమును అమలుచేయుటకు రాజు బాధ్యుడైయున్న రెండు మార్గములను చూద్దాము, అంతర్జాతీయ స్థాయితో ఆరంభిద్దాము. ఇశ్రాయేలు రాజులు దేవుని ప్రజలను దేవుని పట్ల నమ్మకత్వములోనికి ఏ విధంగా నడిపించాలంటే, వారిని చూసి చుట్టు ప్రక్కన ఉన్న దేశములు తమ విగ్రహారాధన మరియు పాపము నుండి మారుమనస్సుపొంది దేవుని సేవించుట ఆరంభించాలి. ఇశ్రాయేలు దేశములో నమ్మకమైన ఆరాధనను స్థాపించుట ద్వారా రాజులు ముఖ్యముగా ఈ పాత్రను పోషించగలరు, దీనిని మనము 1 రాజులు 8:41-43లో దేవాలయమును ప్రతిష్టించినప్పుడు సొలొమోను చేసిన ప్రార్థనలో చూడవచ్చు. దేశములను క్రమశిక్షణలో ఉంచి శిష్యులను చేయమనే సార్వత్రిక ఆజ్ఞ కీర్తనలు 72:8-11 మరియు జెకర్యా 8:20-23 వంటి లేఖన భాగములలో సూచించబడినది.

అంతర్జాతీయముగా దేవుని పట్ల నమ్మకత్వమును అమలు చేయుటతో పాటుగా, రాజు జాతీయ స్థాయిలో కూడా నమ్మకత్వమును ప్రోత్సహించాలి. ఆరాధనలో పవిత్రత కొరకు పాటుపడుట ద్వారా మరియు దానిని సమకూర్చుట ద్వారా ఇశ్రాయేలు దేశములో రాజు నమ్మకత్వమును పెంపొందించాలి. మంచి రాజులు ఆరాధన కొరకు నిధులను ప్రణాళికలను సమకూర్చారు, సిబ్బందిని నియమించారు, దేవాలయమును నిర్వహించుటకు పథకాలను శాసించారు, మరియు చాలాసార్లు బహిరంగ ఆరాధనలలో ప్రాముఖ్యమైన పాత్రలను పోషించారు. ఉదాహరణకు, 1 దిన. 15, 16, మరియు 23-28లో దావీదు వీటిని చేశాడు.

ఇశ్రాయేలు యొక్క నమ్మకత్వమును పెంపొందించుటలో రాజు చూపిన సమర్పణ దేశము మీద అనేక విధాలుగా ప్రభావము చూపింది. ఆయన దేవుని ఎదుట దేశము యొక్క ప్రతినిధి కాబట్టి, నమ్మకమైన రాజుల ఆధీనములో ప్రజలు చాలా సార్లు బహుగా దీవించబడ్డారు, మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అపనమ్మకస్తులైన రాజుల ఆధీనములో బహుగా శిక్షించబడ్డారు. దేవుడు నమ్మకమైన రాజులను ఇశ్రాయేలులో ఐశ్వర్యమునిచ్చి దీవించాడు మరియు ఇశ్రాయేలు యొక్క సరిహద్దులను విశాలపరచాడు. అపనమ్మకస్తులైన రాజులు శిక్షింపబడ్డారు. వాస్తవానికి, యూదా దేశము చెరగొనిపోబడుటకు నెపమును రాజుల గ్రంథము కొంత వరకు ఇశ్రాయేలు రాజుల యొక్క అవిధేయత మీద పెడుతుంది.

1 రాజులు 9:6-7లో సొలొమోను రాజుకు దేవుడు సెలవిచ్చిన మాటలను వినండి:

> **అయితే మీరేగాని మీ కుమారులే గాని యేమాత్రమైనను నన్ను వెంబడించుట మాని, నేనిచ్చిన ఆజ్ఞలను కట్టడలను అనుసరింపక యితరమైన దేవతలను కొలిచి పూజించినయెడల నేను ఇశ్రాయేలీయుల కిచ్చిన యీ దేశములో వారిని ఉండనియ్యక వారిని నిర్మూలము చేసి, నా నామమునకు నేను పరిశుద్ధపరచిన యీ మందిరమును నా సముఖములోనుండి కొట్టివేసెదను; ఇశ్రాయేలీయులు సర్వజనములలో చెదరిపోయి సామెతగాను హేళనగాను చేయబడుదురు (1 రాజులు 9:6-7).**

దుఃఖకరముగా, ఇశ్రాయేలు మరియు యూదా రాజులందరు దేవునికి నమ్మకస్తులుగా ఉండలేదు, కాబట్టి ప్రజలు శ్రమను అనుభవించారు. దేవాలయము నిర్లక్ష్యము చేయబడి ప్రజలు విగ్రహారాధన చేసినప్పుడు కూడా, నమ్మకమైన రాజులు దేశములోని ఆరాధనను సరిచేసి పునరుద్ధరించగలిగారు. దీనిని మనము 2 రాజులు 18:1-8లో హిజ్కియా విషయములో, మరియు 2 రాజులు 22:1-23:25లో యోషీయా విషయములో చూస్తాము. వారి పునరుద్ధరణ కార్యములు దేవుని ప్రజల మధ్య నమ్మకత్వమును ప్రోత్సహించాయి మరియు పెంపొందించాయి కూడా, తద్వారా వారి పరిపాలన కాలములో దేవుడు దేశమును దీవించునట్లు ప్రోత్సహించాయి.

పాత నిబంధన రాజుల యొక్క అర్హతలు మరియు కార్యములను చూశాము కాబట్టి, ఇశ్రాయేలులో రాజత్వము యొక్క భవిష్యత్తును గూర్చి పాత నిబంధన సృష్టించిన ఆకాంక్షలను చూచుటకు సిద్ధముగా ఉన్నాము.

## ఆకాంక్షలు

భవిష్యత్ రాజుల కొరకు, ముఖ్యముగా భూమి మీద ఆయన రాజ్యమును స్థాపించు దేవుని లక్ష్యమును నెరవేర్చుతాడని ప్రవచించబడిన ఒక ప్రత్యేకమైన మెస్సీయ రాజు కొరకు పాత నిబంధన అనేక ఆకాంక్షలను స్థాపించింది. అవును, ఈ మెస్సీయ రాజు యేసే అని క్రొత్త నిబంధన బయలుపరుస్తుంది. కాబట్టి, ఈ పాత నిబంధన ఆకాంక్షలను మనము కొంత వివరముగా చూడవలసియున్నది.

ఇశ్రాయేలులో రాజత్వము యొక్క భవిష్యత్తును గూర్చిన ఆకాంక్షలు రెండు నిధుల ద్వారా సృష్టించబడ్డాయని చూద్దాము: మొదటిగా, పాత నిబంధనలో రాజత్వము యొక్క చారిత్రిక అభివృద్ధి; మరియు రెండవదిగా, ఇశ్రాయేలు యొక్క భవిష్యత్ రాజును గూర్చి ఇవ్వబడిన విశేషమైన ప్రవచనములు. రాజత్వము యొక్క చారిత్రిక అభివృద్ధి ద్వారా సృష్టించబడిన ఆకాంక్షలను మొదట చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## చారిత్రిక అభివృద్ధి

ఇశ్రాయేలులో రాజరికమునకు మునుపు మానవ రాజత్వము పోషించిన పాత్రను చూస్తూ ఆరంభిద్దాము.

రాజరికమునకు మునుపు. దేవుడు లోకమును సృజించినప్పుడు, సృష్టి మీద తనకు రాజ ప్రతినిధులుగా ఉండుటకు దేవుడు ఆదాము హవ్వలను ఏదేను వనములో ఉంచాడు. మానవాళి కొరకు ఈ పాత్రను దేవుడు ఆది. 1:26-27లో సూచిస్తున్నాడు, అక్కడ ఆయన ఆదాము హవ్వలను ప్రణాళిక ప్రకారముగా తన రూపముతో సృజించాడు.

పాత నిబంధన దినములలో, "దేవత రూపము," "దేవతల పోలికె," మరియు "దేవుని కుమారుడు" అను పదములు రాజులు మరియు చక్రవర్తులను సంబోధించుట కొరకు సాధారణంగా ఉపయోగించేవారు. రాజులు తమ దేవతలకు భూలోక ప్రతినిధులు లేక రాజప్రతినిధులైయున్నారు అను నమ్మకమును ఈ మాటలు వ్యక్తపరుస్తాయి. భూమి మీద తమ దేవుని యొక్క చిత్తమును జరిగించుట రాజు యొక్క బాధ్యతయైయుండెను. కాబట్టి, ఆదాము హవ్వలను బైబిలు దేవుని రూపములు అని పిలచినప్పుడు, దేవుడు మానవ జాతిని సృష్టి మీద తన రాజ ప్రతినిధులుగా ఉండుటకు నియమించాడు అనునది ఒక అర్థము. విశాలమైన భావనలో, మానవులందరు రాజుల వలె, అనగా భూమి మీద ఆయన చిత్తము జరుగునట్లు చూచు దేవుని సేవక రాజుల వలె ఉండుటకు సృష్టించబడ్డారు. దైవిక రూపములు రాజ మూర్తులు అను ఆలోచన ఆది. 1:28ని వివరించుటలో ఉపయోగపడుతుంది, అక్కడ దేవుడు మన ప్రథమ తల్లిదండ్రులకు ఒక ఆజ్ఞను ఇచ్చాడు:

> మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి. సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను (ఆది. 1:28).

దేవుడు భూమియంతటిని తన రాజ్యముగా మార్చాలని కోరాడు. కాబట్టి, ఆయన రాజ ప్రతినిధులను అనగా మానవులను దేవుని యొక్క అనేక రూపములతో లోకమును నింపుటకు, మరియు సృష్టి అంతటిని పాలించుటకు నియమించాడు. ఈ ఆజ్ఞను చాలాసార్లు సాంస్కృతిక ఆజ్ఞ అని పిలుస్తారు ఎందుకంటే, లోకమంతా సంస్కృతులను మరియు నాగరికతలను స్థాపిస్తూ దేవుని రాజ్యమును నిర్మించమని ఇది మనకు ఆజ్ఞాపిస్తుంది.

ఆదాము హవ్వలు పాపములో పడిన తరువాత, వారు మరియు వారి సంతతివారు దేవుడిచ్చిన వాస్తవిక బాధ్యతల నుండి ఎంత దూరమయ్యారంటే, దేవుడు పాపభరితమైన మానవాళిని నోవహు కాలములోని జలప్రళయము ద్వారా శిక్షించవలసివచ్చింది. అయినను, లోకములో మానవులకు ఇవ్వబడిన రాజ బాధ్యతను దేవుడు తీసివేయలేదు. నోవహు మరియు అతని కుటుంబము ఓడలో నుండి బయటకు వచ్చిన తరువాత, దేవుడు సాంస్కృతిక ఆజ్ఞను పునరుద్ఘాటించి, లోకమంతట దేవుని-గౌరవించు నాకరికతలను వ్యాపింపజేయమని తన రాజ రూపములన్నిటికి ఆయన ఆజ్ఞ ఇచ్చాడు.

కాని మానవాళిలోని రాజ-ప్రతినిధులు అబ్రాహాము దినములలో బహుగా త్రోవతప్పిపోయారు. దేవుడు అబ్రాహామును విమోచించి తన యేర్పరచబడిన జనాంగమైన ఇశ్రాయేలునకు అతనిని తండ్రిగా చేశాడు. ఇప్పటికీ సాధారణ భావనలో మానవులందరు దేవుని రాజ-ప్రతినిధులైయున్నప్పటికీ, భూమి

మీద ఉన్న కుటుంబములన్నిటికి జ్యేష్ఠునిగా దేవుడు అబ్రాహాము మరియు అతని సంతతిని ఎన్నుకున్నాడు. దేవుని కొరకు పరిశుద్ధమైన దేశమును నిర్మించు విశేషమైన రాజరిక బాధ్యత ఇశ్రాయేలుకు ఇవ్వబడినదని సూచిస్తూ ఆది. 15 మరియు 17లో దేవుడు అబ్రాహాముతో ఒక ప్రత్యేకమైన నిబంధనను చేశాడు. మరియు దేవుని చిత్తమును ఇతర దేశములన్నిటికి వ్యాపింపజేయుటకు ఈ దేశము ఆరంభ బిందువైయ్యింది.

చరిత్రలో తరువాత, ఇశ్రాయేలుకు నాయకత్వము వహించుటకు మోషేను మరియు యెహోషువను పంపుట ద్వారా దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనలను నెరవేర్చుట ఆరంభించాడు. వారి పరిపాలనలో, దేవుడు తన ప్రజలను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించాడు, మరియు వారు విమోచించబడిన పరిశుద్ధమైన దేవుని రూపములు గల పెద్ద దేశముగా అభివృద్ధి చెందవలసిన కనానును — వాగ్దాన దేశమును — జయించుటకు వారికి బలమునిచ్చాడు.

దుఃఖకరముగా, కనానును సంపూర్ణంగా స్వాధీనపరచుకొనుటలో ఇశ్రాయేలు విఫలమైయ్యింది. కాబట్టి, యెహోషువా మరణించిన తరువాత, జాతీయ ఐక్యత చెదిరిపోయింది మరియు అనేకమంది స్థానిక న్యాయాధిపతులూ మరియు లేవీయులు తమ గోత్రములను కష్ట కాలములలో నడిపించారు. ఈ సంవత్సరములలో దేవుడు ఇశ్రాయేలును దీవించినప్పటికీ, న్యాయాధిపతులు మరియు లేవీయుల యొక్క పరిపాలన ఇశ్రాయేలును దేవుని యొక్క రాజ రూపములైన దేశముగా జయములోనికి నడిపించుటలో విఫలమైయ్యింది. న్యాయాధిపతులు గ్రంథకర్త దీనిని పుస్తకమంతటిలో స్పష్టము చేశాడు. న్యాయాధి. 21:25లో ఆయన పుస్తకము యొక్క చివరి వరుసను వినండి:

> ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజు లేడు; ప్రతివాడును తన తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచువచ్చెను (న్యాయాధి. 21:25).

ఇలాంటి వ్యాఖ్యలే న్యాయాధి. 17:6, 18:1, మరియు 19:1లో కూడా కనిపిస్తాయి. దేవుని కొరకు ప్రత్యేకించబడిన రాజ ప్రతినిధియైన నీతిగల రాజు పరిపాలనలోనే ఇశ్రాయేలు దేవుడు ఏర్పరచుకొనిన దేశముగా ముందుకు కొనసాగగలదు అని ఈ పునరావృత్తములు ఉద్ఘాటిస్తాయి.

> సరే, న్యాయాధిపతుల గ్రంథము రాజు యొక్క రాకకు తగిన కారణముగా ఉంది. న్యాయాధిపతుల గ్రంథములో ఒక వృత్తము ఉన్నది, న్యాయాధిపతి లేస్తాడు, కొంతకాలం అంతా బాగుంటుంది, తరువాత ప్రజలు పాపములో పడిపోతారు, వారు దేవునికి మొరపెడతారు మరియు దేవుడు మరొక న్యాయాధిపతిని లేవనెత్తుతాడు. మరింత స్థిరమైన, మరింత భద్రమైన ఒకని అవసరతను రచయిత స్పష్టము చేయుటకు ప్రయత్నిస్తాడు మరియు దేవునికి ప్రియమైన నాయకుడు మరియు పరిపాలకుని కొరకు ఎదురు చూస్తాడు. అవును ఈ గుణము దావీదుకు ఆపాదించబడింది, దేవునికి ప్రియుడైన రాజు, మరియు అతడు రాజత్వమునకు, అనగా కేవలం ఆ దినములలోని ఇశ్రాయేలు ప్రజల కొరకు మాత్రమేగాక, దేవుడు తన ప్రజలను ఎలా పాలిస్తాడు అను విషయమునకు మాదిరిగా చూడబడ్డాడు. కాబట్టి, న్యాయాధిపతుల గ్రంథము రాజు, అనగా దేవుని ఆధీనములో పరిపాలించు

రాజు, నాడు మరియు నేడు కూడా తన ప్రజలను దేవుడు ఎలా పాలిస్తాడో చూపు రాజు యొక్క అవసరత కొరకు ఒక తర్కముగా ఉన్నది.

— డా. సైమన్ వైబర్ట్

న్యాయాధిపతుల గ్రంథమును దేవుని ప్రణాళిక అంతటి దృష్ట్యా, అనగా ఆదికాండము మొదలుకొని యేసు క్రీస్తు యొక్క రాకడ వరకు ఉన్న ప్రణాళిక దృష్ట్యా చూచుట చాలా ప్రాముఖ్యము. న్యాయాధిపతుల గ్రంథము మునుపటి ప్రత్యక్షత వైపుకు, అనగా రాజు రూపముగా ఆదాము మొదలుకొని, అతని సంతతి నుండి రాజులు రాబోవుచున్నారు అని ఎదురుచూసిన అబ్రాహాము నిబంధనలోని అబ్రాహాము, మోషే పాత నిబంధనను ఇచ్చుట, రాజు యొక్క రాకడను ఎదురుచూస్తున్న ద్వితీ. 17 వరకు చూస్తుంది. అయినను, ఆ కాలములోని దేవుని ప్రణాళికలో వాస్తవిక రాజులు రాలేదు. కాబట్టి కొంత వరకు న్యాయాధిపతులు గ్రంథము నాయకుల యొక్క అవసరతను, పరిపాలన యొక్క అవసరతను చూపుతుంది. మోషే తరువాత యెహోషువ నాయకుడవుతాడు; యెహోషువ తరువాత న్యాయాధిపతులు. అయినను, దేవుడు ఎదురుచూసిన రాజు ఇంకను వచ్చియుండలేదు. దాని నెరవేర్పు ఇంకా జరగలేదు. న్యాయాధిపతులు, తమ నాయకత్వము మీద ఆధారపడ్డారు, వారు మేలు చేస్తే దేశము బాగుండేది. వారు చెడు చేస్తే దేశము ఇబ్బంది పడేది, కాని రాజు మాత్రము రాలేదు. రాజు వచ్చినప్పుడు పరిస్థితులు మెరుగుపడతాయని అని న్యాయాధిపతుల గ్రంథము మనకు తెలియజేస్తుంది. పాత నిబంధన మనకు ఇచ్చిన మాటను బట్టి మాటలు నెరవేర్చబడతాయి. తరువాత, న్యాయాధిపతుల నుండి సౌలు మరియు దావీదు వైపుకు ముందుకు కదులుతాము, వీరు ఒకరికి వ్యతిరేకముగా మరొకరు ఉన్నట్లు అనిపిస్తుంది — ప్రజల రాజు, దేవుని రాజు — తరువాత ఇది గొప్ప దావీదు నిబంధన, దావీదు యొక్క గొప్ప కుమారుని గూర్చి ఇవ్వబడిన వాగ్దానముల వైపుకు నడిపిస్తుంది. ఇదంతా దేవుని ప్రణాళికలో భాగమైయున్నది, ప్రభువైన యేసు క్రీస్తు యొక్క రాకడ కొరకు మనలను సిద్ధపరచింది, ఈ ఇతర రాజులకు భిన్నముగా నిజమైన రాజు ఎలా ఉంటాడో చూపింది, మనము ఒకప్పుడు చేయబడిన విధముగా మనలను పునరుద్ధరించుటకు రాజు యొక్క అవసరతను తెలియజేసింది. మరియు ఇదంతా మనలను యేసు క్రీస్తు వైపునకు నడుపు దేవుని ప్రణాళికలో భాగమైయున్నది.

— డా. స్టీఫెన్ వెల్లమ్



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇశ్రాయేలు యొక్క రాజరికమునకు మునుపు మానవ రాజత్వము యొక్క ఆరంభములను మనము చూశాము కాబట్టి, ఇప్పుడు ఇశ్రాయేలులో రాజరిక కాలములోని చారిత్రిక అభివృద్ధులను చూద్దాము.

రాజరికము. 1 సమూ. 8:5-20 ప్రకారం, న్యాయాధిపతుల కాలము ముగింపులో తమ చుట్టు ఉన్న రాజులు తమ రాజ్యములకు అందించిన స్థిరత్వమును క్రమమును చూసి ఇశ్రాయేలు దేశము ఈర్ష్య చెందింది. దేవుడు తనదైన సమయములో రాజును లేవనెత్తు వరకు వేచియుండుటకు వారు నిరాకరించారు. బదులుగా, ఆయన వారికి రాజును వెంటనే ఇవ్వాలని వారు కోరారు. దీనికి స్పందిస్తూ, దేవుడు ఇశ్రాయేలు యొక్క మొదటి అధికారిక రాజుగా సౌలును నియమించాడు.

మానవ రాజు కొరకు ఇశ్రాయేలు కలిగియుండిన కోరిక పాపభరితమైనది కాదని గ్రహించుట చాలా అవసరము. ఇశ్రాయేలు గొప్ప మానవ రాజును కలిగి బలమైన దేశము కావాలని తాను ముందు నుండే నిర్ణయించినట్లు దేవుడు అనేకమార్లు బయలుపరచాడు. ఉదాహరణకు, ఆది. 17:6లో, అబ్రాహాము సంతతిలో రాజులు వస్తారని దేవుడు అబ్రాహాముకు వాగ్దానము చేశాడు. ఆది. 49:8-10లో, యూదా సంతతి వారిలో ఒకరు ఇశ్రాయేలుకు రాజు అవుతారని యాకోబు తన కుమారుడైన యూదాను దీవించాడు. మరియు మనము ఈ పాఠములో ఇంతకు ముందు చూసినట్లు, ద్వితీ. 17:14-19లో ఇశ్రాయేలు రాజుల కొరకు మోషే కొన్ని హెచ్చరికలను కూడా సూచించుట చూస్తాము. ఇంతేగాక, 1 సమూ. 2:10లో, ఇశ్రాయేలు రాజు కొరకు అడుగుటకు కొంత కాలము మునుపు, తన ప్రజల మీద దేవుడు తుదకు ఒక నీతిగల రాజును స్థాపిస్తాడని నీతిమంతురాలైన హన్నా ప్రవచించింది.

ఇశ్రాయేలులో రాజత్వము కొరకు దేవుడు మంచి ప్రణాళికలను కలిగియుండిన తరువాత కూడా, దేవుని నమ్ముటకు మరియు ఆయన సమయము కొరకు వేచియుండుటకు నిరాకరించి దేశము పాపము చేసింది. మరియు సౌలును వారికి రాజుగా నియమించుట కొంత వరకు వారు చేసిన పాపమునకు క్రమశిక్షణగా జరిగింది. సౌలు కొన్ని మార్గములలో ఇశ్రాయేలును ముందుకు నడిపించినా, దేవునిపై అతడు స్వయంగా చేసిన తిరిగిబాటు దేవుడు అతనిని అతని కుటుంబమును తొలగించునట్లు చేసింది.

కాని సౌలు విఫలమైన తరువాత, దావీదును రాజుగా ఇచ్చుట ద్వారా దేవుడు కృపతో ఇశ్రాయేలుకు కావలసినటువంటి రాజును అనుగ్రహించాడు. మిగిలిన పతనమైన మానవాళి వలెనె, దావీదు కూడా ఒక పాపియే. అయితే ఆతడు దేవునికి ఇష్టుడైన మనుష్యుడు కూడా. దేశమును ఐక్యపరచుటకు, శత్రువులను జయించుటకు, మరియు ఇశ్రాయేలుకు భద్రతను ఐశ్వర్యమును తెచ్చుటకు దేవుడు అతనిని బలపరచాడు. అంతేగాక, నిరంతర రాజ వంశముగా తన సంతతివారు ఏలుబడి చేస్తారని దేవుడు దావీదుతో నిబంధన చేశాడు. ఈ నిబంధనను గూర్చి 2 సమూ. 7; 1 దిన. 17; మరియు కీర్తనలు 89, 132 వంటి లేఖనభాగములలో చదవవచ్చు.

దావీదు మరణించినప్పుడు, తన కుమారుడైన సొలొమోను అతని స్థానములో రాజు అయ్యాడు. అనేక విధాలుగా, ఇశ్రాయేలు రాజుల చరిత్రలో సొలొమోను యొక్క పరిపాలన ఉన్నత శిఖరమైయున్నది. అతడు ఇశ్రాయేలు యొక్క ప్రాంతములను వ్యాప్తిచేసి, దాని యొక్క ఐశ్వర్యమును మంచి పేరును పెంచాడు. దుఃఖకరముగా, తన అన్యదేశ భార్యల యొక్క దేవతలను ఆరాధించుట ద్వారా అతడు కూడా దేవుని ధర్మశాస్త్రమును ఉల్లంఘించాడు. కాబట్టి, దేవుడు సొలొమోను కుమారుడైన రెహబాము కాలములో రాజ్యమును విభజించాడు. తరువాత వచ్చిన తరములు మరి ఎక్కువగా దేవునికి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అపనమ్మకస్తులైయ్యారు, కాబట్టి ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యములు రెండు దేవుని తీర్పును ఎదుర్కొని అన్య దేశములకు చెరగొనిపోబడ్డాయి. ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలును క్రీ. పూ. 723 లేక 722లో అష్షూరు రాజ్యము చెరగొనిపోగా, దక్షిణ రాజ్యమైన యూదాను క్రీ. పూ. 587 లేక 586లో బబులోను చెరగొనిపోయింది. చివరి చట్టబద్ధమైన రాజు దావీదు వంశమువాడైన యెకొన్యా అని కూడా పిలువబడు యెహోయాకీను క్రీ. పూ. 597లో చెరగొనిపోబడ్డాడు.

రాజరిక కాలము ముగింపు అయ్యే సరికి, మానవ రాజత్వమును గూర్చి దేవుడు అనేక విషయములను బయలుపరచాడు. విశాలమైన భావనలో, మానవులందరు భూమి మీద దేవుని రాజ-ప్రతినిధులైయున్నారు. సూక్ష్మ భావనలో, ఇతర దేశములకు మాదిరిగా ఉండుటకు ఇశ్రాయేలు దేశము తమకు రాజ ప్రతినిధులుగా ఉండుటకు ఒక మానవాళిలోని పవిత్రమైన కుటుంబమును ఎన్నుకుంది. మరియు అత్యంత సూక్ష్మ భావనలో, దావీదు యొక్క రాజ సంతతివారు దేవుని యొక్క ప్రధాన రాజ-ప్రతినిధి స్థానమును అధిరోహించారు. ఉన్నతమైన రాజుయైన దేవుని చిత్తమును సేవించునట్లు ఇశ్రాయేలీయులను మరియు లోకమంతటిని నడిపించుటకు దేవుడు దావీదు కుమారులను అభిషేకించాడు.

ఇశ్రాయేలు రాజరికమునకు ముందు మరియు రాజరిక కాలములో రాజు స్థానము యొక్క చారిత్రిక అభివృద్ధిని మనము చూశాము కాబట్టి, రాజరికము తరువాత కాలమును ఇప్పుడు విశదీకరిద్దాము, ఈ కాలములో ఇశ్రాయేలు మరియు యూదా చెరలో నివసించారు మరియు దావీదు వంశపు రాజు ఆ కాలములో ఉండలేదు.

చెర. బబులోనీయులు యెరూషలేమును నాశనము చేసి దావీదు సంతతివానిని సింహాసనము నుండి తొలగించినప్పటికీ, పారసీక రాజైన కోరెషు బబులోనును జయించి ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశమునకు తిరిగి వెళ్లవచ్చని ఆదేశించాడు. దీనిని గూర్చి మనము 2 దిన. 36 మరియు ఎజ్రా 1లో చదువుతాము.

కోరెషు ఇచ్చిన శాసనము తరువాత సంవత్సరములను పునరుద్ధరణ కాలము అని పిలుస్తారు. తిరిగివచ్చినవారు దేవుని బలిపీఠమును పునఃప్రతిష్టించారు, నూతన దేవాలయమును నిర్మించారు, మరియు యెరూషలేము గోడలను పునఃనిర్మించారు. ఇంతకు ముందు, హగ్గయి 2:21-23లో, పునరుద్ధరించబడిన శేషము నమ్మకముగా ఉంటే, దావీదు సింహాసనము మీద దావీదు సంతతివాడైన జరుబ్బాబెలును దేవుడు నియమించవచ్చని ప్రవక్తయైన హగ్గయి సెలవిచ్చాడు. కాని ప్రజలు దేవునికి నమ్మకస్తులైయుండలేదు. కాబట్టి, కేవలం ఇశ్రాయేలీయులలో ఒక శేషము మాత్రమే వాగ్దాన దేశములో నివసించుటతో, మహిమ కొరకు వారు కలిగియుండిన నిరీక్షణలు భవిష్యత్తులోనికి వాయిదా వేయబడుటతో పాత నిబంధన ముగుస్తుంది.

పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలములో,ఇశ్రాయేలు యొక్క విగ్రహారాధన ఇశ్రాయేలులో రాజత్వము యొక్క పునరుద్ధరణను మరింత ఆలస్యం చేసింది. గ్రీకు సామ్రాజ్యము పారసీక సామ్రాజ్యమును జయించి పాలస్తీనాలో ఉన్న ఇశ్రాయేలును స్వాధీనము చేసుకుంది. తరువాత, రోమా సామ్రాజ్యము గ్రీకులను జయించి వాగ్దాన భూమిని ఏలనారంభించింది. ఈ కాలమంతటిలో, ఇశ్రాయేలు మీద దేవుడు అభిషేకించిన రాజు ఉండలేదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అష్షూరీయులు, బబులోనీయులు, మాదీయులు మరియు పారసీకులు, గ్రీకులు మరియు రోమీయుల పరిపాలనలో ఇశ్రాయేలు అనుభవించిన దయనీయమైన స్థితి ఒక విషయమును మాత్రం స్పష్టము చేసింది: దావీదు యొక్క నీతిగల కుమారుడు పాలించుట భవిష్యత్తు కొరకు ఎంతో ప్రాముఖ్యమైయున్నది. దేవుని ద్వారా ఎన్నుకొనబడిన ప్రజలుగా లోకములో దాని యొక్క పాత్రను నెరవేర్చుటకు ఇశ్రాయేలుకు దావీదు వంశపు రాజు అవసరమయ్యాడు. కాబట్టి, తమను హింసించువారి నుండి తమను విమోచించుటకు మరియు లోకమంతటా దేవుని చిత్తమును వ్యాప్తి చేయుటకు నీతిగల దావీదు వంశపు రాజును పంపుట ద్వారా దేవుడు దావీదుతో చేసిన నిబంధనను నెరవేర్చు దినము కొరకు దేవుని యొక్క నమ్మకమైన ప్రజలు ఆశతో ఎదురుచూశారు.

రాజు స్థానము యొక్క చారిత్రిక అభివృద్ధులను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, పాత నిబంధనలోని విశేషమైన ప్రవచనములలో నుండి వెలువడిన రాజత్వము యొక్క భవిష్యత్తు కొరకు ఆకాంక్షలను చూచుటకు సిద్ధముగా ఉన్నాము.

## విశేషమైన ప్రవచనములు

ఇశ్రాయేలులో రాజత్వము యొక్క భవిష్యత్తును గూర్చి పాత నిబంధనలో చాలా ప్రవచనములు ఉన్నాయి కాబట్టి ఇక్కడ అన్నిటిని ప్రస్తావించుట సాధ్యము కాదు. కాబట్టి, ఈ పాఠములో మన ఉద్దేశముల కొరకు, మనము కేవలం నాలుగు ప్రాముఖ్యమైన శీర్షికలను మాత్రమే ప్రస్తావిద్దాము. మొదటి స్థానములో, దేవుడు దావీదు రాజ వంశమును పునరుద్ధరిస్తాడని పాత నిబంధన ప్రవక్తలు ప్రవచించారు.

> మెస్సీయ దావీదు కుమారుడని పాత నిబంధన ప్రప్రథమముగా ఉద్ఘాటిస్తుంది. అవును, దావీదు రాజు బహుగా దేవుని నమ్మిన, అద్భుతమైన విషయములు సాధించిన, అనేక విధాలుగా దేవునికి విధేయుడైన ఇశ్రాయేలు యొక్క గొప్ప రాజైయున్నాడు. అవును అతడు అనేక సార్లు పడిపోయాడు కూడా, కాని దావీదు రానున్న మెస్సీయకు ఒక ఉదాహరణ అయ్యాడు. ఆయన దేశమునకు శాంతిని తెచ్చు నాయకుడవుతాడు. కాబట్టి, దావీదు మరణించిన తరువాత దావీదు కుమారుడు వస్తాడని మరియు ఆయన సమాధానమును, నీతిని మరియు ఆనందమును తెస్తాడనే నిరీక్షణను పాత నిబంధనలోని చివరి భాగములో మనము చూస్తాము.
>
> — డా. థామస్ స్క్రెయినర్

> కాని పాత నిబంధనలో మెస్సీయ అని పిలువబడినవాడు రాజైయుండెను, దావీదు వంశములో నుంచి వచ్చిన రాజైయుండెను. దావీదుకు దేవుడు నిబంధనను ఇచ్చాడు మరియు ఆ నిబంధనలో ఒక దినమున దేవుడు ఒక రాజును లేవనెత్తుతాడని అతనికి విశేషమైన దేవుని కుమారుని అనుబంధం ఉంటుందని, ఆయన దేవునితో కుమారుని అనుబంధం కలిగియుంటాడని దావీదుకు వాగ్దానము చేయబడింది. ఆయన దావీదు సింహాసనము మీద నిత్యము పాలిస్తాడు,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

న్యాయమును మరియు నీతిని స్థాపిస్తాడు. కాబట్టి, నిజముగా, మనము పాత నిబంధనలోని మెస్సీయను గూర్చి ప్రస్తావించుకొనునప్పుడు, మనము ఒక రాజును సూచిస్తున్నాము. ఆ రాజు కడపటి రాజు, దేవుని రక్షణను మరియు విడుదలను ప్రవేశపెట్టు రాజు.

— డా. మార్క్ స్ట్రాస్

ఇశ్రాయేలుకు దావీదు రాజత్వమును పునరుద్ధరించుటకు దేవుడు తుదకు దావీదు యొక్క నీతిగల కుమారుని పంపుతాడని ప్రవక్తలు సెలవిచ్చారు. దీనిని మనము కీర్తనలు 89, యెషయా 9:7 మరియు 16:5, యిర్మీయా 23:5 మరియు 33:25-26, మరియు యెహెజ్కేలు 34:23-24 వంటి అనేక చోట్ల చూడవచ్చు. ఒక ఉదాహరణగా, ఆమోసు ప్రవక్త ద్వారా ఆమోసు 9:11లో దేవుడు సెలవిచ్చిన మాటను వినండి:

> పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తి దాని గోడను బాగుచేసి దాని పోయిన చోట్లను బాగుచేసి, ... పూర్వపురీతిగా దానిని మరల కట్టుదును (ఆమోసు 9:11).

రెండవ స్థానములో, ఈ భవిష్యత్ దావీదు కుమారుడు దేవుని ప్రజలకు తమ విరోధుల మీద జయమును మరియు స్వతంత్రమును ఇస్తాడని ప్రవక్తలు ప్రవచించారు. ఆయనకు నమ్మకముగా ఉన్న ప్రజల నిమిత్తము వారి శత్రువులను జయించుటకు దేవుడు నాటకీయముగా చరిత్రలో పాలుపంచుకుంటాడని పాత నిబంధన ప్రవక్తలు తరచుగా మాట్లాడారు. ఇశ్రాయేలులోని అపనమ్మకస్తులతో సహా ఆయన మార్గములను వ్యతిరేకించిన వారందరికీ తీర్పు తీర్చుతానని దేవుడు వాగ్దానము చేశాడు. మరియు ప్రవక్తలు ఈ జయమును దేవుని యొక్క గొప్ప రాజ-ప్రతినిధిగా పని చేయు దావీదు సింహాసనమునకు భవిష్యత్తు వారసునికి ఆపాదించారు. ఈ ఆకాంక్షలు కీర్తనలు 132:17-18, యెషయా 9:4-7, యిర్మీయా 30:5-17, యెహెజ్కేలు 34:2, మరియు జెకర్యా 12:1-10 వంటి చోట్ల ప్రవచించబడినవి. ఉదాహరణకు, యిర్మీయా 30:8-9లో ఇవ్వబడిన ఈ ప్రవచనమును వినండి:

> సైన్యములకధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు నీకున్న కాడి నీ మెడనుండకుండ ఆ దినమున నేను దాని విరిచి నీ కట్లను తెంపెదను; ఇకను అన్యులు యాకోబు సంతతివారిచేత దాస్యము చేయించుకొనరుగాని వారు తమ దేవుడైన యెహోవానగు నేను వారిమీద రాజుగా నియమించు దావీదును సేవించుదురు (యిర్మీయా 30:8-9).

మూడవ స్థానములో, ఈ భవిష్యత్ దావీదు కుమారుడు ఒక నిత్యమైన రాజ్యమును స్థాపిస్తాడని పాత నిబంధన ప్రవక్తలు ప్రవచించారు. దావీదు యొక్క గొప్ప కుమారుడు ఇశ్రాయేలును పాలించునప్పుడు, వారు దేవుని యొక్క ఆశీర్వాదములను నిత్యము అనుభవిస్తారని పాత నిబంధన ప్రవక్తలు తరచుగా ప్రవచించారు. దావీదు రాజు యొక్క పాలన భూమిని పరలోకము వలె చేస్తుంది, మరియు ఆయన ప్రజలు నిత్యముండు సమాధానము మరియు ఐశ్వర్యములో జీవిస్తారు. ఈ ఆకాంక్షలు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

యెషయా 55:3-13, మరియు యెహెజ్కేలు 37:24-25 వంటి వాక్యభాగములలో ఉన్నాయి. ఉదాహరణకు, రానున్న దావీదు కుమారుని గూర్చి యెషయా 9:7లో యెషయా ఏమి చెప్పాడో వినండి:

> ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తికలిగి దీనిని నెరవేర్చును (యెషయా 9:7).

మరియు నాల్గవ స్థానములో, ఈ భవిష్యత్ దావీదు కుమారుడు సార్వత్రిక రాజ్యమును స్థాపిస్తాడని కూడా ప్రవక్తలు బోధించారు. భవిష్యత్ దావీదు రాజ్యము కాలములో మాత్రమేగాక, భౌగోళికముగా కూడా పరిమితులు లేకుండా ఉంటుంది. అది భూమి అంతటిని నింపివేస్తుంది. తమ పాపములను ఒప్పుకున్నవారంతా, వారు ఏ జాతివారైనా లేక ఏ దేశమువారైనా సరే, దానిలోని ఆశీర్వాదములను అనుభవిస్తారు. దీనిని మనము కీర్తనలు 2, 68, 72, 110, మరియు 122 వంటి చోట్ల చూస్తాము. రానున్న రాజు మరియు ఆయన రాజ్యము యొక్క ఈ అంశమును గూర్చి దాని. 7:13-14లో దానియేలు వర్ణించిన విధానమును వినండి:

> ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు [వచ్చెను] ... సకల జనులును రాష్ట్రములును ఆ యా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను (దాని. 7:13-14).

> మెస్సీయ యొక్క పాత్రను అర్థము చేసుకొనుటకు 2వ కీర్తన పాత నిబంధనలో ప్రాముఖ్యమైన లేఖనభాగములలో ఒకటైయున్నది, దేవుడు ఒక విశేషమైన రాజును తన పరిశుద్ధ పర్వతమైన సీయోనులో నియమించాడని అది స్పష్టముగా ప్రవచిస్తుంది. దేవుడు నియమించబోవు ఈ రాజు దేశముల మీద నాయకుడు అవుతాడని దీనిని జాగ్రత్తగా చదివితే మీరు కనుగొంటారు. దేశముల యొక్క విధేయత ఆయనదవుతుంది. దేశములన్ని, మరియు భూమి మీద పరిపాలకులందరి యొక్క రాకకు ఆయన అధికారిక రూపమవుతాడు, వారు ఆరాధించుటకు ఆయన ఎదుట సాగిలపడతారు, దీనికి 2వ కీర్తనలో "కుమారుని ముద్దుపెట్టుకొనుట" అను మాట ఉపయోగించబడింది. ఆయన ఇశ్రాయేలుకు మెస్సీయ అయినప్పటికీ ఇశ్రాయేలుకు మాత్రమే మెస్సీయ కాడను ఆలోచన ఇక్కడ కనిపిస్తుంది, ఎందుకంటే ఆయన ఇశ్రాయేలుకు మెస్సీయ కాబట్టి, ఆయన లోకమంతటికీ ప్రభువైయున్నాడు, లోకమంతటికి అర్హమైన ప్రభువైయున్నాడు. కాబట్టి మెస్సీయ ఒక మానవ రూపము అని అర్థము చేసుకొనుట ఇక్కడ ప్రాముఖ్యమైన విషయము, వాస్తవానికి, ఒక మానవ రూపము మాత్రమే దిగివచ్చి లోకమంతటికి పాలకుడైయుండాలి అని అర్థము చేసుకొనబడింది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

— డా. పీటర్ వాల్కర్

రాజత్వము యొక్క భవిష్యత్తును గూర్చి గొప్ప నిరీక్షణలతో పాత నిబంధన ముగుస్తుంది. దేవుడు దావీదు యొక్క ప్రత్యేకమైన పుత్రుని పంపుతాడు, ఆయన సర్వోన్నతమైన రాజ-ప్రతినిధి అయ్యుంటాడు. ఆయన దేవుని ప్రజల శత్రువులందరినీ జయిస్తాడు. ఆయన పాలనకు లోబడువారందరి కొరకు భూమి మీద ఆయన నిత్యముండు రాజ్యమును స్థాపిస్తాడు. దేవుని యొక్క రూపముగా మానవాళి యొక్క వాస్తవిక ఉద్దేశమును ఆ రాజ్యము నెరవేర్చుతుంది; ఇశ్రాయేలు కొరకు దేవుని యొక్క వాస్తవిక ఉద్దేశములను అది నెరవేర్చుతుంది; మరియు దావీదు సింహాసనమును స్థాపించుటకు దేవుని యొక్క వాస్తవిక ఉద్దేశములను అది నెరవేర్చుతుంది. దావీదు యొక్క నీతిగల కుమారుడు లోకమంతటిని దేవుని రాజ్యముగా మార్చుతాడు, మరియు దానిలోని దుష్టత్వమును కడిగిపేస్తాడు, మరియు తన ప్రజలందరి కొరకు అన్ని కాలముల కొరకు సమాధానమును ఐశ్వర్యమును స్థాపిస్తాడు.

రాజు స్థానమునకు పాత నిబంధన నేపథ్యమును చూశాము కాబట్టి, రెండవ ముఖ్యాంశమును చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము: యేసులో రాజు స్థానము యొక్క నెరవేర్పు.

## యేసులో నెరవేర్పు

పాత నిబంధనలో వాగ్దానము చేయబడిన దావీదు వంశపు రాజు యేసే అని క్రొత్త నిబంధన స్పష్టముగా బోధిస్తుంది. ఉదాహరణకు, మత్తయి 2:2లో జ్ఞానులు ఆయనను యూదుల రాజు అని వర్ణించారు. మార్కు 8:27-29 వంటి చోట్ల యేసు శిష్యులు మెస్సీయ లేక క్రీస్తు అను రాజ బిరుదులను ఆయనకు ఆపాదించారు. యోహాను 1:49లో ఆయన ఇశ్రాయేలు రాజు అని పిలువబడ్డాడు. అన్నిటి కంటే ముఖ్యముగా, ఆయన మరణమునకు ముందే, పాత నిబంధనలో వాగ్దానము చేయబడిన మెస్సీయ రాజు తానేనని యేసు స్వయంగా చెప్పాడు. మత్తయి 27:11లో పొంతు పిలాతుతో ఆయన సంభాషణను వినండి:

> యేసు అధిపతియెదుట నిలిచెను; అప్పుడు అధిపతియూదుల రాజవు నీవేనా?
> అని ఆయననడుగగా యేసు అతని చూచి నీవన్నట్టే అనెను (మత్తయి 27:11).

మార్కు 15:2, లూకా 23:1-3, మరియు యోహాను 18:33-37 వంటి చోట్ల కూడా మనము ఇలాంటి నివేదికలనే చూస్తాము. యేసు తన భూలోక పరిచర్య కాలములో ఇశ్రాయేలు సింహాసనమును అధిరోహించకపోయినప్పటికీ, ఆయన నియముగా వాగ్దానము చేయబడిన దావీదు వంశపు రాజు అని క్రొత్త నిబంధన స్పష్టముగా బోధిస్తుంది. మరియు దావీదు సింహాసనము కొరకు పాత నిబంధన ఆకాంక్ష అంతటిని నెరవేర్చుటకు ఆయన భవిష్యత్తులో తిరిగి రానైయున్నాడు.

యేసు యొక్క వ్యక్తిత్వములో రాజు స్థానము యొక్క నెరవేర్పును ఈ స్థానము యొక్క పాత నిబంధన నేపథ్యమును గూర్చి మనము చేసిన సర్వేకు అనుగుణంగా పరీక్షించుదాము. మొదటిగా, రాజు స్థానము యొక్క అర్హతలను యేసు నెరవేర్చాడు అని చూద్దాము. రెండవదిగా, యేసు రాజుల



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కార్యములకు మాదిరి అయ్యాడు అని చూద్దాము. మరియు మూడవదిగా, రాజత్వ పరిచర్య యొక్క భవిష్యత్తు కొరకు పాత నిబంధన సృష్టించిన ఆకాంక్షలను యేసు నెరవేర్చిన విధానములను మనము అన్వేషిద్దాము. యేసు యొక్క రాజత్వ అర్హతలతో ఆరంభించుదాము.

## అర్హతలు

మోషే ధర్మశాస్త్రము రాజుల కొరకు నాలుగు అర్హతలను సూచించింది అని ఈ పాఠంలో ఇంతకు మునుపు మనము చూశాము. మొదటిగా, రాజు దేవునిచే యేర్పరచబడినవాడైయుండాలి. రెండవదిగా, అతడు ఇశ్రాయేలీయుడైయుండాలి. మూడవదిగా, జయము మరియు భద్రత కొరకు అతడు దేవుని మీద ఆధారపడాలి. మరియు నాల్గవదిగా, తన పరిపాలన మరియు వ్యక్తిగత జీవితములో నిబంధనా నమ్మకత్వమును కనుపరచాలి. మరియు ఈ అర్హతలతో పాటు, రాజు దావీదు కుమారుడైయుండవలెను అని దావీదుతో చేయబడిన నిబంధన సూచించింది. మన పాఠంలో ఈ సమయమందు, దేవునిచే యేర్పరచబడుట అను దానితో ఆరంభించి యేసు ఈ అర్హతలను ఎలా నెరవేర్చాడో చూద్దాము.

### దేవునిచే యేర్పరచబడుట

మనము ఇంతకు ముందు చూసినట్లు, దేవుడు సర్వసృష్టి మీద గొప్ప చక్రవర్తి లేక ప్రభువైయున్నాడు. మరియు ఇశ్రాయేలు రాజు దేవుని యొక్క ప్రత్యేకించబడిన పరిశుద్ధ దేశమైన ఇశ్రాయేలునకు సేవక రాజు లేక సామంత అయ్యున్నాడు. మరియు దేవుడు మాత్రమే తన అధికారమును ఇతరులకు ఇవ్వగలడు కాబట్టి, దేశము మీద దేవుని అధికారమును పొందుకొని ఉపయోగించు అర్హమైన రాజులను ఆయన మాత్రమే యేర్పరచాలి.

ఇశ్రాయేలు మీద రాజుగా ఉండుటకు దేవుడు ఆయనను ఎన్నుకొని నియుక్తి చేశాడు కాబట్టి యేసు ఈ అర్హతను నెరవేర్చాడు. దీనిని మనము మత్తయి 1:1-17లో ఉన్న యేసు యొక్క వంశావళిలో, మరియు యేసు యొక్క జననమును గూర్చి గబ్రియేలు దూత మరియకు చేసిన ప్రకటనలో చూస్తాము. లూకా 1:31-33లో గబ్రియేలు మరియతో పలికిన మాటలను వినండి:

> ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను (లూకా 1:31-33).

ఆయన ప్రజల మీద రాజుగా ఉండుటకు తాను యేసును యేర్పరచుకున్నానని దేవుడు స్పష్టము చేశాడు.

రాజుకు ఉండవలసిన రెండవ అర్హత, అతడు ఇశ్రాయేలీయుడైయుండాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

### ఇశ్రాయేలీయుడు

యేసు ఇశ్రాయేలీయుల కుటుంబములో జన్మించాడు కాబట్టి ఈ అర్హతను ఆయన నెరవేర్చాడు అని చెప్పవలసిన అవసరం లేదు. కన్య మరియ గర్భములో అద్భుతమైన నరావతారము ఆయన జననమును అసాధారణమైనదిగా చేసింది. అయినను ఆయన యోసేపు మరియకు చట్టబద్ధమైన కుమారుడైయున్నాడు, మరియు ఇశ్రాయేలు నిబంధనా సమాజములో సంపూర్ణ సభ్యుడైయున్నాడు. మత్తయి 1 మరియు లూకా 3లో ఉన్న యేసు యొక్క వంశావళులు దీనిని నిర్ధారించాయి, మరియు రోమా 9:5లో యేసు యొక్క ఇశ్రాయేలీ వారసత్వమును గూర్చి నివేదించబడింది.

సమాధానమును మరియు ఐశ్వర్యమును సంపాదించుటకు రాజు మానవ ప్రణాళికల మీద గాక దేవుని మీద ఆధారపడాలి అనునది పాత నిబంధనలో ఇవ్వబడిన మూడవ అర్హత.

### దేవుని మీద ఆధారపడుట

తన ప్రజల మధ్య భద్రతను మరియు ఐశ్వర్యమును స్థాపించుటకు యేసు దేవుని శక్తి మీద ఆధారపడ్డాడు కాబట్టి ఆయన ఈ అర్హతను నెరవేర్చాడు. హేరోదు లేక పిలాతుతో, లేక ఏ ఇతర మానవ ప్రభుత్వముతో కూడా ఆయన కూటమిని యేర్పరచుటకు ప్రయత్నించలేదు. బదులుగా, తన రాజ్యమును స్థాపించుటకు మరియు కొనసాగించుటకు ఆయన దేవుని అధికారము మరియు శక్తి మీద ఆధారపడ్డాడు, దీనిని మనము యోహాను 13:3, మరియు 19:10-11 వంటి లేఖనభాగములలో చూస్తాము.

దేవుని నిబంధనా ధర్మశాస్త్రముతో తాను కలిగియుండిన అనుబంధం ద్వారా యేసు దేవుని పట్ల నిబంధనా నమ్మకత్వమును కనుపరచాడు అనునది రాజు కొరకు నాల్గవ పాత నిబంధన అర్హత అయ్యున్నది.

### నిబంధనా నమ్మకత్వము

దేవుని ధర్మశాస్త్రము పట్ల యేసు చూపిన నమ్మకత్వమును అనేక విధాలుగా చూడవచ్చు, కాని దాని యొక్క వాస్తవిక అర్థమును ఆయన ఎత్తిపట్టిన విధానములో మరియు ధర్మశాస్త్రములోని సమస్తమును నెరవేర్చుట పట్ల ఆయన చూపిన సమర్పణలో దీనిని విశేషముగా చూడవచ్చు. ఉదాహరణకు, మత్తయి 5-7లో ఉన్న కొండ మీద ప్రసంగములో, ధర్మశాస్త్ర బోధకులు బోధించిన మౌఖిక బోధలకు భిన్నముగా, ధర్మశాస్త్రములో వ్రాయబడియున్న వాటి యొక్క వాస్తవిక అర్థమును యేసు మరలా మరలా ఉద్ఘాటించాడు. దీనికి తోడు, ధర్మశాస్త్రములోని ప్రతి పొల్లును కూడా నెరవేర్చుటకే తాను వచ్చాడని ఆయన ప్రత్యేకముగా సెలవిచ్చాడు. మత్తయి 5:17-18లో ఆయన చెప్పిన మాటలను వినండి:

> ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను (మత్తయి 5:17-18).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అపొస్తలుడైన పౌలు ఇదే ఆలోచనను రోమా 8:3-4లో వ్యక్తపరచాడు, కేవలం ఆయన కొరకు మాత్రమేగాక, మనందరి కొరకు కూడా యేసు ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చాడని ఆయన సెలవిచ్చాడు.

> ధర్మశాస్త్రము మనలను క్రీస్తు వైపుకు చూచునట్లు చేయు, ఆయన యొద్దకు నడిపించి, ఆయన కొరకు సిద్ధపరచు ఒక విద్యాలయ అధ్యాపకుని పోలియున్నది అని బైబిలు సెలవిస్తుంది. ధర్మశాస్త్రము ఇవ్వబడినది మరియు అది దేవుని స్వభావమునకు ప్రతిబింబముగా ఉన్నది. కాని మనము ధర్మశాస్త్రమును పాటించుటలో విఫలమవుతాము. కాబట్టి యేసు వచ్చినప్పుడు దాని యొక్క వాస్తవిక ఉద్దేశమును నెరవేర్చుట ద్వారా మనకు పూర్ణమైన మానవత్వమును చూపుతాడు, దేవుని ఆజ్ఞలకు నమ్మకస్తులైయుండి దేవునితో అనుబంధం కలిగియుండుటే ఆ ఉద్దేశము. కాబట్టి యేసు వస్తాడు, మనకు నిజమైన మానవత్వమును అది ఉండవలసిన విధంగా చూపుతాడు, మరియు ఆ ధర్మశాస్త్రమును మన కొరకు నెరవేర్చుతాడు కూడా. నిబంధనను పాటించుటలో, ధర్మశాస్త్రమును-అనుసరించు స్వభావములో కొనసాగు నమ్మకత్వమును కనుపరచుట ద్వారా యేసు ధర్మశాస్త్రమును నెరవేర్చుతాడు. తద్వారా ఆయన మన నీతి అవుతాడు. దేవుడు నీతిగలవాడు మరియు నీతిమంతులుగా తీర్చువాడు కూడా అని బైబిలు సెలవిస్తుంది. కాబట్టి ఆయన తన ధర్మశాస్త్రమును మొదట నియమిస్తాడు, మరియు తరువాత తన కుమారుడు మన కొరకు ధర్మశాస్త్రమును నెరవేర్చుట ద్వారా ఆయన మరలా వస్తాడు. కాబట్టి ఆయన నీతిమంతుడైయున్నాడు, మరియు క్రీస్తులో మనలను నీతిమంతులుగా తీర్చువాడై కూడా ఉన్నాడు.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

> యేసు నిబంధన పట్ల నమ్మకత్వమును చూపాడని నొక్కి చెప్పుట చాలా ప్రాముఖ్యమైయున్నది, మరియు మనలను ఆయన పాలించుటకు ఇది ఆధారమైయున్నది. అనగా ఇది ఆదాము యొద్ద నుండి మొదలైన అనేక అంశములను ఎన్నుకొనుట అని నా అభిప్రాయం. మన శిరస్సుగా, సర్వ మానవాళి యొక్క ప్రతినిధిగా ఆదాము మిగిలిన దేవుని సృష్టముల వలె విధేయుడై, నమ్మకస్తుడై యుండవలసియుండెను. మనము సృష్టములమైయున్నాము. మనము మన రక్షకుని మాటకు విధేయులమవ్వాలి, మన జీవితములోని ప్రతి భాగములో ఆయనను సేవించాలి, ఆయనకు విధేయులమవ్వాలి మరియు ఆయనను ప్రేమించాలి. తాను చూపిన అవిధేయత ద్వారా, అతడు పాపమును, మరణమును మరియు తీర్పును కొనితెచ్చాడు. ఇది తిరగరాయబడుటకు ఏకైక మార్గము ఏమనగా, దేవుడు మన కొరకు ఒక పరిష్కారమును సిద్ధపరచాలి మరియు అది కూడా మరొక ఆదాము ద్వారా, మరొక మానవుని ద్వారా జరగాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> కాబట్టి ప్రవక్తలు, యాజకులు మరియు రాజులు “ఆదాము వంటి వానిని దేవుడు అనుగ్రహిస్తాడు” అని బలముగా ఉద్ఘాటించారు, మరియు దీనికి నెరవేర్పుగా తుదకు మనము సువార్తలలో చూచునట్లు దేవుని చిత్తమును నెరవేర్చుటకు మన ప్రభువైన యేసు క్రీస్తు వచ్చాడు. ఆయన విధేయుడగుటకు వచ్చాడు. ఆయన స్త్రీ ద్వారా జన్మించాడని, ధర్మశాస్త్రమునకు లోబడి జన్మించాడని, ధర్మశాస్త్రమంతటిని నెరవేర్చుటకు జన్మించాడని గలతీ. 4 సెలవిస్తుంది. అయితే, ఇది ఎందుకు అవసరమైయుండెను? ఎందుకంటే ఆయన ఆదాము చేసిన దానిని తిరగరాయవలసియుండెను. తన విధేయత ద్వారా — దీనిని గూర్చి మనము కేవలం ఆయన జీవితము విషయములో మాత్రమే ఆలోచించము, కాని ఆయన జీవితము కూడా చాలా ప్రాముఖ్యమైయున్నది — ఆయన చూపిన విధేయత ద్వారా, కొన్నిసార్లు దీనిని మనము “విధేయతా కార్యము” అని పిలుస్తాము, మన కొరకు ధర్మశాస్త్రము యొక్క షరతులనన్నిటిని ఆయన నెరవేర్చాడు. తన విధేయత ద్వారా, ఫిలిప్పీ. 2 ప్రకారం సర్వోన్నతముగా తన మరణములో, ఆయన సిలువ మరణము వరకు కూడా విధేయుడైయ్యాడు. ఆ కార్యము ద్వారా, మన రాజు, మన యాజకునిగా ఆయన చూపిన విధేయత ద్వారా, ఆయన దేవుని కుడిపార్శ్వమునకు ఎత్తబడ్డాడు. అంటే ఆయన ఇంతకు ముందు రాజు మరియు ప్రభువు కాదు అని అర్థము కాదు. కుమారుడైన దేవునిగా ఆయన ఎల్లప్పుడు రాజు మరియు ప్రభువై యున్నాడు. అయినను, తాను చేసిన కార్యము ద్వారా ఆయన నరావతారియైన కుమారుడైన దేవుడు, మరియు ఆయన తన మానవత్వము ద్వారా విధేయత చూపాలి, నమ్మకత్వము చూపాలి, మరియు మన కొరకు రక్షణను సంపాదించుటకు మన పక్షమున ఆయన దీనిని చేయాలి. తండ్రికి సంపూర్ణ విధేయత మరియు నమ్మకత్వము చూపకుండా ఈ రాజత్వ కార్యములో, మెస్సీయ కార్యములో ఆయన రాజుల రాజు మరియు ప్రభువుల ప్రభువైయుండలేడు.
>
> — డా. స్టీఫెన్ వెల్లమ్

యేసు నెరవేర్చిన ఐదవ పాత నిబంధన అర్హత ఏమనగా, ఆయన దావీదు కుమారుడైయుండుట.

## దావీదు కుమారుడు

దేవుడు దావీదుతో చేసిన నిబంధన ఇశ్రాయేలు యొక్క శాశ్వత రాజ వంశముగా దావీదు సంతతివారిని స్థాపించింది. కాబట్టి, దావీదు వారసులు మాత్రమే ఇశ్రాయేలు యొక్క రాజత్వమునకు చట్టబద్ధమైన దావాదారులైయుండగలరు. దావీదు కుటుంబములో యేసు యొక్క సభ్యత్వం లేఖనములో అనేక చోట్ల స్పష్టముగా బోధించబడింది. మత్తయి 1:1-25, రోమా. 1:1-3, ప్రకటన 5:5 మరియు 22:16 వంటి చోట్ల దీనిని మనము చూడవచ్చు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

రాజత్వము కొరకు యేసు యొక్క అర్హతలను మనము చూశాము కాబట్టి, ఇప్పుడు రాజ పరిచర్య కార్యమును యేసు ఎలా నెరవేర్చాడో చూద్దాము.

## కార్యములు

ఈ పాఠంలో ఇంతకు ముందు, దేవుని తరుపున ఆయన యొక్క సామంత దేశము మీద నమ్మకమైన పరిపాలన చేయుట, ముఖ్యముగా దేవుని ధర్మశాస్త్రమును అమలు చేయుట రాజు చేయవలసిన ముఖ్యమైన పని అని మనము చెప్పాము. ఇప్పుడు, యేసు భూలోక పరిచర్యలో తన పనిని పూర్తి చేయలేదు అని క్రైస్తవులంతా గుర్తిస్తారు. వాస్తవానికి, యేసు ఇప్పటికీ పరలోకము నుండి సంఘములో తన పనిని కొనసాగించుచున్నాడు. తన పనిని ముగించుటకు ఆయన మరలా తిరిగివస్తాడు. ఆయన నిజముగా క్రీస్తు అని, తన రాజ్యమును పునరుద్ధరించుటకు దేవుడు పంపిన దావీదు రాజు అని మనము ఆనందించుటకు ఆయన ఎంతో చేశాడు.

ఈ స్థానము కొరకు పాత నిబంధన నేపథ్యమును గమనించినప్పుడు మనము ఉపయోగించిన విభాగములను ఉపయోగిస్తూనే రాజుగా యేసు యొక్క కార్యములను చూద్దాము. మొదటిగా యేసు న్యాయమును అమలు చేసిన విధానమును చూద్దాము.

### న్యాయము

మన పాత నిబంధన భాగము వలెనె, న్యాయము అను అంశమును కూడా మనము రెండు భాగములలో చూద్దాము, అంతర్జాతీయ న్యాయముతో ఆరంభిద్దాము. తన భూలోక పరిచర్యలో చాలా వరకు, యేసు స్వయంగా ఏ మానవ ప్రభుత్వములలో సూటిగా పాలుపంచుకోలేదు. కాని సాతాను మరియు వాని దయ్యముల రాజ్యముతో మాత్రము ఆయన యుద్ధము చేసి, తన ప్రజలను పాపపు దాసత్వము నుండి విడిపించుట ద్వారా న్యాయమును జరిగించాడు. లూకా 11:14-20 మరియు ఎఫెసీ. 2:2 వంటి చోట్ల లేఖనము దీనిని దేవుని రాజ్యము మరియు సాతాను రాజ్యమునకు మధ్య జరుగు ఆత్మీయ యుద్ధముగా వర్ణిస్తుంది. కాబట్టి, యుద్ధము ద్వారా అంతర్జాతీయ న్యాయమును జరిగించిన పాత నిబంధన రాజుల విధానములతో దీనిని పోల్చుట సమంజసమే. మత్తయి 12:28లో యేసు ఇలా సెలవిచ్చాడు:

> దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీయొద్దకు వచ్చియున్నది (మత్తయి 12:28).

ఈ వచనములో, తాను దయ్యములను వెళ్ళగొట్టుట సాతాను రాజ్యమునకు విరోధముగా యుద్ధములో తాను దేవుని రాజ్యమునకు నాయకత్వము వహిస్తున్నాడనుటకు రుజువైయున్నది అని యేసు సూచించాడు.

ఇతర రాజ్యములతో శాంతియుతమైన మంతనాలు జరుపుట ద్వారా పాత నిబంధన రాజులు కూడా అంతర్జాతీయ న్యాయమును జరిగించారు. యేసు దీనిని తరచుగా చేయనప్పటికీ, మత్తయి 2లో తన కొరకు బహుమతులు తెచ్చిన తూర్పు దేశపు జ్ఞానుల యొక్క శాంతియుతమైన నివాళిని ఆయన స్వీకరించాడు. ఈ జ్ఞానులు అన్య దేశములకు ప్రతినిధులుగా ఉన్నారు, మరియు తమ దేశములకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇశ్రాయేలులో నూతనముగా జన్మించిన రాజుకు మధ్య సత్సంబంధాలను ఆరంభించుట వారి ముఖ్య ఉద్దేశమైయుండెను.

అంతర్జాతీయముగా న్యాయమును జరిగించుటతో పాటుగా, యేసు ఇశ్రాయేలులో జాతీయముగా కూడా దేవుని న్యాయమును జరిగించాడు. ఇతర మానవ రాజుల వలె, యేసు సాధారణంగా వ్యక్తిగత వాదములలో పాలుపంచుకునేవాడు కాదు. బదులుగా, ఆయన వాటిని క్రింద న్యాయాలయములకు మరియు మధ్యవర్తులకు విడిచిపెట్టేశాడు. అయితే తమ ప్రజల మధ్య మాత్రం ఆయన తరచుగా న్యాయమును జరిగించాడు. మత్తయి 5:25-26, 12:15-21; లూకా 18:7-8 వంటి చోట్ల దీనిని మనము చూస్తాము. తాను తీర్పు తీర్చుటకు తిరిగివచ్చునప్పుడు జీతమిచ్చుటకు తాను మంచి చెడుల లెక్కను వ్రాయుచున్నానని యేసు నిశ్చయతతో తెలిపాడు. ఆయన రాజత్వ పాత్రలోని ఈ అంశము మత్తయి 10:15, 11:22-24, మరియు 12:36 వంటి లేఖన భాగములలో స్పష్టముగా కనిపిస్తుంది, అక్కడ ఆయన భవిష్యత్తులో సంభవించు శిక్షలను గూర్చి మాట్లడుచున్నాడు. దీనిని మనము యోహాను 5:22 వంటి చోట్ల కూడా చూస్తాము, అక్కడ ఆ శిక్షను విధించువాడు ఆయనేనని సూచించుచున్నాడు.

న్యాయమును జరిగించుటతో పాటుగా, దేవుని ధర్మశాస్త్రమును కనికరముతో అనువర్తించుట ద్వారా యేసు రాజు యొక్క పాత్రను నెరవేర్చాడు.

## కనికరము

తన సృష్టముల పట్ల దేవుడు కలిగియున్న దయను అనుకరించుట ద్వారా యేసు రాజరిక కనికరమును కనుపరచాడు. ప్రజలు పాపము చేసినప్పుడు ఆయన దీర్ఘశాంతమును చూపాడు. ఆయన వారి బలహీనతలను అర్థము చేసుకున్నాడు. ఆయన వారి కొరకు సమకూర్చాడు. మరియు వారికి దుఃఖము నుండి ఉపశమనమును కలిగించాడు.

> ఒక రాజును గూర్చి మనము ఆలోచన చేయునప్పుడు, మన సామాన్య రాజత్వ మానవ చరిత్రలో, మనము సంపూర్ణ అధికారము ఉన్న ఒక వ్యక్తిని గూర్చి ఆలోచన చేస్తాము. వారు గదిలోనికి ప్రవేశించినప్పుడు ప్రజలు సాష్టాంగ పడి వారికి నచ్చింది చేస్తారు, అనగా రాజు కోరింది చేస్తారు. కాని యేసు యొక్క రాజత్వము, ఆయన జీవితములో మిగిలిన విషయములన్నిటి వలె సర్వలోకమును తల్లకిందులు చేసింది. నేను యోహానులోని ఆ మొదటి అధ్యాయమును గూర్చి ఆలోచన చేయుచున్నాను, అక్కడ అది సృష్టికర్త, లోకమును సృజించినవాడు, అను అంశమును ఉపయోగిస్తుంది. “ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు,” అని అది సెలవిస్తుంది. యేసు రాజు అని నేను నమ్ముచున్నాను, అవును నమ్ముచున్నాను, అలాంటప్పుడు ఇలాంటి ఒక వచనమును నా ముందు ఉంచితే, ఎటువంటి రాజు తాను సృష్టించిన లోకములోనికి వచ్చి తాను తిరస్కరించబడుటకు ఒప్పుకుంటాడు? అని కొందరు అంటారు. కాబట్టి కనికరమును చూపుట ద్వారా ప్రభువు మనలను చూసి జాలి పడుట మాత్రమే కాదు, అవును ఆయన జాలి పడతాడు కూడా, కాని ఆయన దేవుని యొక్క అంతరంగ జీవితమును గూర్చి ఏదో బయలుపరచుటకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రయత్నించుచున్నాడని నా ఆలోచన. కనికరమును త్రియేక జీవితముతో అనుబంధపరచాలి. మరియు త్రిత్వము, నా ఆలోచన ప్రకారం నిత్యత్వం నుండి, స్వయంగా రాజు, తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ, సర్వ లోకమునకు రాజు, త్రియేక దేవుడు ఒకరి కొరకు మరొకరిని ఇచ్చుచున్నారు, తండ్రి కుమారునికి, కుమారుడు తండ్రికి, ఆత్మ మిగిలిన ఇరువురికి స్వయం-సమర్పణ చేయుచున్నారు. కాబట్టి యేసు పాపములకు కనికరమును చూపుటకు వచ్చినప్పుడు, ఆయన ఆ స్వయం-సమర్పణ ప్రేమను వ్యక్తపరచుచున్నాడు, అది రాజు యొక్క స్వయం-ప్రత్యక్షత. ఆయన న్యాయాధిపతిగా ఉంటాడు. ఆయనను ప్రేమించని వారిని ఆయన తుదకు శిక్షిస్తాడు. కాని ఆయన భూమి మీదికి వచ్చినప్పుడు మాత్రం, వేధించబడు ప్రజల కొరకు ఆయన వస్తున్నాడు, అన్ని విధములైన అబద్ధ అధికారములు మరియు దయ్యము చేత పట్టబడిన వారి కొరకు ఆయన వస్తున్నాడు, మరియు ఈ రాజు వచ్చి అంటాడు కదా, నేను మీ దగ్గర నుండి ఏమియు కోరుట లేదు. మొదటిగా, నేను వచ్చి నన్ను నేను మీకు అప్పగించుకుంటాను. కాబట్టి ఆయన చేయు కనికర కార్యములన్నీ లోకములో తమను తాము సమర్పించుకొను త్రియేక దేవుని హృదయ కార్యములు. అయితే మన రాజు ఈ విధముగానే పని చేస్తాడు. ఆయన ఏమియు కోరకుండా వస్తాడు. ఆయన స్వయం-సమర్పణ కలిగివస్తాడు. మరియు దేవుని హృదయములో, యేసు వెళ్లిన ప్రతి చోట ప్రజలకు అర్పించిన నరావతారములో ఆరంభమయ్యే స్వయం-సమర్పణ ప్రేమకు కనికరము ఒక అద్భుతమైన వ్యక్తీకరణము అని నా ఆలోచన, అవును, దాని యొక్క ఉన్నత శ్రేణి సిలువలో కనిపిస్తుంది, అది మన కొరకు ఆయన చూపిన కనికరము, రక్షణ కొరకు దేవుని యొక్క కనికరమును మనము పొందునట్లు తన జీవితమును ధారపోసిన రాజు ఆయన. కాబట్టి ఆయన మాత్రమే నిజమైన కనికరముగల రాజు, మరియు ఆయన కనికరమును తన రాజత్వములో వర్ణిస్తాడు.

— డా. బిల్ ఉరి

ఆయన కనికరసంపన్నుడు గనుక యేసు వచ్చి కనికరమును చూపుతాడు. అయితే, ఇప్పుడు నేను ఆయన పలికిన ధన్యవచనములను గూర్చి ఆలోచించుచున్నాను. వాటిలో కొన్ని నా మీద బలమైన ప్రభావం చూపుతాయి. రెండవ ధన్యవచనమును వినండి: దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. అనగా దేవుని హృదయమును కలవరపరచు విషయముల ద్వారా తమ హృదయములను కలవరపరచుకొనువారు ధన్యులు అని దీని అర్థము. కాబట్టి దేవుడు మానవ శరీరమును ధరించుకొని ఇక్కడికి వచ్చినప్పుడు, ఆయన లోకమంతా చూచి ఆయనను దుఃఖపరచు విషయములను చూస్తాడు. కేవలం దుఃఖించుటకు బదులుగా, ఆయన అంటాడు, నేను కేవలం కన్నీరు

> కార్చుట మాత్రమే కాదుగాని, ఆ పరిస్థితులను నేను కనికరముతో స్వీకరిస్తాను. గ్రీకు క్రొత్త నిబంధనలో కనికరము అను పదమునకు అర్థము ఒకని స్థానమును తీసుకొనుట అని బార్క్లే సూచించుట ఆసక్తికరముగా ఉంది. కాబట్టి కనికరము అనగా ఎదుటవాని యొక్క భావనను నా జీవితములో జరుగుచున్నట్లు నేను అనుభవించగలను. నేను దానిని అనుభవించుట లేదు కాబట్టి సంతోషించుచున్నాను అని చెప్పుటకు బదులుగా, నేను దానిని అనుభవిస్తాను అని చెప్పుట జరుగుతుంది. నేను వాటిని ఎదుర్కొంటాను, మరియు ఈ సమయములో ఈ క్షణములో నేను వారి కొరకు ఏమి చెయ్యాలని తండ్రియైన దేవుడు కోరుచున్నాడని నేను నమ్ముచున్నానో దానిని నేను చేస్తాను.
>
> — డా. మ్యాట్ ఫ్రీడెమాన్

యేసు తన కనికరమును కనుపరచిన రెండు మార్గములను మనము చూద్దాము, అంతర్జాతీయ స్థాయితో ఆరంభించుదాము. అంతర్జాతీయ స్థాయిలో, రాజు దేశములకు మరియు దేవునికి సమర్పించుకున్న ప్రజలకు కనికరమును అనువర్తించవలసియున్నది. మరియు యేసు దీనిని అనేక విధాలుగా చేశాడు. ఒక వైపు, ఇశ్రాయేలు దేశమునకు వెలుపల ఉన్న అనేకమంది అన్యులకు ఆయన అద్భుతమైన స్వస్థతను అందించాడు. ఉదాహరణకు, మత్తయి 15:28లో ఆయన కనానీయురాలి కుమార్తెను స్వస్థపరచాడు. మత్తయి 8:13లో రోమా శతాధిపతి యొక్క దాసుని ఆయన స్వస్థపరచాడు. మార్కు 5:1-20లో, దెకపొలి అను అన్య ప్రాంతములో ఉన్న సేనా దయ్యములు పట్టిన వ్యక్తిని ఆయన బాగుచేశాడు.

అంతేగాక, యేసు తూరు, సిదోను, దెకపొలితో సహా అనేక అన్య ప్రాంతములలో కూడా పరిచర్య చేశాడు, తద్వారా లూకా 2:32లో సుమెయోను ప్రవచించినట్లు, ఆయన సందేశము మరియు కార్యములు అన్యజనులకు ప్రత్యక్షతా వెలుగు అయ్యాయి.

కాని ఆయన చూపిన అంతర్జాతీయ కనికరము కంటే ఎక్కువగా యేసు జాతీయ స్థాయిలో చూపిన రాజరిక కనికరము మరింత స్పష్టముగా ఉన్నది. రాజుగా, దేవుడు వ్యవహరించిన విధముగా దేవుని ప్రజలతో వ్యవహరించవలసిన బాధ్యత యేసుకు ఇవ్వబడింది. అనగా వారికి కనికరమును చూపుట. ఒక ఆదర్శవంతమైన రాజు దయ చూపు దేవుని పద్ధతిని ప్రతిబింబించు కరుణాసంపన్నుడు. వారి రాజుగా యేసు ఇశ్రాయేలు మీద అమోఘమైన కనికరమును చూపాడు. వారిని హెచ్చరిస్తూ మరియు వారికి బోధిస్తూ ఆయన అనేక సంవత్సరములను సహనంతో గడిపాడు. ఆయన లెక్కలేనన్ని ఆశ్చర్య కార్యములను చేశాడు — వారి రోగములను స్వస్థపరచాడు, దయ్యములను వెళ్లగొట్టాడు, ఆకలిగొనిన వారికి ఆహారము సమకూర్చాడు, మరియు మృతులను కూడా లేపాడు.

అయితే ఆయన రాజరిక కనికరమును ఉత్తమమైన రీతిలో పక్షవాయువు గలవానిని స్వస్థపరచిన ఆశ్చర్యకార్యము బయలుపరుస్తుంది, ఇది మత్తయి 9:1-7, మార్కు 2:1-11, మరియు లూకా 5:17-25లలో నివేదించబడింది. ఆ సందర్భములో, యేసు ఆ వ్యక్తి యొక్క పక్షవాతమును స్వస్థపరచుట మాత్రమే కాదుగాని, అతని పాపములను కూడా క్షమించాడు. మరియు ఆయన ఇలాంటి అద్భుతమునే

లూకా 7:36-50లో కూడా చేశాడు, అక్కడ ఆయన తన పాదములను సుగంధ ద్రవ్యముతో అభిషేకించిన స్త్రీ యొక్క పాపములను క్షమించాడు.

> ఈ ప్రశ్నకు సరైన జవాబును ఇచ్చుట చాలా ప్రాముఖ్యము: దేవుడు మాత్రమే పాపములను ఎందుకు క్షమించగలడు? ఆయనకు విరోధముగానే మనము పాపము చేశాము కాబట్టి, అనునది దీనికి బైబిలు ఇచ్చు జవాబు. ఆయన ప్రభువైయున్నాడు. ఆయన సృష్టికర్తైయున్నాడు. మనలను సృజించినది ఆయనే. మనము కలిగియున్న సమస్తము ఆయన ఇచ్చినదే. మరియు మనము చేయు పాపము అన్నిటి కంటే ముందు మరియు అన్నిటి కంటే ఎక్కువగా ఆయనకు విరోధముగానే. ఇప్పుడు, ఒకరికొకరి మీద కూడా పాపము యొక్క పరిణామాలు ఉంటాయి. పాపము యొక్క పరిణామాలు లోకము మీద కూడా ఉంటాయి. అయితే అన్నిటి కంటే ఎక్కువగా దేవుని యొక్క ప్రతిరూపములుగా మన అనుబంధములో, ఆయనపై మనము చేయు తిరుగుబాటు ఆయనకు విరోధముగా చేయు పాపమవుతుంది. ఆయన మాత్రమే పాపములను క్షమించగలడు. 51వ కీర్తనను గూర్చి ఆలోచన చెయ్యండి, "నీకు కేవలము నీకు విరోధముగా నేను పాపము చేసియున్నాను" అని దావీదు అంటున్నాడు. దావీదు జీవితమును గూర్చి ఆలోచన చెయ్యండి, అతడు అనేక మంది ప్రజలకు విరోధముగా పాపము చేశాడు. అతడు దేశమును ప్రభావితము చేశాడు; అతడు ఊరియాను ప్రభావితము చేశాడు; అతడు బత్షెబను ప్రభావితము చేశాడు; అతడు తన కుమారుని ప్రభావితము చేశాడు. కాని తుదకు అతడు దేవునికి విరోధముగా పాపము చేశాడని దావీదు సరిగానే గ్రహించాడు. మన సమస్య, మరియు ప్రజలు గుర్తించలేని మానవ సమస్య ఏమిటంటే, దేవుడు మాత్రమే క్షమించగలడు. దేవుడు మాత్రమే పాపమను సమస్యను పరిష్కరించగలడు.
>
> — డా. స్టీఫెన్ వెల్లమ్

> నేను ఒకనికి విరోధముగా పాపము చేసినప్పుడు లేక ఒకరు నాకు విరోధముగా పాపము చేసినప్పుడు, క్షమాపణ కొరకు విన్నపము చేయబడి పొందుకున్నప్పుడు, మానవుల మధ్య ఏమి జరుగుతుంది అంటే, ఒక పక్షము అంటుంది కదా, "నీవు చేసిన తప్పిదము మన బంధమునకు హాని కలిగించుటకు నేను అనుమతించను," ఇది చాలా ప్రాముఖ్యమైనది, మనము దేవుని ద్వారా క్షమించబడితిమి అను విషయమును గూర్చిన మన అవగాహనను ప్రతిబింబించుటకు దీనిని మనము ఒకరికొరకు ఒకరము చేయాలి. కాని దేవుడు క్షమించినప్పుడు, నా అపరాధము యొక్క అప్పును ఆయన పూర్తిగా కొట్టివేస్తాడు, మరియు నేను అలా ఎవ్వరికి చేయలేను మరియు ఎవ్వరు నా కొరకు అలా చేయలేరు. కాబట్టి నా అపరాధము యొక్క అరవు అంతా కొట్టివేయబడు

> విధముగా దేవుడు క్షమిస్తాడు. ఇది దైవిక క్షమాపణ, మరియు ఇది చాలా ఆసక్తికరమైన విషయము, మార్కు 2లో యేసు పక్షవాయువు గలవానిని స్వస్థపరచిన ఒక ఉదాహరణను చూడండి, "నా కుమారుడా, నీ పాపములు క్షమించబడినవి" అని ఆయన అంటాడు. అక్కడ శాస్త్రులు కూర్చొని దీనిని వినుచున్నారు, మరియు తమ హృదయాలలో నిశబ్దముగా ఈ విధముగా ఆలోచన చేయుచున్నారు, "పాపములు దేవుడు తప్ప ఎవ్వరు క్షమించలేరు కదా, పాపములు క్షమించబడినవని చెబుతున్న ఈ వ్యక్తి ఎవరు," ఇది సరైన ఆలోచనే అనిపిస్తుంది. కేవలం దేవుడు మాత్రమే క్షమించు విధముగా ఈ వ్యక్తిని క్షమించుచున్నాను అని యేసు చెప్పిన మాటను విని, వారు కలత చెందారు; ఆయన దైవదూషణ చేయుచున్నాడని వారు అనుకున్నారు. అనగా వారు ఆయన మాటలను సరిగానే విన్నారు గాని తప్పుగా స్పందించారు. యేసు యొక్క దైవత్వమునకు సువార్తలలో లభ్యమవ్వు ఆకర్షణీయమైన రుజువులలో ఇది ఒకటి. అనగా తన సొంత-అవగాహనలో, తన సొంత-ప్రకటనలో, ఆయన పాపములను క్షమించినట్లు ప్రకటించుచున్నాడు, కేవలం అనుబంధములోని తప్పిదములను తొలగించుట మాత్రమే కాదు — ఆయన ఇంతకు ముందు ఈ పక్షవాయువు గలవానిని చూసియుండడు — కాని దేవుడు మాత్రమే చేయు విధముగా అపరాధ భారము కొట్టివేయబడునట్లు ఆయన పాపములను క్షమించుచున్నాడు.
>
> — డా. రోబ్ లిస్టర్

ప్రతి పాపము నీతికి ఉన్నత స్థాయియైన దేవునికి విరోధముగా చేయు అపరాధము మరియు తప్పిదమైయున్నది. అంతేగాక, దేవుడు మాత్రమే ఉన్నతమైన రాజు మరియు అంతిమ న్యాయాధిపతియైయున్నాడు కాబట్టి, తనకు విరోధముగా చేసిన పాపములను క్షమించు అంతిమ అధికారము ఆయనకు మాత్రమే ఉన్నది. ఈ స్థాయిలో కనికరమును చూపగల అధికారము ఆయనకు మాత్రమే ఉన్నది. అయితే యేసు దేవుని యొక్క పరిపూర్ణమైన నీతిగల సామంత రాజైయున్నాడు కాబట్టి, క్షమాపణను అనుగ్రహించు అధికారమును దేవుడు ఆయనకు ఇచ్చాడు, తద్వారా యేసు కూడా దేవుని కనికరమును ప్రజలకు అనువర్తించవచ్చు.

యేసు రాజు బాధ్యతను నెరవేర్చిన మూడవ విధానము ఏమనగా, దేవుని పట్ల నమ్మకత్వమును ప్రచురపరచిన విధముగా దేవుని ధర్మశాస్త్రమును అమలు చేయుట.

## నమ్మకత్వము

న్యాయము మరియు కనికరములో మనము చూసిన విధముగానే, యేసు నమ్మకత్వమును ప్రచురపరచిన విధానమును రెండు భాగములలో చూద్దాము, అంతర్జాతీయ స్థాయితో ఆరంభిద్దాము. దేవుని రాజ్యమును అన్య దేశములకు ప్రకటించుట ద్వారా దేవుని పట్ల హృదయపూర్వకమైన ఆరాధన మరియు విధేయతను యేసు సూటిగా ప్రచురపరచాడు. దీనిని మనము మత్తయి 4:13-25, 24:14, లూకా 24:47, మరియు ముఖ్యముగా యేసు తన శిష్యులకు గొప్ప ఆజ్ఞను ఇచ్చినప్పుడు మత్తయి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

28:18-20 మరియు అపొ. 1:8లో చూస్తాము. ఈ రెండు ఆజ్ఞలలోను, సర్వ జనులను శిష్యులనుగా చేసి, భూదిగంతముల వరకు సాక్ష్యులైయుండమని యేసు తన అనుచరులకు ఆజ్ఞ ఇచ్చాడు.

అవును, యేసు నమ్మకత్వమును జాతీయ స్థాయిలో కూడా ప్రచురపరచాడు. అన్యుల మధ్య ఆయన చేసిన అంతర్జాతీయ కార్యము వలెనె, ముఖ్యముగా సువార్తను ప్రకటించుట ద్వారా యేసు నమ్మకత్వమును ఇశ్రాయేలు దేశములో ప్రచురపరచాడు. ఆయన ఒక గ్రామము నుండి మరొక గ్రామమునకు వెళ్లుచుండగా, దేవుని రాజ్యము సమీపించియున్నది కాబట్టి మారుమనస్సు పొందమని, పాపములను విడచి దేవుని నమ్మమని ఆయన ప్రజలకు ఆజ్ఞాపించాడు. మత్తయి 4:17లో యేసు బోధను మత్తయి క్రోడీకరించిన విధానమును గమనించండి:

> అప్పటినుండి యేసు పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను (మత్తయి 4:17).

ఇలాంటి క్రోడీకరణలనే మనము మార్కు 1:15, లూకా 5:32 మరియు 10:13లో కూడా చూస్తాము. మరియు ఇలాంటి ప్రసంగముల యొక్క ఉదాహరణలను సువార్తలలో అనేక చోట్ల మనము చూస్తాము.

> దేవుని పట్ల నమ్మకత్వము మీద యేసు బలమైన ఉద్ఘాటనను ఉంచాడు. నమ్మకత్వము నమ్మిక యొక్క వ్యక్తీకరణ కాబట్టి ఆయన ఇలా చేశాడు. దేవుడు నిజముగా మన నమ్మకత్వమునకు, మన నమ్మకమునకు, మన విధేయతకు, మన భక్తికి అందరి కంటే ఎక్కువ అర్హుడు అనే అవగాహన యొక్క వ్యక్తీకరణ ఇది. ఒక వైద్యుని యొక్క ఆజ్ఞలకు మీరు అవిధేయులైనప్పుడు, మీరు ఆజ్ఞలను గూర్చి మాత్రమే చెప్పుట లేదు; మీరు వైద్యుని గూర్చి ఏదో చెబుతున్నారు. మరియు మీరు దేవునికి అవిధేయులైనప్పుడు, మీరు ఉల్లంఘిస్తున్న ఆయన ఆజ్ఞలను గూర్చి మాత్రమే మీరు ఏదో చెప్పుట లేదుగాని, ఆ ఆజ్ఞలను ఇచ్చిన దేవుని గూర్చి మీరు ఏదో చెబుతున్నారు. కాబట్టి నమ్మకత్వము నమ్మిక యొక్క వ్యక్తీకరణయైయున్నది. దేవుడు ఏమైయున్నాడో చూసి, ఆయన చెప్పు వాటిని చేయు వ్యక్తీకరణ ఇది. కాబట్టి, దేవుని పట్ల నమ్మకత్వమును చూపుట విధేయతకు వ్యక్తీకరణగా ఉన్నది. ఆయన ఏమైయున్నాడో దాని పట్ల మనము చూపు అనుదిన భక్తి మరియు నమ్మికకు అది వ్యక్తీకరణయైయున్నది. పౌలు తన అపొస్తలుల పరిచర్యలో రోమా పత్రికలో క్రైస్తవ జీవితమును గూర్చి మాట్లాడుతూ అది విశ్వాసమును విధేయతలోనికి నడిపించాలని బోధించాడు. ఇది కొన్ని విధాలుగా క్రైస్తవ జీవితమును క్రోడీకరించు అద్భుతమైన వ్యక్తీకరణ. ఆయన ఏమైయున్నాడో అందును బట్టి మనము దేవుని చూస్తాము, మన విశ్వాసమును ఆయన మీద ఉంచుతాము, మరియు అది స్వాభావికముగా మనలను విధేయతలోనికి నడిపిస్తుంది. మనము నమ్ము దేవునికి మనము విధేయులమవుతాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

— డా. కే. ఎరిక్ థోయెన్స్

> ఆయనతో నడుచుట, ఆయనను దగ్గరగా తెలుసుకొనుటకు ఫలితమైన ఆనందముగా యేసు మనకు నమ్మకత్వమును అనుగ్రహించాడు. కాని అనుదినము నేను ఆయనకు స్పందించాలని ఆయన కోరుచున్నాడు. ఆయనకు విధేయునికమ్మని ఆయన నన్ను బలవంతము చేయుట లేదు. ఒక నియమమును అనుసరించమని ఆయన బలవంతము చేయుట లేదు. ఆయన అంటాడు, మీ భావనలు నేడు ఏ విధంగా ఉన్నా, నాకు ఒక నమ్మకమైన హృదయము కావాలి, ఈ లోకములో ఏమి జరుగుతుంది అని నీవు తలంచినా, మంచైనా చెడైనా, నాకు ఒక నమ్మకమైన వధువు కావాలి. నాకు నమ్మకమైన సేవకుడు కావాలి, నా ప్రియమైన నమ్మకమైన ప్రేమిక కావాలి. ఆత్మీయతకు నిర్వచనమునిచ్చుటకు లోకము వైపు చూచుటకు ప్రయత్నించు నా లాంటివారిని ఆయన ఇలానే చూస్తున్నాడని నా ఆలోచన. దీని కంటే లోతైనది ఏదియు లేదు అని ప్రభువు చెబుతున్నాడు. నాకు నమ్మకమైన హృదయము కావాలి. వివాహితులైన దంపతుల జీవితము వలెనె, ఇది నిజమైన ప్రేమకు పునాదియైయున్నది. ఏదిఏమైనా నమ్మకత్వము అంతము వరకు ఉండాలి. కాబట్టి, దేవుడు నమ్మకత్వమును కోరుచున్నాడు, అయితే తన పరిశుద్ధాత్మ సన్నిధి ద్వారా కూడా ఆయన నమ్మకత్వమును బలపరుస్తాడు.

— డా. బిల్ ఉరి

యేసు యొక్క రాజరిక అర్హతలు మరియు రాజు స్థానములో ఆయన కార్యములను ఇప్పటి వరకు చూశాము కాబట్టి, భవిష్యత్తు మెస్సీయ రాజు కొరకు పాత నిబంధన ఆకాంక్షలను ఆయన ఏ విధముగా నెరవేర్చాడో చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## ఆకాంక్షలు

ఇశ్రాయేలు చరిత్ర అంతటిలో, దాని రాజుల యొక్క బలహీనతలు మరియు పాపములు దేవుని ఎదుట తమ బాధ్యతలను నెరవేర్చకుండా వారిని నివారించాయి. దేవుని ధర్మశాస్త్రమునకు తమను తాము సమర్పించుకొని ఆయన ప్రజలను నడిపించిన నమ్మకమైన నాయకులైన మోషే, యెహోషువ మరియు దావీదు వంటి వారు కూడా దేవుడు ఆశించినదంతా చేయలేకపోయారు. వారు కొంత కాలము వరకు మాత్రమే సమాధానమును భద్రతను అందించగలిగారు. అయితే ధర్మశాస్త్రము యొక్క షరతులు వారు ఎడతెగక అనుసరించుటకు చాలా ఉన్నతమైనవయ్యాయి. దేవుడు సంతృప్తిపొందు విధముగా ధర్మశాస్త్రమును అనుసరించుట పతనమైన ఏ మానవునికైనా చాలా కష్టమవుతుంది. అంతేగాక, ఉత్తమమైన నాయకులు కూడా వయస్సు మరియు మరణము అను పరిమితులను అనుభవించారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇలాంటి సమస్యలు బైబిలులో జెకర్యా 4:6, అపొ. 13:34-39, హెబ్రీ. 4:8, మరియు రోమా. 8:3-4 వంటి అనేక చోట్ల గుర్తించబడినవి.

పాత నిబంధనలో దేవుని ప్రజలను పాలించిన రాజులు ఎన్నడు కూడా దేవుడు తన ప్రజల కొరకు దాచియుంచిన అత్యున్నతమైన ఆశీర్వాదములను పొందలేకపోయారు. వారు పొందలేకపోయారు. వారు బలహీనమైన, పతనమైన మానవులు. అయితే తన ప్రజలను విమోచించుటకు నీతిగల దావీదు కుమారుని పంపుట ద్వారా దేవుడు దావీదుతో చేసిన నిబంధనను గౌరవిస్తాడను నిరీక్షణను ఈ వైఫల్యాలు వారిలో కలిగించాయి. ఈ రాజు ప్రత్యేకముగా దేవుని ఆత్మ ద్వారా బలపరచబడతాడు కాబట్టి ఆయనలో మానవ బలహీనతల యొక్క సామాన్య పరిమితులు ఉండవు. దావీదు వంశావళి, ఇశ్రాయేలు దేశము, మరియు మానవ జాతి యొక్క మునుపటి వైఫల్యములకు విమోచకునిగా ఆయన దేవుని ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా నెరవేర్చువాడు. మరియు యేసులో దేవుడు ఖచ్చితముగా ఇలాంటి రాజునే పంపాడు. దావీదు యొక్క నీతిగల కుమారుడు, మెస్సీయయైన యేసు ద్వారా మన కొరకు మనము చేసుకోలేనిదానిని దేవుడు మానవాళి కొరకు తుదకు చేశాడు.

ఆయన రాజత్వము యొక్క నాలుగు కోణములను పరిశీలించుట ద్వారా యేసు ఈ పాత నిబంధన ఆకాంక్షలను నెరవేర్చిన విధానమును చూద్దాము. మొదటిగా, యేసు దావీదు రాజవంశమును పునరుద్ధరించాడు అని చూద్దాము. రెండవదిగా, ఆయన తన ప్రజలకు ఇచ్చిన స్వాతంత్ర్యమును జయమును చూద్దాము. మూడవదిగా, యేసు తెచ్చిన నిత్య రాజ్యమును పరిశీలిద్దాము. మరియు నాల్గవదిగా, రాజ్యము యొక్క సార్వత్రిక స్వభావము మీద దృష్టి పెడదాము. యేసు దావీదు రాజవంశమును పునరుద్ధరించాడు అను సత్యముతో ఆరంభిద్దాము.

## దావీదు రాజవంశము

క్రొత్త నిబంధనలో అనేక సందర్భాలలో, యేసు దావీదు రాజవంశమును పునరుద్ధరించు ప్రవచించబడిన దావీదు కుమారునిగా విశేషముగా గుర్తించబడ్డాడు. ప్రేరేపించబడిన రచయితలు ఈ సంబంధమును మత్తయి 1:1, మార్కు 3:31, మరియు రోమా. 1:3 వంటి లేఖనభాగములలో వెలికితీశారు. అపొ. 13:22-23లో అపొస్తలుడైన పౌలు దీనిని ప్రకటించాడు. మరియు యేసు స్వయంగా తానే దావీదు యొక్క మెస్సీయ కుమారుడనని మత్తయి 21:15-16, ప్రకటన 3:7 మరియు 22:16లో ప్రకటించాడు. యేసు నిజముగా ప్రవచించబడిన దావీదు కుమారుడని, సృష్టియావత్తు కొరకు దేవుని రాజ్య ఉద్దేశములను నెరవేర్చు భవిష్యత్ మెస్సీయ రాజు అని ఈ రుజువు కనుపరుస్తుంది.

దావీదు సింహాసనమునకు వారసునిగా, ఇశ్రాయేలు దేశములోని నమ్మకమైన శేషమును, అనగా నమ్మకమైన అపొస్తలులు మరియు శిష్యులను పునరుద్ధరించుట ద్వారా యేసు మొదటిగా దేవుని రాజ్య ఉద్దేశములను నెరవేర్చుట ఆరంభించాడు. తరువాత, మత్తయి 28:19-20లో యేసు ఆజ్ఞాపించినట్లు, వారు వెళ్ళగలిగిన దేశములన్నిటికీ వెళ్లి యూదులకు మరియు అన్యజనులకు సువార్త ప్రకటించి శిష్యులను చేయుట ద్వారా ఈ అనుచరులు తమ సంఖ్యను వ్యాపింపజేశారు. మరియు వారి శిష్యులు లోకములో మరింత ముందుకు వెళ్లి ఇంకా అనేక మందిని శిష్యులను చేశారు. ఈ ప్రక్రియ అప్పటి నుండి కొనసాగుతూ ఉంది, ఫలితంగా దేవుని యొక్క భూలోక రాజ్యములో ప్రపంచములోని అధిక శాతం

జనాభా ఉన్నారు, మరియు ఇంచుమించు భూమి మీద ఉన్న ప్రతి జాతి మరియు ప్రతి దేశములో కొంత వరకు శిష్యులు ఉన్నారు.

ఆయనకు నమ్మకముగా ఉన్నవారికి స్వాతంత్ర్యమును జయమును ఇచ్చుట ద్వారా కూడా యేసు పాత నిబంధన ఆకాంక్షలను నెరవేర్చాడు.

## స్వాతంత్ర్యము మరియు జయము

యేసు భూమి మీద నివసించిన కాలములో, తన ప్రజలకు ఆత్మీయ విరోధులైన పాపము, మరణము మరియు దయ్యముల నుండి స్వాతంత్ర్యమును జయమును ఇచ్చుటకు యేసు నిర్ణయాత్మకముగా వ్యవహరించాడు. మత్తయి 1:21-23లో వ్రాయబడిన ఈ క్రింది మాటలను వినండి:

> [దేవుని దూత యోసేపుతో ఇలా అనెను] ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్తద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము (మత్తయి 1:21-23).

ఈ వాక్యభాగములో, మత్తయి యేసు యొక్క జననమును యెషయా 7:14లో ప్రస్తావించబడిన ఇమ్మానుయేలు అను బాలునితో పోల్చాడు.

యెషయా యొక్క ప్రవచనము నేపథ్యములో, ఇమ్మానుయేలు అను బాలుడు యుద్ధము చేయునప్పుడు దేవుడు తన ప్రజలతో ఉండు యుద్ధవీరుడైన రాజు అనుటకు చిహ్నముగా ఉండేది. ఆయన వారి కొరకు పోరాడి వారి విరోధులను జయిస్తాడు, మరియు యుద్ధములో జయము సంపాదించుట ద్వారా వారు ఎదుర్కొను హింస నుండి వారికి స్వాతంత్ర్యమును అనుగ్రహిస్తాడు. మరియు ఇదే యేసును ప్రత్యేకమైనవానిగా చేసింది. అందరికీ అతి గొప్ప విరోధియైన పాపముతో పోరాడి దానిని జయించుటకు దేవుడు ఉపయోగించు ప్రవచించబడిన రాజు ఆయనే. యోహాను 8:36లో కూడా మనము ఇదే అంశమును చూస్తాము, అక్కడ తాను మాత్రమే పాపము నుండి నిజమైన స్వాతంత్ర్యమును ఇవ్వగలనని యేసు సెలవిచ్చాడు.

యేసు తన ప్రజలకు మరణము మీద కూడా జయమును కలిగించాడు. దీనిని గూర్చి పౌలు రోమా. 6:4-9, మరియు 1 కొరింథీ. 15:54-57లో మాట్లాడాడు, యేసు యొక్క పునరుత్థానము మన పక్షమున పాపమును మరియు మరణమును ఓడించినదని అతడు నిశ్చయతను ఇచ్చాడు. ఇప్పుడు, ఈ భావనలో, మనము ఇప్పటికీ పాపము చేస్తాము కాబట్టి మరియు మన శరీరములు మరణిస్తాయి కాబట్టి పాపము మరియు మరణము ఇప్పటికీ మనకు సమస్యలైయున్నాయి. అయితే వీటి మీద ఇప్పటికే మనము జయమును పొందియున్నాము, ఎందుకంటే మనలను నియత్రించు మరియు శిక్షించు శక్తి వాటికి ఇక లేదు.

దయ్యముల విషయములో కూడా ఇదే నిజమైయున్నది. మన గొప్ప రాజుగా, యేసు వాటిని ఓడించాడు, మరియు మనకు జయమును అనుగ్రహించాడు. అవి ఇప్పటికి మనలను ఇబ్బందిపెడతాయి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు శోధిస్తాయి. అవి మనకు శరీరకముగా హాని కూడా కలిగించగలవు. అయితే మనలను బంధించుటకు లేక మన ప్రాణములకు హాని కలిగించుటకు వాటికి ఎలాంటి శక్తి లేదు. దయ్యముల మీద యేసు యొక్క జయమును కొలస్సీ 2:15లో పౌలు వర్ణించు విధానమును వినండి:

> ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను; ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగాచేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను (కొలస్సీ. 2:15).

యేసు తిరిగి వచ్చునప్పుడు, ఆయనను ఆయన ప్రజలను వ్యతిరేకించు ప్రతి విరోధిని ఆయన సమూలంగా ఓడిస్తాడు. కాని ఇప్పుడు కూడా, వారి యాజమాన్యము నుండి మనకు స్వాతంత్ర్యమును అనుగ్రహించుటకు మనకు అధికముగా హాని కలిగించువారికి ఆయన ప్రాధమిక తీర్పును ఇచ్చేశాడు.

రాజుల కొరకు పాత నిబంధన ఆకాంక్షలలో యేసు నెరవేర్చిన మూడవ ఆకాంక్ష ఏమనగా ఆయన నిత్య రాజ్యమును స్థాపించాడు.

## నిత్య రాజ్యము

వాగ్దానము చేయబడిన రాజు ఒక రాజ్యములోనికి నడిపిస్తాడని మరియు అది నిత్యముంటుంది అని పాత నిబంధన వాగ్దానం చేసింది. అది భూమి మీద పరలోకమైయుంటుంది, మరియు దావీదు రాజు పరిపాలనలో అది అన్ని కాలములలో ఉంటుంది. రాజుగా యేసు యొక్క పరిపాలన నిత్యము ఉంటుంది అని మత్తయి 19:28-29 మరియు 25:34, లూకా 1:33, మరియు హెబ్రీ. 1:8-13 వంటి లేఖన భాగములలో క్రొత్త నిబంధన ఉద్ఘాటిస్తుంది. అయితే ఆ రాజ్యము ఇప్పుడు ఎక్కడ ఉంది? యేసు ఈ ఆకాంక్షను నిజముగా నెరవేర్చాడా? లేక ఆయన దానిని చేయుట కొరకు ఇప్పుడు కూడా మనము ఎదురుచూచుచున్నామా?

> భూమి మీద దేవుని రాజ్యమును స్థాపించుట యేసు తన భూలోక పరిచర్యలో చేసిన ఒక కార్యమైయున్నది. ఇప్పుడు, దీని అర్థము ఏమిటంటే, దైవిక శక్తి కార్యములో, యేసు ఒక అపాయకరమైన భూభాగములో తీర ప్రాంత పరిచర్యను స్థాపించాడు, మరియు ఈ గోళమును దాని యొక్క నిజమైన సృష్టికర్త, యజమానుడు మరియు రాజు కొరకు తిరిగి సంపాదించు ఒక ఎదురుదాడిని ఆరంభించాడు. ఈ అపాయకరమైన భూభాగము మీద చేసిన ఆరంభ ఎదురుదాడి అనేక నాటకీయ విధములుగా బయలుపరచబడింది: వ్యవస్థా దుష్టత్వమును సవాలు చేయుట, దయ్యపు దుష్టత్వమును సవాలు చేయుట, వెలుగు మరియు సత్యముతో మోసమును తొలగించుట. ఇది ప్రత్యామ్నాయ అజ్ఞాధారకత్వమునకు బలమైన పరిచయముగా ఉన్నది. ఈ ఎదురుదాడి ఇప్పటికీ కొనసాగుతుంది. తుడిచిపెట్టు కార్యక్రమము, శుద్ధి చేయు కార్యక్రమము, చివరి స్థావరములను నిర్మూలము చేయు కార్యక్రమము ఇప్పుడు మిగిలియున్నది. మరియు మరణము జయించవలసిన ఆఖరి విరోధియైయున్నది. కాబట్టి, ఈ కొనసాగుచున్న రాజ్య కార్యక్రమములో ఆత్మ శక్తిలో మనము పాలుపంచుకొనుచుండగా, “నీ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

రాజ్యమొచ్చును గాక, నీ చిత్తము నెరవేర్చబడునుగాక" అని మనము ప్రార్థించుచున్నాము. ఒక అసామాన్యమైన సహకారము యొక్క అవసరతతో మనము సాధించవలసినది ఇంకా ఉంది.

— డా. గ్లెన్ స్కోర్గి

పాత నిబంధన నిరీక్షణ యొక్క నెరవేర్పులో, యేసు క్రీస్తులో దేవుని యొక్క రక్షించు నియమము ఈ లోకమునకు వచ్చింది, ఆయన మరణము, ఆయన పునరుత్థానములో అది నెరవేర్పు పొందింది, మరియు ఆయన మరణము జయమును పొందినది అని ఆయన పునరుత్థానము కనుపరచింది. పాపమునకు పరిష్కారం దొరికింది. పాపము యొక్క జీతమైన మరణము ఓడించబడింది. కేవలం పునరుత్థానములో మాత్రమే కాదు. ఆయన మహిమరకమైన ఆరోహణము — ఇప్పుడు ఆయన దేవుని కుడి పార్శ్వమందు కూర్చున్నాడు. పెంతెకొస్తు — ఆయన తన ఆత్మను కుమ్మరించాడు. ఇదంతా రాజ్యము యొక్క రాకలో భాగమైయున్నది. "రాజ్యము యొక్క ఆరంభము" అని మనము పిలుచునది ఇప్పుడు మన మధ్యలో ఉన్నది. అయినను, ఇంకా భవిష్యత్తు ఉన్నదని మన ప్రభువైన యేసు క్రీస్తు మనకు తెలియపరచాడు. మనము ఇప్పటికీ ప్రార్థించుచున్నాము. "నీ రాజ్యమొచ్చును గాక," అని మనము చేయు ప్రభువు ప్రార్థనను గూర్చి ఆలోచించండి. అవును, రాజ్యము వచ్చియున్నది. ఆయన జయించియున్నాడు. దాని ముగింపు కొరకు అది ఎదురుచూచుచున్నది.

— డా. స్టీఫెన్ వెల్లమ్

ప్రజలు అర్థము చేసుకొనుటకు, ముఖ్యముగా యూదులు అర్థము చేసుకొనుటకు అతి కష్టమైన విషయములలో ఒకటి ఏమిటంటే, మెస్సీయయైన యేసు యొక్క మొదటి మరియు రెండవ రాకడల మధ్య ఉన్న అనుబంధము. సింహములు గొర్రెపిల్లలతో కలసి విశ్రమించుట మనము చూడముకదా, అలాంటప్పుడు యేసు మెస్సీయయైయుండి మెస్సీయ ఆకాంక్షలను ఎలా నెరవేర్చాడు అని కొందరు అడుగుట సహజమే. ప్రజలు తమ ఖడ్గములను నాగటి నక్కులుగా సాగగొట్టుట మనము చూడము. మనము భూమి మీద సమాధానమును, ప్రజల పట్ల సద్భావనను చూడము. కాబట్టి మెస్సీయ ఎలా వచ్చాడు? దానిని మనము ఆరంభించబడిన రాకడ శాస్త్రము అని పిలుస్తాము. యేసు యొక్క మొదటి రాకడ ద్వారా అంత్య దినముల వాస్తవములు చరిత్రలోనికి వచ్చాయి. అవి ఆరంభించబడినవి, అవి ఆరంభించబడి నిర్ణయాత్మకముగా కొనసాగుచున్నవి, కాని వీటన్నిటి యొక్క అంతిమ ముగింపు కలుగు విధముగా ఈ వాస్తవములు కొనసాగుచున్నవి. దీనిని రాజ్యము యొక్క "ఇప్పుడు మరియు ఇంకా రాలేదు"

> అని పిలుస్తారు. రాజ్యము వచ్చియున్నది, యేసు దానిని తెచ్చియున్నాడు. ఆయన యుద్ధములో నిర్ణయాత్మకమైన ఎదురు దెబ్బ కొట్టాడు. కాని యుద్ధము ఇప్పటికీ కొనసాగుతుంది మరియు దాని యొక్క భవిష్యత్, అంతిమ నెరవేర్పు కొరకు ఎదురు చూస్తుంది.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

పరలోకములోని ఆయన సింహాసనమునకు ఆరోహణమగుటకు ముందు యేసు స్పష్టముగా తన మెస్సీయ రాజ్యమును స్థాపించాడు. దీనిని మనము మత్తయి 12:28 వంటి వాక్యభాగములలో చూస్తాము, అక్కడ దయ్యముల మీద తనకు ఇవ్వబడిన అధికారము దేవుని రాజ్యము వచ్చియున్నది అనుటకు రుజువుగా ఉన్నదని యేసు సెలవిచ్చాడు. దయ్యములను వెళ్ళగొట్టుట రాజ్యము వచ్చుచున్నది అనుటకు చిహ్నము కాదు. బదులుగా, రాజ్యము శక్తితో ఉనికిలో ఉన్నది, మరియు దాని రాజు తన విరోధులను పడగొట్టుచున్నాడు అనుటకు రుజువుగా ఉన్నది. అనేకమంది ఊహించిన విధముగా రాజ్యము దృశ్యమైన రీతిలో రాలేదు అని కొంత మంది పండితులు అభ్యంతరం చెబుతునప్పటికీ, సాంప్రదాయిక రాజకీయ అధికారము వలె దాని యొక్క భౌతిక వ్యక్తీకరణముల కొరకు చూచుట పొరపాటు అని యేసు చెప్పాడు. లూకా 17:20-21లో ఆయన పరిసయ్యులతో చెప్పినట్లు:

> ఆయన దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక, ఇదిగో యిక్కడనని, అదిగో అక్కడనని చెప్ప వీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను (లూకా 17:20-21).

చివరిగా, దావీదు రాజును గూర్చి పాత నిబంధన ఆకాంక్షలలో యేసు నెరవేర్చిన నాల్గవ ఆకాంక్ష ఏమనగా, ఆయన సార్వత్రిక రాజ్యమును స్థాపించాడు.

## సార్వత్రిక రాజ్యము

యేసు తిరిగివచ్చినప్పుడు, క్రొత్త భూమి అంతా ఆయన రాజ్యములో భాగమవుతుంది. మరియు ఆయన భౌతిక అధికారము మరియు పరిపాలన భూలోక ప్రభుత్వములన్నిటిని తొలగించివేస్తుంది. ప్రస్తుతానికి, ఆయన సార్వత్రిక పరిపాలన ప్రాథమికముగా ఆత్మీయముగా ఉన్నది, దీనిని మనము ఎఫెసీ. 1:21-22లో చూస్తాము. కాని ఆయన తిరిగివచ్చినప్పుడు, అది భౌతికమైనదిగా కూడా ఉంటుంది. ప్రకటన 21-22 క్రొత్త ఆకాశములు మరియు క్రొత్త భూమిని గూర్చి ఒక మహిమకరమైన చిత్రమును ఇస్తాయి, అక్కడ నూతన యెరూషలేములోని ఆయన రాజధాని నుండి యేసు రాజుగా పరిపాలిస్తాడు.

యేసు నిజముగా ఎంతో కాలముగా ఎదురుచూసిన మెస్సీయ అని, దేవుని రాజ్యమును భూమి మీదికి తెచ్చిన దావీదు కుమారుడని క్రొత్త నిబంధన స్పష్టము చేస్తుంది. తన భూలోక పరిచర్యలో ఆయన పాత నిబంధన ప్రవచనములు మరియు ఆకాంక్షలు అన్నిటిని నెరవేర్చలేదు. కాని ఆయన వాటిలో చాలా వాటిని నెరవేర్చాడు కాబట్టి ఆయన నిజమైన రాజు అని రుజువు చేశాడు, మరియు తాను ఆరంభించినదానిని ముగించుటకు మరలా వస్తానని ఆయన మనకు నిశ్చయతను ఇచ్చాడు. ఆ దినమందు, ఆయన రాజ్యము నిశ్చయముగా సృష్టి కొరకు దేవుడు కలిగియుండిన వాస్తవిక ప్రణాళికలను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నెరవేర్చుతుంది. సర్వలోకము పాపము మరియు బాధ నుండి స్వతంత్రమై, సమాధానము మరియు ఐశ్వర్యము కలిగి దేవుని యొక్క భూలోక రాజ్యమవుతుంది, మరియు దేవుని యొక్క సహవాసము, సన్నిధి ద్వారా దీవించబడుతుంది.

రాజైన యేసు అను మన పాఠములో ఇప్పటి వరకు, యేసు యొక్క రాజు స్థానమునకు పాత నిబంధన నేపథ్యమును మరియు క్రీస్తులో ఈ స్థానము యొక్క నెరవేర్పును మనము చూశాము. కాబట్టి, ఇప్పుడు మన చివరి ముఖ్యాంశమును చూచుటకు సిద్ధముగా ఉన్నాము: రాజుగా యేసు పాత్రకు ఆధునిక అనువర్తన.

## ఆధునిక అనువర్తన

యేసు రాజత్వమునకు ఆధునిక భావనలు వర్ణించుటకు అనేక మార్గములు ఉన్నప్పటికీ, *వెస్ట్మి నిస్టర్ షార్టర్ కేటకిజం* 26వ ప్రశ్నోత్తరములో ఒక సహాయకరమైన పద్ధతిని మనము చూడవచ్చు. ఈ క్రింది ప్రశ్నకు జవాబుగా:

> ప్ర. యేసు రాజు స్థానమును ఎలా నెరవేర్చాడు?

మతోపదేశము ఇచ్చిన జవాబు:

> జ. మనలను ఆయనకు లోపరచుకొనుట ద్వారా, మనలను పాలించుచు సమర్థించుట ద్వారా, ఆయన మరియు మన విరోధులందరినీ అడ్డగించి జయించుట ద్వారా క్రీస్తు రాజు యొక్క స్థానమును నెరవేర్చాడు.

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క మూడు సాంప్రదాయిక విభాగముల దృష్ట్యా యేసు యొక్క రాజత్వము మన జీవితముల మీద ప్రభావము చూపు విధానములను ఈ జవాబు వర్ణిస్తుంది. మొదటిగా, యేసు మనలను తనకు లోపరచుకున్నాడు, అనగా, మనమిక ఆయన శత్రువుల వలె ఉండక ప్రియమైన పౌరుల వలె ఉండునట్లు ఆయన మనలను రాజ్యములోనికి తీసుకొనివస్తాడు. రెండవదిగా, మనలను పాలించుట మరియు సమర్థించుట ద్వారా ఆయన తన రాజ్యమును పాలిస్తాడు. మరియు మూడవదిగా, ఆయన తన మరియు మన విరోధులందరినీ అడ్డగించి తుదకు జయిస్తాడు.

*వెస్ట్మి నిస్టర్ షార్టర్ కేటకిజం*లోని ఉద్ఘాటనను అనుసరిస్తూ, యేసు రాజు స్థానము యొక్క ఆధునిక అనువర్తనను మూడు భాగములలో చూద్దాము: మొదటిగా, యేసు తన రాజ్యమును నిర్మిస్తాడు అని చూద్దాము. రెండవదిగా, ఆయన తన ప్రజలను పాలిస్తాడు అను వాస్తవమును పరిగణిద్దాము. మరియు మూడవదిగా, ఆయన తన శత్రువులను జయించు విధానము మీద దృష్టి పెడదాము. యేసు తన రాజ్యమును నిర్మించు విధానమును మొదట చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ఆయన రాజ్యమును నిర్మించుట

యేసు తన రాజ్యమును నిర్మించు విధానమును మూడు దృష్టికోణములలో మనము చూద్దాము: మొదటిగా, ఆయన చేయు పని యొక్క లక్ష్యము; రెండవదిగా, లోకములో ఆయన రాజ్యము యొక్క వ్యక్తీకరణ; మరియు మూడవదిగా, తన రాజ్యమును నిర్మించుటకు యేసు ఉపయోగించు విధానములు. యేసు చేయు పని యొక్క లక్ష్యముతో ఆరంభిద్దాము.

### లక్ష్యము

భూమి మీద తన పరిపాలన తన పరలోక పరిపాలనను ప్రతిబింబించునట్లు లోకమంతటిని తన భూలోక రాజ్యముగా మార్చుటకు దేవుడు ప్రణాళిక చేయుచున్నాడు అని లేఖనము బోధిస్తుంది. దీనిని మనము మత్తయి 6:10లో చూస్తాము, అక్కడ దేవుని రాజ్యము వచ్చునట్లు, మరియు పరలోకమందు నెరవేరునట్లు భూమి మీద కూడా తన చిత్తము నెరవేర్చునట్లు ప్రార్థించమని యేసు మనకు బోధించాడు. మరియు దీనిని ప్రకటన 21-22లో వర్ణించబడిన క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమి చిత్రములో మనము చూస్తాము. కాబట్టి, విశాలమైన భావనలో, లోకమును దేవుని యొక్క భూలోక రాజ్యముగా మార్చుట, ఆయనకు నివాస యోగ్యముగా చేసుకొనుట, మరియు తన పట్ల స్వామిభక్తి గల ప్రజలతో దానిని నింపుట యేసు రాజ్య నిర్మాణము యొక్క లక్ష్యమైయున్నది.

అయితే భూలోక రాజ్యమును స్థాపించుట దేవుని లక్ష్యమైతే, దీనిలో యేసు ఎలాంటి పాత్రను పోషిస్తాడు? సరే, సృష్టి యావత్తు మీద దేవుడు సర్వోన్నతమైన రాజు అయ్యున్నప్పటికీ, మరింత సూటిగా దానిని పాలించుటకు ఆయన యేసును నియమించాడు, తద్వారా దేవుని రాజ్యము సరిగానే యేసు రాజ్యము అని పిలువబడుతుంది. ఈ విషయములో, దేవుడు పురాతన పశ్చిమ ఆసియా ప్రభువును పోలియున్నాడు, మరియు యేసు ఆయన యొక్క సామంత రాజుగా ఉన్నాడు. మరియు యేసు తన ప్రభువును సంతోషపరచాలని కోరతాడు కాబట్టి, దేవుని లక్ష్యమును నెరవేర్చుటకు ఆయన తనను తాను సమర్పించుకుంటాడు. తండ్రియైన దేవునికి యేసు సమర్పించుకున్న విధానమును గూర్చి 1 కొరింథీ. 15:24, 28లో పౌలు వర్ణించిన విధానమును వినండి:

> **అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును... మరియు సమస్తమును ఆయనకు లోపరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును (1 కొరింథీ. 15:24, 28).**

దేవుని యొక్క ఉన్నతమైన సామంత రాజుగా, యేసుకు దేవుని రాజ్యము మీద, మరియు సృష్టి మీద కూడా అధికారము ఉన్నది. మరియు దేవుని ఎదురించు ప్రతిదానిని జయించుటకు, దేవునికి సమస్తమును లోపరచుటకు, ఆయన సృష్టిలో దేవుని ఉద్దేశములను నెరవేర్చుటకు ఆయన ఆ అధికారమును ఉపయోగించుచున్నాడు.

అయితే ఈ లక్ష్యముకు మనకు సంబంధం ఏమిటి? లోకమంతటిని దేవుని రాజ్యముగా మార్చుట యేసు యొక్క లక్ష్యము అను ఆలోచనకు ఆధునిక క్రైస్తవులు ఏ విధంగా స్పందించాలి? మనము కూడా

దేవుని రాజ్యమును మన జీవితముల యొక్క ప్రధానమైన లక్ష్యముగా చేసుకోవాలి అనునది దీనికి సులువైన జవాబు. మనము కలిగియుండు ఏ ఇతర లక్ష్యములైనా — జీవనము కొరకు సంపాదించుట, కుటుంబముల కొరకు సమకూర్చుట, ఆరోగ్యవంతముగా జీవించుట, చదువుకొనుట — అవన్నీ దేవుని రాజ్యమును వ్యాప్తి చెందించు విధముగా జరపబడాలి. యేసు మత్తయి 6:33లో బోధించినట్టుగా:

> కాబట్టి మీరు ఆయన [దేవుని] రాజ్యమును నీతిని మొదట వెదకుడి;
> అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును (మత్తయి 6:33).

యేసు తన రాజ్యమును నిర్మించుటకు ఉపయోగించు మార్గములో మనము ప్రస్తావించు రెండవ కోణము ఏమనగా, లోకములో రాజ్యము యొక్క వ్యక్తీకరణ.

## వ్యక్తీకరణ

యేసు రాజ్యము యొక్క ప్రస్తుత వ్యక్తీకరణమును గూర్చి క్రొత్త నిబంధన మాట్లాడునప్పుడు అది తరచుగా రాజ్యమును సంఘముతో ముడిపెడుతుంది అని చాలామంది వేదాంతవేత్తలు అనేక యుగములుగా ఆలోచించుచున్నారు. రాజ్యము మరియు సంఘము మధ్య ఉన్న అనుబంధమును ఎఫెసీ. 1:19-2:20; మరియు ప్రకటన 1:4-6 వంటి అనేక లేఖన భాగములు వర్ణించుచున్నవి. ఒక ఉదాహరణగా, మత్తయి 16:16-19లో యేసుకు పేతురుకు మధ్య జరిగిన ఈ సంభాషణను వినండి:

> అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేకాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు. ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను (మత్తయి 16:16-19).

రాజ్యమును సంఘముతో దగ్గరగా అనుబంధపరచు కనీసం మూడు విషయములను ఈ వాక్య భాగం తెలియజేస్తుంది. మొదటిగా, “నా సంఘమును కట్టుదును” అని యేసు సెలవిచ్చాడు. తరువాత “పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను” అని పేతురుతో చెబుతూ ఆయన ఈ కథనమును కొనసాగించాడు. ఇక్కడ సంబంధమును చూడండి: అపొస్తలుడును *సంఘము* యొక్క పునాదిలో భాగమైయున్న పేతురు పరలోక “రాజ్యము” మీద అధికారమును కలిగియుంటాడు.

రాజ్యము మరియు సంఘము మధ్య ఉన్న అనుబంధమును ఎత్తి చూపు రెండవ విషయము ఏమనగా, పేతురు యేసు కొరకు క్రీస్తు అను బిరుదును ఉపయోగించాడు అను వాస్తవము. “క్రీస్తు” అను మాటకు అభిషిక్తుడు అని అర్థము. సింహాసనము మీద వారి అధికారమును ప్రకటించుటకు రాజులు నూనెతో అభిషేకించబడేవారు అను సత్యమునకు ఇది ఒక విశేషమైన సంబోధన అయ్యున్నది. కాబట్టి

యేసును "క్రీస్తు" అని పిలచుట ద్వారా, పేతురు యేసును ప్రవచించబడిన దావీదు రాజుగా గుర్తించుచున్నాడు. మరియు రాజుగా ఆయన పోషించు పాత్రలో యేసు సంఘమును నిర్మించబోతున్నాడు.

రాజ్యము మరియు సంఘము మధ్య ఉన్న అనుబంధమును తెలియపరచు మత్తయి 16:16-19లో ఇవ్వబడిన మూడవ వివరణ ఏమనగా, పాతాళము లేక "నరకము" మరియు దేవుని రాజ్యమునకు మధ్య జరుగు యుద్ధములో పాలుపంచుకోవాలని యేసు సంఘమును సూచించాడు.

యేసు మరియు పేతురు ఇరువురు సంఘమును గూర్చి మరియు రాజ్యమును గూర్చి అనుబంధిత అంశములుగా ఆలోచించారు అను సత్యమును ఈ వివరములు తెలియపరచుచున్నవి. కాని సంఘము మరియు రాజ్యము ఎంత దగ్గర అనుబంధము కలిగియున్నను, అవి క్రొత్త నిబంధనలో ఖచ్చితమైన పోలికలను మాత్రం కలిగిలేవు. రాజ్యము సంఘము కంటే చాలా పెద్ద అంశమైయున్నదని ఎక్కువమంది పండితులు ఒప్పుకుంటారు.

> సంఘము మరియు దేవుని రాజ్యమునకు మధ్య ఉన్న అనుబంధము చాలా ఆసక్తికరమైనది. దేవుని రాజ్యము సమస్త విషయములను దేవుని యొక్క సంపూర్ణ చిత్తము యొక్క ఆధీనములోనికి పునరుద్ధరించు స్థూల-దర్శనమైయున్నది. ఇది విశ్వమంతటిని గూర్చిన, ఈ గోళము మరియు మానవ జీవితము అంతటిని గూర్చిన దర్శనమైయున్నది. దేవుని మహిమ కొరకు మరియు మన గొప్ప ఆనందము కొరకు రూపించబడిన గొప్ప శాంతికరమైన జీవితమును కలిగించు రాజుకు సమర్పణ ఇది. ఈ స్థూల-దర్శనమును నెరవేర్చుటకు దేవుడు ఎన్నుకొనిన ప్రధానమైన పరికరము సంఘము. సంఘమును మరియు ఇతర మతపరమైన సంఘ భవనములను రాజ్యముతో పోల్చుట సరికాదు; అవి ఒకటి కాదు, కాని ఒకటి మరొక దానిని సాధించుటకు మార్గమైయున్నది. అలాగే, కొండ మీద పట్టణము వలె సంఘము దాని యొక్క అంతరంగ జీవితములో మరియు సామాజిక క్రియాశీలకములలో, దేవుడు ఒక దినమున సృష్టి అంతటిలో సముద్రము నుండి సముద్రము వరకు చూపు అవే క్రియాశీలకములను వ్యక్తపరచాలి. మనము రాజ్యమునకు నమూనాగాను రాజ్యమునకు ప్రతినిధులుగాను ఉండాలి.
>
> — డా. గ్లెన్ స్కోర్గి

> దేవుని రాజ్యము మరియు సంఘము అను అంశములు మన జీవితములోని ప్రతి భాగములో మనము జీవించవలసిన విధానమును గూర్చి సంపూర్ణ క్రైస్తవ అవగాహన కలిగియుండుటకు అగత్యమైనవిగా ఉన్నాయి. కాని ఈ రెంటి మధ్య కొంత తేడా కలిగియుండుట కూడా ప్రాముఖ్యమని నా ఆలోచన. చాలా మంది క్రైస్తవులు, కొన్ని సంవత్సరముల వరకు నేను కూడా, సంఘము రాజ్యము యొక్క ముగింపు అని, కాబట్టి ఇది అత్యంత ప్రాముఖ్యమైనది అని ఆలోచించాము. కాని

> లేఖనమంతటిలో ఉన్న రాజ్య ఆలోచన సంఘము కంటే చాలా పెద్దదై యున్నది. కాబట్టి నా ఆలోచన ప్రకారం, మరియు బైబిలు ఆలోచన కూడా ఇదే అనుకుంటాను, సంఘము రాజ్యములో ఒక మార్చలేని భాగమేగాని, అది రాజ్య కార్యములో ఒక ఉపభాగమైయున్నది. దేవుని రాజ్యము, ఆయన పరిపాలన ఎల్లప్పుడు సత్యమునకు పునాదిగా ఉన్నాయి. ఆయన విశ్వమును, సృష్టియంతటిని, మరియు మనలను పాలించుచున్న రాజైయున్నాడు. ఆయన ప్రజలందరి మీద, దేశములన్నిటి మీద, రాజులందరి మీద, జాతులన్నిటి మీద ప్రభువైయున్నాడు. ఇప్పుడు చాలా మందికి ఇది తెలియదుగాని, ఆయన పాలించుచున్నాడు. కాబట్టి దేవుని రాజ్యము, దేవుని పరిపాలన లేఖనములో ప్రాముఖ్యమైన అంశములుగా ఉన్నాయి. కాబట్టి సంఘము యేసు యొక్క ప్రభుత్వమునకు సమర్పించుకున్న, ఆయన సార్వభౌమ ప్రభుత్వమును గుర్తించి లోకములో ఆయన ప్రతినిధులుగా ఉండుటకు తమను తాము సమర్పించుకున్న ప్రజల గుంపైయున్నది.
>
> — డా. బిల్ ఉరి

సృష్టి మీద దేవుని పరిపాలన యొక్క అంతిమ మహిమరకమైన స్థాయి క్రీస్తు యొక్క మొదటి రాకడలో ఆరంభమైయ్యింది అని క్రొత్త నిబంధన బోధిస్తుంది. ఆ సమయము నుండి భూమి మీద దేవుని రాజ్యము ఎదుగుట మరియు మానవ సంస్కృతి యొక్క అనేక కోణములను దేవుని ఆధీనములోనికి తెచ్చుట కొనసాగుతూనే ఉంది. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, దేవుని రాజ్యము పూర్తిగా ఎదురులేనిదవుతుంది మరియు ప్రకృతి, మానవ సంస్కృతిలోని ప్రతి కోణములోను పూర్తిగా వ్యక్తపరచబడుతుంది.

అయితే సంఘము ఈ చరిత్ర యొక్క ఆకారములో ఎలా ఇమడ్చబడుతుంది? ముఖ్యముగా, ప్రస్తుత యుగములో భూమి మీద సంఘము దేవుని రాజ్యము యొక్క మూలముగా ఉన్నది. దేవుని రాజ్యమును వ్యాప్తిపరచుటకు మనలను మనము ఇప్పుడు సమర్పించుకొనుచున్నాము. మరియు క్రీస్తు తిరిగివచ్చినప్పుడు, మనము రాజ్యము యొక్క సంపూర్ణ ఆశీర్వాదములను పొందుకుంటాము. ఆ కాలము వరకు, క్రీస్తు రాకకు ముందు వీలైనంత వరకు మానవ సమాజము యొక్క ప్రతి కోణములో దేవుని యొక్క పరిపాలనను వ్యాపింపజేయుటకు, ఆయన ఆజ్ఞాపించిన ప్రతిదానిని బోధించుట ద్వారా మనము క్రీస్తు సువార్తను ప్రకటిస్తాము.

> రాజ్యములో దాని యొక్క స్థానమును సంఘము అర్థము చేసుకొనుట చాలా అవసరము. భవిష్యత్తులో మనము ఆయనతో ఉండబోవుచున్నప్పుడు, ఆయన మరలా తిరిగి వచ్చినప్పుడు, మనము సంఘము అని సంబోధించబడతామని నేననుకొనుట లేదు. అది రాజ్యము అని పిలువబడుతుంది అని నా ఆలోచన. లేఖనములో మరొక ప్రాముఖ్యమైన చిత్రము ప్రకారం, వధువు వరుని ఎదుట నిలబడుతుంది. కాబట్టి ఈ విధముగా, కొన్నిసార్లు సంఘముగా మనలను గూర్చి మనము ఉన్నతముగా ఆలోచించుకుంటాము. మనము మాత్రమే జవాబు అని,

> లేక దేవుని ఏకైక ఉద్దేశము మనమేనని ఆలోచిస్తాము. మరియు మనము చాలా చాలా ప్రాముఖ్యమైన వారమనుకుంటాము. ఆయన సంఘము కొరకు మరణించాడు. ఆయన తనను తాను అర్పించుకొనుటకు మరణించాడు. కాని ఆయన లోకము కొరకు కూడా మరణించాడు. నాకు ఒక లక్ష్యమున్నది అది క్రీస్తు శరీరమైయుండుట అని చెప్పుట యేసు క్రీస్తు సంఘములో సభ్యునిగా నన్ను నేను చూచుకొనుటకు ఉత్తమమైన మార్గమైయున్నది. ఒకవేళ ఆయన ఇక్కడ ఉంటే ఆయన చేయునట్లే లోకమునకు ఆయన చేతులుగా, ఆయన పాదములుగా, ఆయన భుజములుగా ఉండుటకు నేను పిలువబడితిని. సంఘముగా ఇది నాకు మరియు మనకు నా రాజు ఇచ్చిన ఆజ్ఞ. "అవును, మనము రాజ్యము యొక్క ముగింపుగా ఉన్నాము, కాబట్టి, ఆయన చేయుటకు వచ్చుదానికి మనము ముగింపుగా ఉన్నాము కాబట్టి, మనము ఊరకనే ఏమి చేయకుండా కూర్చొని ఆయన మరలా వచ్చు వరకు ఆయన సన్నిధిని ఆస్వాదించుదాము" అని సంఘము చెప్పుట దుఃఖకరమైన విషయమని నా ఆలోచన. ఇది ఒక తప్పుడు అభిప్రాయమని నా ఆలోచన కాబట్టి మనలను మనము సరి చేసుకొని సంఘు ఉద్దేశమును మన ప్రభువును రక్షకుడైన రాజు యొక్క ఉద్దేశములతో కలుపు పనిలో మనము నిమగ్నము కావాలి.
>
> — డా. బిల్ ఉరి

యేసు తన రాజ్యమును నిర్మించుటకు గల లక్ష్యమును, మరియు ఆయన రాజ్యము యొక్క వ్యక్తీకరణములను మనము చూశాము కాబట్టి, తన రాజ్యమును నిర్మించుటకు యేసు ఉపయోగించు విధానములను ఇప్పుడు చూద్దాము.

## విధానములు

యేసు తన రాజ్యమును రెండు ప్రధానమైన మార్గములలో నిర్మిస్తాడు, ఈ రెంటిలో సంఘము సూటిగా పాలుపంచుకుంటుంది: ఆయన సంఘములో ఎక్కువమంది ప్రజలను చేర్చుతాడు, మరియు ఆయన దాని యొక్క *భౌగోళిక సరిహద్దులను* విశాలపరుస్తాడు. క్రొత్త నిబంధనలో, యేసు ప్రధానముగా ఇశ్రాయేలులోని ప్రజలను సమకూర్చుట ఆరంభించాడు. కాని తన రాజ్యమును యూదయ, సమరయ, మరియు భూదిగంతముల వరకు వ్యాపింపజేయమని తాను ఆరోహణము చెందినప్పుడు సంఘమును హెచ్చరించాడు, దీనిని మనము అపొ. 1:6-8లో చదువుతాము. సంఘములో మానవ జాతి అంతా చేర్చబడి లోకమంతా ప్రాకునట్లు సంఘమును వ్యాపింపజేయుట ద్వారా యేసు తన రాజ్యమును నిర్మించుచున్నాడు.

అయితే సంఘమైన మనము ఈ పనికి ఎలా స్పందిస్తాము మరియు దీనిలో ఏ విధముగా పాలుపంచుకుంటాము? సాధారణ పదములలో, మత్తయి 28:19-20లోని గొప్ప ఆజ్ఞలో ఇవ్వబడిన ఈ మాటలలో దీనికి జవాబు కనిపిస్తుంది.

> కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి (మత్తయి 28:19-20).

ఇక్కడ మనము చూస్తున్నట్లు, తన రాజ్యమును నిర్మించుటకు యేసు ఉపయోగించు ప్రాధమిక విధానములు సువార్త ప్రకటన, బాప్తిస్మము మరియు బైబిలు బోధన అయ్యున్నాయి. మరియు ఈ పద్ధతులను ఒంటి చేతితో ఉపయోగించక, ఆయన తరుపున ఈ బాధ్యతను ఆయన సంఘముకు పురమాయించాడు. సువార్త ప్రకటన ప్రజలను విశ్వాసములోనికి నడిపిస్తుంది. బాప్తిస్మము వారిని సంఘములో చేర్చుతుంది. సంఘమును బలపరచు విధముగా మరియు దానిని మరింతగా వ్యాపింపజేయునట్లు వారు ఎదుగుటకు బోధ సహాయపడుతుంది.

> సర్వలోకమునకు వెళ్లి, సువార్త ప్రకటించి శిష్యులను చేయు సవాలు సువార్తల యొక్క ముగింపులో మనకు ఇవ్వబడింది. శిష్యత్వ పరిభాష మనము కేవలం నేర్చుకొనువారిగా మాత్రమే ఉండకూడదు అని తెలియజేస్తుంది. మనము కేవలం విశ్వాసులుగా మాత్రమే ఉండకూడదు అని అది బోధిస్తుంది. మనము దేవునితో అనుబంధములో కూడా ఉండాలని అది తెలియజేస్తుంది. అవును, మనకు బోధించు దేవుడు. అవును, మనలను నడిపించు దేవుడు, కాని శిష్యులను చేయుటలో ఇమిడియున్న సవాలు ఏమనగా దేవుని నుండి జీవిత కాలమంతా నేర్చుకొనుచు, ఆయనతో అనుబంధము కలిగియుండు ప్రజలను కలిగియుండుట. మరియు ఇది సరైన ప్రణాళికలో జరగవలసియున్నది, కాబట్టి క్రైస్తవ జీవితమును సరిగా ఎలా జీవించాలో తమకు చూపు ఇతర విశ్వాసులతో ప్రజలు అనుబంధము కలిగియుండాలని నా ఆలోచన. దీని కొరకు బోధ ఖచ్చితముగా అవసరమే. తనను అనుసరించువారి కొరకు, తన శిష్యుల కొరకు దేవుడు ఆశించుచున్న అర్హతలను ప్రజలు అర్థం చేసుకోవాలి. అంతేగాక ఇది సంఘములో కూడా నాటబడాలని నా ఆలోచన, ఎందుకంటే సంఘములోనే ప్రజలు క్రైస్తవులుగా ఎదుగు, జీవితాంతము నేర్చుకొనువారిగా ఉండు, దేవునితో అనుబంధం కలిగియుండు మరియు నమ్మకముగా ఆయనను అనుసరించు నిర్మాణములను దేవుడు నియమించియుంచాడు.
>
> — డా. సైమన్ వైబర్ట్

యేసు తన రాజ్యమును నిర్మిస్తాడు అను ఆలోచన యొక్క ఆధునిక అనువర్తనను చూశాము కాబట్టి, ఆ రాజ్యములో ఆయన తన ప్రజలను పరిపాలిస్తాడు అను సత్యమును ఇప్పుడు చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## తన ప్రజలను పాలిస్తాడు

యేసు తన ప్రజలను పాలించు విధానములో రెండు కోణములను మనము పరిగణిద్దాము. మొదటిగా, ఆయన వారిని తమ మేలు కొరకు పాలిస్తాడు అను సత్యమును చూద్దాము. రెండవదిగా, ఆయన వారిని తన విరోధుల నుండి కాపాడతాడు అని చూద్దాము. మొదటిగా యేసు తన ప్రజలను ఎలా పాలిస్తాడో చూద్దాము.

### పాలిస్తాడు

మన కొరకు నిత్యమైన మేలు, అనగా ఆయనతో మనము నిత్యము అనుభవించు ఆశీర్వాదముల మీద యేసు యొక్క పలిపాలన దృష్టి పెడుతుంది. ఆయన యొద్దకు వచ్చు ప్రతివారు కనికరమును క్షమాపణను పొందుకుంటారు, దీనిని మనము యోహాను 6:35-37, 7:37, మరియు 10:28-29; మరియు అపొ. 5:31 వంటి లేఖన భాగములలో చూడవచ్చు. ఆయన మనలను దేవుని వారసులుగా స్వీకరిస్తాడు, మరియు తాను చూపిన పూర్ణ విధేయత ద్వారా పొందుకున్న నిబంధనా దీవెనలన్నిటిని మనతో పంచుకుంటాడు. యేసు పాలనలోని ఈ కోణములను మనము అపొ. 13:34-39; రోమా. 8:17, 32; మరియు హెబ్రీ. 2:13లలో చూస్తాము. అంతేగాక, యోహాను 1:16, మరియు ఎఫెసీ. 2:8-9 వంటి చోట్ల మనము చూచునట్లు కృపా వరముగా ఆయన మనకు ఈ దీవెనలన్నిటిని అనుగ్రహిస్తాడు.

క్రీస్తు యొక్క ప్రేమగల పరిపాలన ప్రస్తుత లోకములో మనకు తాత్కాలిక మేలును కూడా చేకూర్చుతుంది. పరిశుద్ధాత్మ ద్వారా ఆయన తన సన్నిధిని కూడా మనకు అనుగ్రహిస్తాడు, దీనిని మనము అపొ. 2:33, గలతీ. 4:6, మరియు ఫిలిప్పీ. 1:19లో చూస్తాము. ఆయనను మనము నమ్మకముగా సేవించునట్లు బైబిలులో మనకు ఆయన స్పష్టమైన దిశను చూపుతాడు, దీనిని మనము 1 కొరింథీ. 9:21, గలతీ. 6:2, మరియు కొలస్సీ. 3:16లో చూస్తాము. మరియు ఆయన సంఘము కొరకు నాయకత్వమును నియమిస్తాడు, మరియు ప్రజలకు పరిచర్య చేయు అధికారమును శక్తిని ఆయన వారికి అనుగ్రహిస్తాడు, దీనిని మనము 1 కొరింథీ. 12:28, మరియు ఎఫెసీ. 4:11-12లో చదువుతాము.

రాజైన యేసు కఠినమైన నియంత కాదు; ఆయన మన కొరకు శ్రద్ధ వహించు మరియు మనకు అనుగ్రహించు ప్రేమగల రాజు. ఆయన మనకు ఇబ్బందిని కలిగించువాడు కానేకాదు, కాని ఆయన పరిపాలన మనకు ఇప్పుడు మరియు ఎల్లప్పుడు ఉపయోగపడు దయగల దీవెనయైయున్నది. ఈ పరిపాలనకు మన స్పందన స్పష్టముగా ఉండాలి. మన రాజు మన కొరకు కలిగియున్న దీవెనలను పొందుకొనుటకు, మనము ఆయన పరిపాలనకు సమర్పించుకోవాలి. మన వైఫల్యాలను మరియు కష్టములను అధిగమించుటకు మనము ఆయన ధర్మశాస్త్రమునకు విధేయులై ఆయన కనికరము మరియు శక్తి మీద నమ్మకముంచాలి. అవును, ఆయన అనుగ్రహించు నాయకత్వమును బట్టి కృతజ్ఞత కలిగి, మన పట్ల ఆయన చూపు మంచితనమును బట్టి ఆయనను స్తుతించాలి.

యేసు తన ప్రజలను పాలిస్తాడు అను సత్యము యొక్క భావనలు గూర్చి మనము మాట్లాడాము కాబట్టి, ఆయన మనలను కాపాడతాడు అను ఆలోచనను ఇప్పుడు చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## కాపాడతాడు

యేసు విశ్వాసులను అనేక విధాలుగా కాపాడతాడు, అయితే ఈ పాఠంలో మన ఉద్దేశముల కొరకు మనము కేవలం మూడింటిని మాత్రమే చూద్దాము. మొదటిగా, యేసు మనలను పాప శోధన నుండి కాపాడతాడు.

మన రాజుగా, యేసు మనలను శోధనలో నుండి అనేక విధాలుగా కాపాడతాడు. ఉదాహరణకు, మత్తయి 6:13లో మనము చదువునట్లు ఆయన శోధనలను గూర్చి మనకు ముందు నుండే హెచ్చరికలను ఇస్తాడు. హెబ్రీ. 2:16లో మనము చదువునట్లు, పాపమును ఎదురించుటకు ఆయన మనకు బలమునిస్తాడు. 1 కొరింథీ. 10:13 మరియు 2 తిమోతి 4:18లో మనము చదువునట్లు, మనకు ఎల్లప్పుడూ పాపమును తప్పించుకొను మార్గమును అనుగ్రహిస్తూ మనలను చిక్కుల్లో పెట్టు పరిస్థితుల నుండి ఆయన మనలను కాపాడతాడు.

రెండవదిగా, మనము శోధనలోనికి పడినప్పుడు, మనలను పాపము యొక్క భ్రష్టత్వము నుండి యేసు కాపాడతాడు. మనము పాపము చేసినప్పుడు మనకు క్రమశిక్షణ కలిగించి మనలను సరి చేయుట ద్వారా యేసు మనలను భ్రష్టత్వము నుండి కాపాడతాడు, తద్వారా మనము పాపమునకు బానిసలము కాము. దీనిని మనము యిర్మీయా 46:28, హెబ్రీ. 12:5-11, ప్రకటన 3:19 వంటి అనేక ఇతర లేఖన భాగములలో చూస్తాము. మనకు క్షమాపణను అనుగ్రహించుట ద్వారా మరియు మనము పశ్చాత్తాపపడినప్పుడు మన పాపమును కడుగుట ద్వారా కూడా ఆయన మనలను భ్రష్టత్వము నుండి కాపాడతాడు, దీనిని మనము 1 యోహాను 1:9లో చూస్తాము.

మూడవదిగా, యేసు మనలను పాపము యొక్క నిందల నుండి కాపాడతాడు. క్రైస్తవులంతా పాపములో పడే అవకాశం ఉన్నవారే. మరియు మనము పాపములో పడినప్పుడు, మనలను శిక్షించమని సాతానుడు దేవుని బలవంతం చేస్తాడు, దీనిని మనము ప్రకటన 12:10 వంటి చోట్ల చదువుతాము. అయితే దేవుడు మనలను పరిపూర్ణ నీతిమంతులుగా ఎంచునట్లు యేసు మనలను ఈ నిందల నుండి కాపాడతాడు. ఆయన చేసిన ప్రధాన యాజక ప్రార్థన దృష్ట్యా క్రీస్తు మన కొరకు చేయు విజ్ఞాపనను గూర్చి లేఖనము తరచుగా మాట్లాడుచున్నను, ఇది ఒక రాజత్వ కోణము కూడా అయ్యున్నదని రోమా. 8:34 సూచిస్తుంది. గొప్ప సామంత రాజుగా, ఆ గొప్ప ప్రభువు ఎదుట మన కొరకు విజ్ఞాపన చేయుట ద్వారా యేసు తన ప్రజలను నిందల నుండి కాపాడతాడు.

యేసు మనలను అంత బలముగా సమర్థిస్తాడు కాబట్టి, పాపముతో మనము చేయు యుద్ధములలో మనము గొప్ప నిశ్చయత కలిగియుండవచ్చు. శోధనను ఎదురించుటకు ఆయన బలము మీద, పాపము యొక్క ప్రభావములను కడిగివేయుటకు ఆయన క్షమాపణ మీద, మరియు పాపము యొక్క పరిణామముల నుండి మనలను భద్రపరచుటకు ఆయన చేయు విజ్ఞాపన మీద మనము ఆధారపడినప్పుడు మనకు ఏ హాని కలుగదు. యేసు పాపముతో మనము చేయు యుద్ధములో మనలను నడిపించు గొప్ప, శక్తివంతమైన యుద్ధవీరుడైన రాజైయున్నాడు. మరియు మనము సరిగా పోరాడకపోయినా, మనము ఓడిపోము — ఎందుకంటే మనలను ఆయన ఓడిపోనియ్యడు. ఆయన ఎల్లప్పుడు మనలను కాపడతాడు మరియు భద్రపరుస్తాడు, క్షమిస్తాడు మరియు శుద్ధిచేస్తాడు, సమర్థిస్తాడు మరియు నిర్దోషులుగా ఎంచుతాడు. మరియు తుదకు, ఆయన మనలను తన నిత్య రాజ్యము యొక్క విఫలముకాని ఆశీర్వాదముల లోనికి నడిపిస్తాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

యేసు తన ప్రజలను పాలించు విధానములను మనము ఇప్పటి వరకు చూశాము కాబట్టి, ఆయన తన విరోధులను కూడా జయిస్తాడు అను సత్యమును చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## తన విరోధులను జయిస్తాడు

దేవుని ధర్మశాస్త్రము ఉల్లంఘించబడినప్పుడు, అనేకమంది చాలాసార్లు గాయపరచబడతారు. నేరములు జరుగుతున్నప్పుడు దీనిని మనము అనుదినము చూస్తాము. దోచుకొనబడిన, లేక వంచించబడిన, లేక కొట్టబడిన, లేక మోసపరచబడిన, లేక హత్యచేయబడిన క్షతగాత్రులు ఉన్నారు. మరియు లేఖన పరిభాషలో, ఈ నేరములు చేయు నేరస్తులు దేవునికి మరియు తాము హాని చేసినవారికి ఇరువురికి విరోధులయ్యారు. ఈ నేరస్తులను పట్టుకొని వారిని శిక్షించుట ప్రభుత్వము యొక్క సరియైన స్పందన అవుతుంది. వారికి ఇవ్వబడు తీర్పు వారు చేసిన నేరములకు సరియైన శిక్షగా ఉండాలి, మరియు వారు చేసిన నేరముల నుండి వారి బాధితులను మరియు మిగిలిన సమాజమును భద్రపరచు మార్గమై ఉండాలి. సామెతలు 20:8 మరియు 25:5 వంటి చోట్ల లేఖనము దీనిని గూర్చి మాట్లాడుతుంది.

యేసు తెచ్చు తీర్పు విషయములో కూడా ఇలాంటిదే వాస్తవమైయున్నది. వారు చేసిన నేరముల యొక్క దండనగా న్యాయపరముగా ఆయన తన మరియు మన విరోధులను శిక్షిస్తాడు. అంతేగాక వారి పాపము మరియు హింస నుండి మనలను భద్రపరచుటకు, మన కొరకు ఆయన చేయుచున్న లోకమును శుద్ధిచేయుటకు మరియు భద్రపరచుటకు మన పట్ల చూపు ఆశీర్వాదము మరియు దయా కార్యముగా కూడా ఆయన వారిని శిక్షిస్తాడు. ఇందువలనే పాపుల యొక్క తీర్పు మరియు నాశనము లోకమును దేవుని భూలోక రాజ్యముగా మార్చు యేసు యొక్క పనిలో ముఖ్యమైన భాగమైయున్నది. లోకము దేవునికి నచ్చినదిగాను ఆయన నివసించుటకు యోగ్యముగాను ఉండుటకు, దాని యొక్క నిత్య ఆశీర్వాదములను మనము ఆస్వాదించుటకు గాను, పాప భ్రష్టత్వము దానిలో నుండి పూర్తిగా తీసివేయబడాలి.

ఈ పాఠంలో ఇంతకు ముందు మనము చూసినట్లు, యేసు తన భూలోక పరిచర్యలో అనేకమంది తన మరియు మన విరోధులకు తీర్పు తీర్చుటను ఆయన ఆరంభించాడు. ఈ విరోధులలో పాపము, మరణము మరియు దయ్యములు కూడా ఉన్నాయి. ఈ విరోధుల మీద యేసు యొక్క విజయము భద్రపరచబడియున్నదిగాని, ఆయన వారిని శిక్షించుట ఇంకా ముగించలేదు. కాబట్టి, ప్రస్తుత యుగములో, వారికి విరోధముగా తీర్పు తీర్చుటను యేసు కొనసాగించుచున్నాడు, మరియు ఆయన తిరిగివచ్చినప్పుడు వారి తీర్పును పూర్తి చేస్తాడు. ఈ సత్యము 2 పేతురు 2:4; యూదా 6; మరియు ప్రకటన 20:10, 14లో బోధించబడింది.

కాని యేసుకు మరియు ఆయన సంఘమునకు ఇతర విరోధులు కూడా ఉన్నారు. తనను తాను క్రీస్తుకు సమర్పించుకొనని ప్రతి పాపి సాతాను రాజ్య పౌరుడైయున్నాడు మరియు దేవునికి విరోధియైయున్నాడు. మత్తయి 13:37-43; లూకా 19:27; మరియు ఎఫెసీ. 2:1-3లో లేఖనము దీనిని స్పష్టము చేస్తుంది.

ప్రస్తుత కాలములో, యేసు ఈ స్వల్ప తీర్పును ఈ విరోధులలో కొంతమందికి వారి భూలోక జీవిత కాలములోనే ఇస్తాడు, దీనిని మనము అపొ. 12:23లో ప్రజలు తనతో దేవుని వలె వ్యవహరించుటకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అనుమతి ఇచ్చినందున హేరోదు కొట్టబడి చంపబడిన సందర్భములో చూస్తాము. కాని చాలా వరకు, యేసు విరోధులకు తీర్పు తీర్చుటలో దీర్ఘశాంతము చూపుతాడు, మరియు ఆయన తిరిగివచ్చునంత వరకు సహనముతో తీర్పును నివారిస్తాడు.

> భవిష్యత్ తీర్పు క్రొత్త నిబంధనలో తెలుపబడిన సువార్తలో ఒక భాగముగా వ్యక్తపరచబడుట చాలా ఆసక్తికరమైన విషయము. ఇది సువార్తలో ఒక ఆసక్తికరమైన అంశముగా ఉన్నది. కాని సత్యమేమిటంటే ఇది సువార్తలో భాగమైయున్నది. మరియు ఇది సువార్తలో భాగమైయుండుటకు కారణమేమిటంటే, ఏ విధముగానైతే శ్రమలు నిత్యముండక, స్వస్థతతో వాటికి జవాబు ఇవ్వబడుతుందో, అలాగే అన్యాయము అదుపు లేకుండా కొనసాగుటకు అవకాశం ఇవ్వబడదు గాని, తప్పు సరిదిద్దబడుతుంది అని దేవుడిచ్చే నిశ్చయత దీనిలో ఉన్నది. అన్యాయము నిలువబడలేదు, లేక మనము ముందుకు కొనసాగుచున్నాము కాబట్టి అంత ముఖ్యమైనది కానిదిగా కొట్టివేయబడుతుంది అనే ఒక లోతైన వాంఛ ప్రతి మానవ హృదయములో కనబడుతుంది. ఇది సహించబడదు అని హింసించబడువారికి దేవుడిచ్చు నిశ్చయత వాగ్దానమైయున్నది. వారికి ఒక న్యాయవాది ఉన్నాడు, కాబట్టి వారు ప్రతీకారముతో తాము స్వయంగా న్యాయము తీర్చుటకు ప్రయత్నించక మేలు చేయు నమ్మకమైన న్యాయాధిపతికి తమను తాము సమర్పించుకోవాలి.
>
> — డా. గ్లెన్ స్కోర్గి

రాజుగా యేసు యొక్క పరిపాలనలో భవిష్యత్ తీర్పు దినము కూడా ఇమిడియున్నదని, అప్పుడు ప్రతి ఒక్కరు ఆయన పరిపాలనకు మరియు ఆయన నియమమునకు జవాబుదారులుగా ఉంటారని అపొస్తలులు స్పష్టము చేశారు. అంత్యదిన తీర్పును గూర్చి అపొ. 17:31, రోమా. 14:10-12, మరియు హెబ్రీ. 10:26-31 వంటి చోట్ల ప్రస్తావించబడింది. రానున్న తీర్పు దినము రాజుగా క్రీస్తు యొక్క పనికి కేంద్రముగా ఉన్నది ఎందుకంటే అది పాపుల పట్ల ఆయన న్యాయమును, విశ్వాసుల పట్ల ఆయన కనికరమును, మరియు రాజ్యమును శుద్ధిచేయుచుండగా తండ్రి పట్ల ఆయన నమ్మకత్వమును నెరవేర్చుతుంది.

క్రీస్తును ప్రభువుగా అంగీకరించనివారికి అంత్య తీర్పు సిద్ధాంతము భయమును కలిగించునప్పటికీ, ఇది చెడ్డది కాదు. ఈ హెచ్చరికలు తమ పాపమును ఒప్పుకొని, మన రాజైన యేసు క్రీస్తు నుండి క్షమాపణను, కనికరమును మరియు కృపను పొందుకొనుటకు అపనమ్మకస్తులకు ఒక అవకాశమును అనుగ్రహిస్తాయి. అవును, ఇక్కడ కఠినమైన మాటలు ఉపయోగించబడినవి. కాని వాస్తవానికి, పశ్చాత్తాపపడువారి కొరకు ఇవి దీవెనలను ప్రతిపాదిస్తాయి. వాస్తవానికి, ఇందు మూలముగానే బైబిలులో ఇవ్వబడిన సువార్త సందేశములు భవిష్యత్ తీర్పును గూర్చిన హెచ్చరికను కలిగియుంటాయి. ఉదాహరణకు, దీనిని మనము మత్తయి 21:32-44 మరియు అపొ. 17:30-31లో చూస్తాము.

లేఖనములో సువార్త యొక్క వివరణ మరియు ఇవ్వబడిన విధానమును బట్టి కొన్నిసార్లు క్రైస్తవులు కలవరపడతారని నేననుకుంటాను, దానిలో పశ్చాత్తాపపడని, క్రీస్తులో లేని, తమ పాపములలో చచ్చినవారి యొక్క నాశనకరమైన నిత్య శిక్షను గూర్చి స్పష్టమైన సందేశము ఉంది. మీకు తెలుసా, ఒక వైద్యుడు నా ముఖమును సూటిగా చూసి, "నీలోపల ఒక గడ్డ ఉంది" అని చెప్పినప్పుడు నేను కొంచెం సరిగా అర్థము చేసుకుంటానని నా ఆలోచన. ఇప్పుడు, ఇది శుభవార్తలా అనిపించదు గాని, ఇది నిజముగా శుభవార్తే. ఆయన దానిని కనుగొన్నాడు కాబట్టి ఇది శుభవార్త. దానిని గూర్చి నాకు చెప్పాడు కాబట్టి ఇది శుభవార్త. నాలో గడ్డ ఉందని నాకు చెప్పుట మంచిది కాదు అని అతడు అనుకుంటే ఏమైయ్యేది? అది ప్రేమించుట అవ్వదు; అది కృప చూపుట అవ్వదు. అది మంచిది కాదు. ఆయన గడ్డను చూశాడు, "ఇది నిజం. నీలో గడ్డ ఉంది, అది నిన్ను చంపుతుంది. కాని దానికి ఒక పరిష్కారం మనం వెదకగలము" అని నాకు చెప్పాడు. కాబట్టి ఇది శుభవార్త. మీకు తెలుసా, రానున్న తీర్పును గూర్చి, పాపము యొక్క పరిణామములను గూర్చి లేఖనము చాలా స్పష్టముగా మాట్లాడుతుంది. అది శుభవార్త అని మనకు తెలుసు. అది దేవుని యొక్క మహిమను కనుపరుస్తుంది కాబట్టి కూడా అది శుభవార్త. తీర్పు వస్తుంది అని మనకు చెప్పబడలేదు, మరియు ఇది జరగకుండా దేవుడు ఆపలేడు. ఇది దేవుని నీతి, ఆయన న్యాయము మరియు ఆయన పరిశుద్ధత యొక్క కుమ్మరింపు అని మనకు తెలుపబడింది. కాబట్టి, మనము క్రీస్తు దగ్గరకు పరిగెత్తుటకుగాను, మనము నాశనమును తప్పించుకొనుటకుగాను తీర్పు జరుగుతుంది అని తెలుసుకొనుట మంచిది. కాని, క్రొత్త నిబంధన యొక్క చివరి అధ్యాయములలో ప్రకటన గ్రంథములో బైబిలు చాలా నిజాయితీగా మాట్లాడుతూ దేవుని మహిమ విమోచించబడినవారి యొక్క మహిమలో మరియు పశ్చాత్తాపపడనివారి మీద కుమ్మరింపబడు తీర్పులో ఉన్నదని తెలియజేస్తుంది. ఇప్పుడు, దీనిని మనము చూసినప్పుడు, దేవుని మహిమ చాలా ప్రత్యేకమైనదిగా ఉన్నదని, ఆయన నీతి కనుపరచబడినప్పుడు అపారముగా కనబడుతుంది అని, క్రీస్తులో ఉండి తమ సొంత నీతి వలన గాక క్రీస్తులో పాపముల క్షమాపణ పొందినవారు, మరియు చివరికి ఆయనను పూర్తిగా నిరాకరించిన వారికి కూడా కనబడుతుంది అని మనము గుర్తించాలి. వాస్తవమేమిటంటే, దీనిని మనము తెలుసుకోవాలి. సువార్త మొట్టమొదటిగా శుభవార్త ఎందుకు అవుతుంది అంటే, రానున్న నాశనము నుండి ఎలా పారిపోవాలో, క్రీస్తును నమ్మి, ఆయనలో కనుగొనబడి నిత్య జీవమును ఎలా పొందుకోవాలో అది మనకు తెలియజేస్తుంది. మనము మిగిలిన కథను కూడా తెలుసుకోవాలి కాబట్టి కూడా ఇది శుభవార్త అయ్యున్నది. ఇది కూడా సువార్తలో భాగమైయున్నది.

— డా. ఆర్. ఆల్బర్ట్ మొహ్లార్, జూ.

అంతిమ తీర్పును గూర్చి బైబిలు యొక్క బోధన విశ్వాసులను ప్రోత్సహించునదిగా ఉండాలి. మన శ్రమ వ్యర్థము కాదు అని అది మనకు నిశ్చయతను ఇస్తుంది. యాకోబు 5:7-8, మరియు 2 థెస్స. 1:4-10లో మనము చదువునట్లు ప్రతి తప్పు సరిచేయబడుతుంది. క్రీస్తు ఇచ్చు తీర్పు స్తుతికి యోగ్యమైనది, ఎందుకంటే అది ప్రతివిధమైన చెడు యొక్క సన్నిధిని, భ్రష్టత్వమును మరియు ప్రభావమును నాశనము చేస్తుంది, మరియు మనము నిత్యము ఉండునట్లు సంపాదించుకొను శుద్ధిచేయబడిన పూర్ణమైన లోకమును అది స్థాపిస్తుంది. ప్రకటన 14:7లో దేవదూత ప్రకటించినట్లు:

> **మీరు దేవునికి భయపడి ఆయనను మహిమపరచుడి; ఆయన తీర్పుతీర్చు గడియ వచ్చెను గనుక ఆకాశమును భూమిని సముద్రమును జలధారలను కలుగజేసిన వానికే నమస్కారము చేయుడి (ప్రకటన 14:7).**

## ముగింపు

ఈ పాఠంలో, యేసు యొక్క రాజ స్థానమును మనము విశదీకరించాము. అర్హతలు మరియు కార్యములు, మరియు భవిష్యత్తు కొరకు ఆకాంక్షల దృష్ట్యా ఆయన స్థానము యొక్క పాత నిబంధన నేపథ్యమును మనము పరిగణించాము. రాజ స్థానములోని ప్రతి కోణము యొక్క నెరవేర్పును మనము క్రీస్తులో చూశాము. యేసు తన రాజ్యమును నిర్మించు విధానము, తన ప్రజలను పాలించు విధానము మరియు తన విరోధులను జయించు విధానము దృష్ట్యా యేసు రాజత్వము యొక్క ఆధునిక అనువర్తనను కూడా మనము చూశాము.

ఈ పాఠ్యక్రమములో, క్రీస్తు సిద్ధాంతములోని నిధులను మనము విశ్లేషించాము. చరిత్రయంతటిలో విమోచకునిగా యేసును మనము చూశాము; ఆయన జీవితము మరియు పరిచర్యను పరిగణించాము; మరియు ప్రవక్తగా, యాజకునిగా మరియు రాజుగా ఆయన స్థానమును విశదీకరించాము. అయితే, యేసును గూర్చి మనము కలిగియుండు జ్ఞానము ఎన్నడు కూడా కేవలం అధ్యయన సంబంధమైనది మాత్రమే అయ్యుండకూడదు. కాని ఆయన ఎవరో మనము గ్రహించినప్పుడు, తనను గూర్చి ఆయన బయలుపరచినదానిని అర్థము చేసుకున్నప్పుడు, మనము చేయు ప్రతిదానిలో, మన ఇండ్లలో, మన పనిలో, మన సంఘములలో మన జీవిత కాలమంతా మనము ఆయనను ప్రేమించి ఆయనను వెంబడిస్తాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.